

సీఎం చంద్రబాబు నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ పెట్టుబడులకు అనుకూల రాష్ట్రంగా ఎదుగుతోంది. వ్యవసాయం, పరిశ్రమలు, సేవారంగాల్లో అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌తో పారిశ్రామికవేత్తలకు ఆకర్షణీయ గమ్యస్థానంగా, దేశానికి ఆదర్శంగా నిలుస్తోంది.

ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్సీ

శుక్రవారం 06.11.2026

INK OF TRUTH

జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక

సంపుటి - 34 | సంచిక - 196 | www.journalistfile.com | పేజీలు 8 | వెల : రూ.5.00

ముగిసిన పరిషత్ పోరు





పరిషత్ పోలింగ్ వేళ.. పలుచోట్ల ఉద్రిక్తతలు

65-68 శాతం పోలింగ్ నమోదైనట్లు అంచనా

582 జడ్పీటీసీ, 7,767 ఎంపీటీసీ స్థానాలకు పోలింగ్

21,012 మంది అభ్యర్థుల భవితవ్యం బ్యాలెట్ పెట్టెల్లో నిక్షిప్తం

7న ఓట్ల లెక్కింపు.. ఫలితాల వెల్లడి

కడప, తిరుపతి జిల్లాల్లో పెట్రోల్ బాంబులతో దాడులు

పులివెందుల ఎర్రిపల్లె, పెనగలూరు నల్లపురెడ్డిపల్లెలో ఘటనలు

2 లో

పోలింగ్ కేంద్రాల వద్ద టీడీపీ-వైకాపా వర్గాల ఘర్షణ

బలిజిపేట, గరివిడిలోనూ తోపులాటలు

అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) : ఉదయం వంగ్.. మధ్యాహ్నం మందకొడి.. ఆ తర్వాత ఊపందుకున్న పోలింగ్! రాష్ట్రవ్యాప్తంగా ఉత్కంఠ రేపిన జిల్లా, మండల పరిషత్ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ గురువారం సాయంత్రం ముగిసింది. ఉదయం ఏడు గంటలకు ప్రారంభమైన ఓటింగ్ సాయంత్రం ఐదు గంటల వరకు కొనసాగింది. అప్పటికి క్యూలైన్లలో ఉన్న ఓటర్లందరికీ ఓటు వేసే అవకాశం కల్పించారు. పలు జిల్లాల్లో భారీ వర్షాలు ఓటింగ్‌పై ప్రభావం చూపినా.. మధ్యాహ్నం తర్వాత ఓటర్లు పెద్ద సంఖ్యలో పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చారు. ప్రాథమిక అంచనాల ప్రకారం గ్రామీణ ప్రాంతాల్లో 65 నుంచి 68 శాతం మధ్య పోలింగ్ నమోదైనట్లు తెలుస్తోంది. 21,012 మంది అభ్యర్థుల రాజకీయ భవితవ్యం బ్యాలెట్ పెట్టెల్లో నిక్షిప్తమైంది. ఈ నెల 7న ఓట్ల లెక్కింపు జరగనుండటంతో అభ్యర్థుల్లో ఉత్కంఠ నెలకొంది.

10,480 స్థానాలకు ఎన్నికల ప్రక్రియ : రాష్ట్రంలో మొత్తం 659 జడ్పీటీసీ, 9,821 ఎంపీటీసీ స్థానాలు ఉండగా.. వీటిలో 77 జడ్పీటీసీ, 2,051 ఎంపీటీసీ స్థానాలు ఏకగ్రీవమయ్యాయి. మిగిలిన 582 జడ్పీటీసీ, 7,767 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు నిర్వహించారు. మొత్తం 21,012 మంది అభ్యర్థులు తమ అదృష్టాన్ని పరీక్షించుకున్నారు. ఉదయం నుంచే ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు చేరుకుని ఓటు హక్కు వినియోగించుకున్నారు.

వర్షంతో మందకొడి.. తర్వాత జోరు : పలు జిల్లాల్లో ఉదయం నుంచి ప్రతికూల వాతావరణం, భారీ వర్షాలు పోలింగ్ శాతంపై ప్రభావం చూపాయి. దీంతో మధ్యాహ్నం వరకు ఓటింగ్ మందకొడిగా సాగింది. వర్షం తగ్గుముఖం పట్టడంతో మధ్యాహ్నం తర్వాత పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్ల రద్దీ పెరిగింది. సాయంత్రం ఐదు గంటలకు పోలింగ్ ముగిసే సమయానికి క్యూలైన్లలో ఉన్నవారికి కూడా ఓటు వేసే అవకాశం కల్పించారు. తుది అధికారిక పోలింగ్ శాతం ప్రకటించాల్సి ఉంది.

పలు చోట్ల ఘర్షణలు : పరిషత్ ఎన్నికల పోలింగ్ సందర్భంగా పలు జిల్లాల్లో అధికార ఎన్డీయే కూటమి, వైకాపా వర్గాల మధ్య ఘర్షణలు చోటుచేసుకున్నాయి. కొన్ని ప్రాంతాల్లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ ఘటనల మధ్య ఎన్నికల ప్రక్రియ కొనసాగింది. పోలింగ్ ముగిసిన అనంతరం బ్యాలెట్ పెట్టెలకు అధికారులు రాజకీయ పార్టీల ఏజెంట్ల సమక్షంలో పకడ్బందీగా సీలు వేశారు.

స్ట్రాంగ్ రూమ్‌లకు బ్యాలెట్ పెట్టెలు : రాష్ట్రవ్యాప్తంగా 31,460 పోలింగ్ కేంద్రాల్లోని బ్యాలెట్ పెట్టెలను పోలీసు, రెవెన్యూ అధికారుల పర్యవేక్షణలో స్ట్రాంగ్ రూమ్‌లకు తరలించే ప్రక్రియ చేపట్టారు. అక్కడ పటిష్ఠ భద్రత మధ్య భద్రపరచనున్నారు. మరోవైపు రాష్ట్ర ఎన్నికల సంఘం కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి వెబ్‌కాస్టింగ్ ద్వారా నమోదైన దృశ్యాలను పరిశీలిస్తోంది. ఈ నెల 7న ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలను వెల్లడించనున్నారు.

ప్రశాంతంగా పోలింగ్



- స్వల్ప ఘటనలు మినహా సజావుగా ఎన్నికల ప్రక్రియ
- 31,460 కేంద్రాల్లో విస్తృత భద్రత
- 40,679 మంది పోలీసు సిబ్బందితో బందోబస్తు
- 15 జిల్లాల్లో 37 ఘటనలు
- డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తా

2 లో

అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) : రాష్ట్రవ్యాప్తంగా ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల పోలింగ్ స్వల్ప ఘటనలు మినహా ప్రశాంతంగా ముగిసిందని డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తా తెలిపారు. ఎన్నికల నిర్వహణకు పటిష్ఠమైన భద్రతా ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు.

ఏపీఈఆర్సీకి కొత్త ఛైర్మన్



- ఏపీఈఆర్సీ ఛైర్మన్‌గా బినోయ్ కుమార్ నియామకం
- ప్రమాణ స్వీకారం చేయించిన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి

అమరావతి, నవంబరు 5 (జర్నలిస్ట్ ఫైల్) : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యుత్ రెగ్యులేటరీ కమీషన్ (ఎపిఇఆర్సి)చైర్ పర్సన్ గా బినోయ్ కుమార్ ప్రమాణ స్వీకారం చేశారు. మిగతా 2లో...

తుపానులో మత్స్యకారుల జలసమాధి

- కొత్తపట్నం తీరానికి కొట్టుకొచ్చిన ఐదు మృతదేహాలు
- మరో నలుగురి కోసం కొనసాగుతున్న గాలింపు
- మృతులంతా తమిళనాడులోని కాశీమేడుకు చెందినవారు
- తుపాను సమయంలో బంధువులతో ఫోన్‌లో మాట్లాడిన బాధితులు

2 లో

పారా అథ్లెట్లకు ప్రధాని ప్రశంసలు




- 14 నుంచి 114కు పెరిగిన పతకాల సంఖ్య
- మీ విజయాలతో దేశం గర్విస్తోంది
- అంకితభావం, పటిష్ఠమైన క్రీడా వ్యవస్థతోనే ఘనత
- ఐదు ప్రపంచ రికార్డులు.. తొమ్మిది ఆసియా రికార్డులు
- తల్లి జ్ఞాపకంతో స్వర్ణం సాధించిన రింకు పోరాటాన్ని ప్రస్తావించిన మోదీ

న్యూఢిల్లీ (జర్నలిస్ట్ ఫైల్) : ఆసియా పారా గేమ్స్-2026లో భారత క్రీడాకారులు అసాధారణ ప్రతిభ కనబరిచి దేశ కీర్తిప్రతిష్ఠలను ఇనుమడింపజేశారని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రశంసించారు. పతకాల వేటలో భారత పారా అథ్లెట్లు సాధించిన పురోగతి అంతర్జాతీయ క్రీడా రంగంలో దేశం శక్తిమంతంగా ఎదుగుతోందనడానికి నిదర్శనమని పేర్కొన్నారు. 2010లో జరిగిన ఆసియా పారా గేమ్స్‌లో కేవలం 14 పతకాలకే పరిమితమైన భారత్.. ఈసారి ఏకంగా 114 పతకాలు సాధించడం మిగతా 2లో...

పార్లమెంటుకు రండి.. చర్చిద్దాం

- రాహుల్‌కు అమిత్ షా సవాల్
- ఎస్ఐఆర్‌పై చర్చకు ప్రత్యేక సమావేశాలు నిర్వహిస్తాం
- ప్రధాని మోదీకి లేఖ రాయండి.. సభలో వాదనలు వినిపించండి
- వీధుల్లో ఆందోళనలు కాదు.. పార్లమెంటులో చర్చించాలి
- రాహుల్ విదేశీ పర్యటనల వివరాలు వెల్లడించాలని డిమాండ్

• మిగతా 2 లో



కర్నూల్ (జర్నలిస్ట్ ఫైల్) : ప్రధాని నరేంద్ర మోదీతో బహిరంగ చర్చకు సిద్ధమంటూ కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ చేసిన సవాల్‌పై కేంద్ర హోంమంత్రి అమిత్ షా స్పందించారు. వీధుల్లో కాకుండా పార్లమెంటుకు వచ్చి చర్చించాలని ప్రతి సవాల్ విసిరారు. ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)పై చర్చించేందుకు పార్లమెంటు ప్రత్యేక సమావేశాలు నిర్వహించడానికైనా సిద్ధమని ప్రకటించారు. గురువారం హర్యానాలోని కర్నాల్‌లో జరిగిన బహిరంగ సభలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

రాష్ట్రాలకు కేంద్రం దీపావళి కానుక



- ముందుగానే రూ.1.09 లక్షల కోట్ల పన్నుల వాటా విడుదల
- నవంబర్ 10న ఇవ్వాల్సిన నిధులు ఐదు రోజుల ముందే జమ
- ఐదు రోజుల్లోనే రాష్ట్రాలకు రూ.2.18 లక్షల కోట్లు
- అత్యధికంగా ఉత్తర్‌ప్రదేశ్‌కు రూ.19,208 కోట్లు

న్యూఢిల్లీ (జర్నలిస్ట్ ఫైల్) : దీపావళి పండుగ వేళ రాష్ట్రాలకు కేంద్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది. పన్నుల వాటా నిధులను ముందుగానే విడుదల చేస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. నవంబర్ నెలకు సంబంధించి రాష్ట్రాలకు రావాల్సిన పన్నుల వాటా కింద రూ. 1,09,019 కోట్లను గురువారం విడుదల చేసింది. వాస్తవానికి ఈ నిధులను నవంబర్ 10న జమ చేయాల్సి ఉండగా.. ఐదు రోజుల ముందుగానే రాష్ట్రాల ఖాతాల్లోకి బదిలీ చేసింది. ఈ మేరకు కేంద్ర ఆర్థిక శాఖ వెల్లడించింది. ముందస్తు నిధుల విడుదలతో రాష్ట్ర ప్రభుత్వాలకు ఆర్థిక వెసులుబాటు కలగనుంది.

యూపీకి అత్యధిక వాటా : తాజాగా విడుదల చేసిన నిధుల్లో అత్యధికంగా ఉత్తర్‌ప్రదేశ్‌కు రూ. 19,208 కోట్లు కేటాయించారు. బిహార్‌కు రూ. 10,845 కోట్లు, మధ్యప్రదేశ్‌కు రూ. 8,010 కోట్లు, పశ్చిమబెంగాల్‌కు రూ. 7,866 కోట్లు, మహారాష్ట్రకు రూ. 7,022 కోట్లు, రాజస్థాన్‌కు రూ. 6,460 కోట్లు అందనున్నాయి. అత్యల్పంగా సిక్కింకు రూ. 365 కోట్లు కేటాయించారు.

ఐదు రోజుల్లో రూ.2.18 లక్షల కోట్లు : అక్టోబరు 31న కూడా కేంద్ర ప్రభుత్వం అదనపు పన్నుల వాటా కింద మరో రూ. 1,09,019 కోట్లను విడుదల చేసింది. తాజాగా మరో విడత నిధులు జమ చేయడంతో ఐదు రోజుల వ్యవధిలోనే రాష్ట్రాలకు మొత్తం రూ. 2,18,038 కోట్లు అందినట్లయింది. 2026-27 ఆర్థిక సంవత్సరంలో ఇది రెండో అదనపు పన్నుల వాటా విడుదల కావడం విశేషం.

రాష్ట్రాలకు 41 శాతం వాటా : కేంద్ర పన్నుల ఆదాయంలో రాష్ట్రాలకు 41 శాతం వాటా - 2లో...

కల్తీ నెయ్యి కేసు బదిలీకి సుప్రీం నో



- మరో రాష్ట్రానికి మార్చాల్సిన అవసరం లేదు
- పిటిషన్‌ను కొట్టివేసిన అత్యున్నత న్యాయస్థానం
- రాజకీయ వ్యాఖ్యలతో నిష్ప్రాక్షిక విచారణకు విఘాతమంటూ పిటిషన్
- గతంలోనే తగిన ఆదేశాలు ఇచ్చామన్న ధర్మాసనం

న్యూఢిల్లీ (జర్నలిస్ట్ ఫైల్) : తిరుమల లడ్డూ కల్తీ నెయ్యి వ్యవహారానికి సంబంధించిన కేసు విచారణను ఆంధ్రప్రదేశ్ నుంచి మరో రాష్ట్రానికి బదిలీ చేయాల్సిన అవసరం లేదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. మిగతా 2లో...

ఎబోలా ముప్పు.. రాష్ట్రం అప్రమత్తం



- మూడు అంతర్జాతీయ విమానాశ్రయాల్లో అనుమానితులకు స్క్రీనింగ్
- నెల్లూరు, కాకినాడ, విశాఖ ఓడరేవుల్లోనూ పరీక్షలు
- నవంబర్ 12న సన్నద్ధతపై మాక్ డ్రిల్
- కేంద్రానికి వివరించిన వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు

అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) : కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా ఎబోలా వైరస్ వ్యాప్తి నివారణకు రాష్ట్రంలో ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు వైద్య, ఆరోగ్య శాఖ తెలిపింది. కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ అధికారులతో గురువారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ కార్యదర్శి జి. వీరపాండియన్ రాష్ట్రంలో ఏర్పాటు చేసిన ఐసోలేషన్ కేంద్రాలు, పడకలు, వైద్య సిబ్బంది, అత్యవసర సామగ్రి, అనుమానిత కేసుల నిర్వహణకు తీసుకుంటున్న చర్యలను వివరించారు. - 2లో...

ప్రశాంతంగా పోలింగ్



(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్రవ్యాప్తంగా 31,460 పోలింగ్ కేంద్రాల వద్ద 40,679 మంది సిబ్బందితో బందోబస్తు కల్పించినట్లు గురువారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.

కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి పర్యవేక్షణ

రాష్ట్ర పోలీసు ప్రధాన కార్యాలయంలోని ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి పోలింగ్ సరళి, భద్రతా ఏర్పాట్లను నిరంతరం పర్యవేక్షించినట్లు డీజీపీ వివరించారు. ఎన్నికల సందర్భంగా కడప, అనంతపురం, కర్నూలు తదితర మొత్తం 15 జిల్లాల్లో 37 ఘటనలు చోటుచేసుకున్నట్లు పోలీసుశాఖ దృష్టికి వచ్చాయని తెలిపారు. ప్రతి ఘటనకు సంబంధించిన వాస్తవ పరిస్థితులను క్షేత్రస్థాయిలో పరిశీలించాలని జిల్లా పోలీసు అధికారులను ఆదేశించినట్లు పేర్కొన్నారు.

నిందితులపై చట్టపరమైన చర్యలు : సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి ఘటనలకు బాధ్యులైన వారిని గుర్తించి చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని జిల్లా అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్లు డీజీపీ తెలిపారు. పోలింగ్ ముగిసిన అనంతరం బ్యాలెట్ బాక్సులను ఆయా కేంద్రాల నుంచి స్ట్రాంగ్ రూమ్‌లకు పటిష్ఠ పోలీసు బందోబస్తు మధ్య సురక్షితంగా తరలించేలా ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు.

ఏపీఈఆర్సీకి కొత్త చైర్మన్

(మొదటి పేజీ తరువాయి)



రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 3వతేదీన జిఓఎంఎస్ సంఖ్య 87 ద్వారా ఎపిఇఆర్సి చైర్ పర్సన్ గా విశ్రాంత ఐఏఎస్ అధికారి బినోయ్ కుమార్‌ను నియమించడంతో గురువారం విజయవాడ సిఎస్ క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి.సాయి ప్రసాద్ బినోయ్ కుమార్ తో చైర్ పర్సన్ గా ప్రమాణం చేయించారు.ఆయన పదవీ బాధ్యతలు స్వీకరించిన నాటి నుండి ఐదేళ్ళ కాలం లేదా 70 సంవత్సరాలు వయస్సు నిండే వరకూ ఏది ముందైతే అది ఆప్రకారం పదవిలో కొనసాగుతారని ప్రభుత్వం ఆఉత్తర్వుల్లో పేర్కొంది.

ఎపి ఇఆర్సి చైర్ పర్సన్ గా ప్రమాణం చేసిన బినోయ్ కుమార్ కు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి.సాయి ప్రసాద్ పుష్పగుచ్చం అందించి శుభాకాంక్షలు తెలియజేశారు. అదే విధంగా ఇంధనశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి మరియు సియం ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ సహా ఇతర అధికారులు బినోయ్ కుమార్ కు పుష్పగుచ్చాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.

ఈకార్యక్రమంలో జెన్కోఎండి నాగలక్ష్మి,సిపిడిసిఎల్ సిఎండి పి.పుల్లారెడ్డి,జెఎండి ట్రాన్స్కో సూర్య సాయి ప్రవీణ్ చంద్,ఎపిఇఆర్సి సభ్యులు పివిఆర్ రెడ్డి,ఎపి నెరెడ్క్యాప్ విసి అండ్ ఎండి కమలాకర్ బాబు,ఎపిఇఆర్సి కార్యదర్శి పి.కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రాలకు కేంద్రం దీపావళి కానుక




(మొదటి పేజీ తరువాయి)

లభిస్తుంది. ఈ మొత్తాన్ని ఆర్థిక సంవత్సరంలో 14 విడతలుగా కేంద్రం పంపిణీ చేస్తుంది. ముందస్తుగా నిధులు విడుదల చేయడం వల్ల రాష్ట్రాలు మూలధన వ్యయాలను పెంచుకోవడంతోపాటు మౌలిక సదుపాయాల అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు అవసరమైన నిధులను సమకూర్చుకునే అవకాశం ఉంటుందని కేంద్రం పేర్కొంది.

బడ్జెట్‌లో రూ.15.26 లక్షల కోట్లు : 2026-27 కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రాల పన్నుల వాటా కింద రూ. 15.26 లక్షల కోట్లను కేటాయించారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సవరించిన అంచనాల్లో ఈ మొత్తం రూ. 13.93 లక్షల కోట్లుగా ఉంది. తాజా ముందస్తు విడుదలతో రాష్ట్రాల అభివృద్ధి కార్యక్రమాలకు ఆర్థికంగా మరింత ఊతం లభించనుంది.

కల్తీ నెయ్యి కేసు బదిలీకి సుప్రీం నో

(మొదటి పేజీ తరువాయి)



విచారణను పొరుగు రాష్ట్రానికి మార్చడానికి తగిన బలమైన కారణాలు లేవని పేర్కొంటూ ఈ మేరకు దాఖలైన పిటిషన్‌ను గురువారం కొట్టివేసింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చితో కూడిన ధర్మాసనం ఈ ఆదేశాలు జారీ చేసింది.

రాజకీయ వ్యాఖ్యలపై అభ్యంతరం : ఈ కేసులో నిందితుడిగా ఉన్న మహారాష్ట్రకు చెందిన డెయిరీ వ్యాపారవేత్త, మల్గంగా మిల్క్ అండ్ ఆగ్రో ప్రొడక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ మచీంద్ర శాంతారాం లంకే విచారణను మరో రాష్ట్రానికి బదిలీ చేయాలని కోరుతూ పిటిషన్ దాఖలు చేశారు. ఆయన తరఫున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ్ దేవ్ వాదనలు వినిపించారు. ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి ఈ వ్యవహారంపై తరచూ రాజకీయ వ్యాఖ్యలు చేస్తున్నారని, దీనివల్ల నిష్పాక్షిక విచారణకు అనువైన వాతావరణం లేదని వాదించారు. నెయ్యిలో జంతువుల కొవ్వు ఉన్నట్లు ఫోరెన్సిక్ నివేదిక నిర్ధారించలేదని చెబుతున్నప్పటికీ రాజకీయ నాయకులు ఈ అంశంపై వ్యాఖ్యలు చేస్తున్నారని ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. **గతంలోనే ఆదేశాలిచ్చాం** : ఈ వాదనలపై స్పందించిన ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్.. ఈ అంశంపై గతంలోనే తగిన ఆదేశాలు జారీ చేసినట్లు గుర్తుచేశారు. తమ ఆదేశాల ద్వారా సంబంధిత వ్యక్తుల వ్యాఖ్యలకు అడ్డుకట్ట వేసినట్లు పేర్కొన్నారు. భవిష్యత్తులో ఏవైనా సమస్యలు తలెత్తితే మళ్లీ న్యాయస్థానాన్ని ఆశ్రయించవచ్చని స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో కేసు విచారణను మరో రాష్ట్రానికి బదిలీ చేయాలన్న అభ్యర్థనను ధర్మాసనం తిరస్కరించింది.

ఎయిర్‌టెల్ లాభాల్లో 24 శాతం వృద్ధి



న్యూఢిల్లీ (జర్నలిస్ట్‌ఫైల్) : టెలికాం దిగ్గజం భారతీ ఎయిర్‌టెల్ ఆర్థిక సంవత్సరం 2026--27 రెండో త్రైమాసికంలో రూ.10,710 కోట్ల ఏకీకృత నికర లాభాన్ని నమోదు చేసింది. గతేడాది ఇదే త్రైమాసికంతో పోలిస్తే లాభం 24 శాతం పెరిగింది. కార్యకలాపాల ఆదాయం 16.7 శాతం వృద్ధితో రూ.60,877.5 కోట్లకు చేరింది. వినియోగదారుల సంఖ్య పెరగడంతో పాటు ఒక్కో వినియోగదారుపై సగటు ఆదాయం (ఎఆర్‌పియు) రూ.256 నుంచి రూ.271కి పెరిగింది. దీంతో మొబైల్ సేవల ఆదాయంలో 10.1 శాతం వృద్ధి నమోదైంది.

పరిషత్ పోలింగ్ వేళ.. పలుచోట్ల ఉద్రిక్తతలు!

అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) : పరిషత్ ఎన్నికల పోలింగ్ వేళ రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఓటు వేసే విషయంలో మొదలైన వివాదాలు ఘర్షణలకు దారితీశాయి. వైఎస్సార్ కడప, తిరుపతి జిల్లాల్లో పెట్రోల్ బాంబులతో దాడులు జరగడం కలకలం రేపింది. పులివెందుల మండలం ఎర్రిపల్లె, పెనగలూరు మండలం నల్లపురెడ్డిపల్లెలో టీడీపీ, వైకాపా వర్గాల మధ్య ఘర్షణలు చోటుచేసుకున్నాయి. పోలింగ్ కేంద్రాల సమీపంలో బాంబులు విసరడంతో మంటలు చెలరేగాయి. దీంతో పోలీసులు అప్రమత్తమై ఆయా ప్రాంతాల్లో అదనపు బలగాలను మోహరించారు.

ఎర్రిపల్లెలో పెట్రోల్ బాంబుల కలకలం : వైఎస్సార్ కడప జిల్లా పులివెందుల మండలం ఎర్రిపల్లె పోలింగ్ కేంద్రం వద్ద ఓటింగ్ విషయంలో టీడీపీ, వైకాపా వర్గాల మధ్య వివాదం మొదలైంది. పోలింగ్ కేంద్రంలోకి వెళ్లే అంశంపై ఇరువర్గాలు వాగ్వాదానికి దిగాయి. అది కాస్తా ఘర్షణకు దారితీసింది. ఈ క్రమంలో పెట్రోల్ బాంబులు విసరడంతో భారీగా మంటలు చెలరేగాయి. దీంతో అక్కడ ఉద్రిక్త వాతావరణం నెలకొంది.



నల్లపురెడ్డిపల్లెలోనూ దాడి : తిరుపతి జిల్లా పెనగలూరు మండలం నల్లపురెడ్డిపల్లెలోనూ ఇదే తరహా ఘటన చోటుచేసుకుంది. పోలింగ్ బూత్‌లోకి వెళ్లే విషయంలో టీడీపీ, వైకాపా వర్గాల మధ్య ఘర్షణ జరిగింది. ఈ క్రమంలో పోలింగ్ కేంద్రానికి సమీపంలో పెట్రోల్ బాంబులతో దాడి చేశారు. ఘటనతో అప్రమత్తమైన పోలీసులు భారీగా మోహరించి పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు చర్యలు చేపట్టారు.

నందలూరులో ఆందోళనకారుల అదుపు : కడప జిల్లా నందలూరులోనూ ఉద్రిక్తత నెలకొంది. తిరుపతి, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు వాహనాల్లో అక్కడికి



చేరుకున్నారు. దీంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ఆందోళనకు దిగిన వారిని పోలీసులు అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

బలిజిపేట, గరివిడిలో తోపులాటలు : పార్వతీపురం మన్యం జిల్లా బలిజిపేట మండలం చిలకలపల్లిలో పోలింగ్ కేంద్రంలోకి వెళ్లే విషయంలో టీడీపీ, వైకాపా వర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. ఇరుపార్టీల కార్యకర్తలు పరస్పరం తోసుకున్నారు. విజయనగరం జిల్లా గరివిడి పోలింగ్ కేంద్రం వద్ద వైకాపా, జనసేన నేతల మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. ఇరువర్గాలు పరస్పరం నెట్టుకోవడంతో తోపులాట చోటుచేసుకుంది. వరుస ఘటనల నేపథ్యంలో పోలీసులు ఆయా ప్రాంతాల్లో భద్రతను కట్టుదిట్టం చేశారు.

పారా అథ్లెట్లకు ప్రధాని ప్రశంసలు

(మొదటి పేజీ తరువాయి)



గొప్ప విజయమని కొనియాడారు. అథ్లెట్ల కఠోర శ్రమ, అచంచలమైన అంకితభావం, దేశంలో బలపడుతున్న క్రీడా వ్యవస్థ ఈ ఘనతకు కారణమని వివరించారు. గురువారం ఢిల్లీలోని ఇందిరాగాంధీ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఆసియా పారా గేమ్స్ విజేతలతో మోదీ సమావేశమయ్యారు. అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో ప్రసంగించారు.

దేశం గర్వించేలా చేశారు : పారా అథ్లెట్లను కలుసుకోవడం ఎంతో ఆనందంగా ఉందని ప్రధాని పేర్కొన్నారు. ఇటీవల ఆసియా క్రీడల్లో పాల్గొన్న అథ్లెట్లను కలిసినట్లు గుర్తుచేస్తూ.. ఇప్పుడు పారా గేమ్స్ విజేతలతో ముచ్చటించే అవకాశం రావడం సంతోషంగా ఉందన్నారు. ఒకప్పుడు అంతర్జాతీయ క్రీడల్లో భారత్ భాగస్వామ్యం పరిమితంగా ఉండేదని, పారా క్రీడల్లోనూ ఆశించిన స్థాయిలో రాణించలేకపోయామని చెప్పారు. 2010 ఆసియా పారా గేమ్స్‌లో ఒక స్వర్ణంతో కలిపి మొత్తం 14 పతకాలే సాధించగా.. ఈసారి 114 పతకాలు కైవసం చేసుకోవడం అసాధారణ విజయమన్నారు. 30 స్వర్ణాలు, 35 రజతాలు, 49 కాంస్య పతకాలతో పాటు ఐదు ప్రపంచ రికార్డులు, తొమ్మిది ఆసియా రికార్డులు నెలకొల్పి యావత్ దేశం గర్వపడేలా చేశారని ప్రశంసించారు.

రింకు పోరాటం స్ఫూర్తిదాయకం : మహిళా పారా అథ్లెట్లు సాధించిన విజయాలను మోదీ ప్రత్యేకంగా ప్రస్తావించారు. భారత్ తరఫున పోటీపడిన 56 మంది మహిళా క్రీడాకారుల్లో 34 మంది పతకాలు సాధించడం విశేషమన్నారు. జావెలిన్ త్రోయర్ రింకు ప్రదర్శనను గుర్తుచేసుకున్నారు. ఆసియా పారా గేమ్స్‌కు రెండు నెలల ముందే తల్లిని కోల్పోయినప్పటికీ.. ఆ విషాదాన్ని దిగమింగి పోటీల్లో పాల్గొని స్వర్ణ పతకం సాధించడం గొప్ప విషయమన్నారు. విజయానంతరం తన తల్లి చిత్రపటాన్ని చేతబట్టి పతకాన్ని ఆమెకు అంకితం చేసిన తీరు అందరినీ కదిలించిందని పేర్కొన్నారు. కష్టాలను అధిగమించి లక్ష్యాన్ని చేరుకోవడంలో రింకు చూపిన పట్టుదల అందరికీ స్ఫూర్తిదాయకమన్నారు.

మారిన క్రీడా ముఖచిత్రం : గతంలో క్రీడా రంగంలో తగినన్ని వనరులు, ప్రోత్సాహం, పారదర్శకత లేకపోవడం వంటి సమస్యలతో క్రీడాకారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారని ప్రధాని పేర్కొన్నారు. దీంతో పిల్లలను క్రీడల్లోకి పంపేందుకు తల్లిదండ్రులు కూడా వెనుకడుగు వేసేవారని గుర్తుచేశారు. అయితే ఇప్పుడు పరిస్థితులు మారుతున్నాయని, క్రీడాకారుల ప్రతిభను వెలికితీసేందుకు మెరుగైన వ్యవస్థలు అందుబాటులోకి వస్తున్నాయని చెప్పారు. నాలుగు క్రీడాంశాల్లో స్వర్ణ, రజత, కాంస్య పతకాలు మూడింటినీ భారత అథ్లెట్లే సాధించి పోడియంపై త్రివర్ణ పతాకాన్ని రెపరెపలాడించారని తెలిపారు. పోటీల చివరి రోజున తొమ్మిది స్వర్ణ పతకాలు సాధించడం భారత క్రీడాకారుల పట్టుదలకు నిదర్శనమని మోదీ కొనియాడారు.

తుపానులో మత్స్యకారుల జలసమాధి

ఒంగోలు (జర్నలిస్ట్ ఫైల్) : మురసు తుపాను తొమ్మిది మంది మత్స్యకారుల ప్రాణాలను బలిగొంది.

తమిళనాడుకు చెందిన వీరు సముద్రంలో చేపల వేటకు వెళ్లి తుపాను ఉద్ధృతికి చిక్కుకొని గల్లంతయ్యారు. వీరిలో ఐదుగురి మృతదేహాలు ప్రకాశం జిల్లా కొత్తపట్నం తీరానికి గురువారం కొట్టుకొచ్చాయి. మరో నలుగురు కూడా ప్రాణాలు కోల్పోయి ఉంటారని అధికారులు భావిస్తున్నారు. వారి ఆచూకీ కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. ఈ విషాద ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.

ముందస్తు సమాచారం లేక.. : పోలీసుల కథనం ప్రకారం.. మురసు తుపానుకు ముందు తమిళనాడుకు చెందిన కొందరు మత్స్యకారులు మూడు పడవల్లో చేపల వేటకు సముద్రంలోకి వెళ్లారు. తుపాను హెచ్చరికలు అందడంతో ముందుజాగ్రత్తగా రెండు పడవలను కృష్ణపట్నం పోర్టు సమీపంలో నిలిపివేశారు. మరో పడవలో ఉన్న తొమ్మిది మంది మత్స్యకారులకు తుపాను సమాచారంపై స్పష్టత లేకపోవడంతో వేట కొనసాగించారు. మురసు తుపాను ఒంగోలు సమీపంలో తీరం దాటే సమయంలో వారి పడవ కొత్తపట్నం బీచ్‌కు సుమారు నాలుగు కిలోమీటర్ల




దూరంలో సముద్రంలో ఉంది. అలల ఉద్ధృతికి పడవ బోల్తాపడటంతో తొమ్మిది మంది గల్లంతయ్యారు.

బంధువులకు ఫోన్ చేసి.. : తుపానులో చిక్కుకున్న సమయంలో మత్స్యకారులు తమ బంధువులతో సెల్‌ఫోన్లలో మాట్లాడి ప్రమాదంలో ఉన్నట్లు సమాచారం ఇచ్చారు. దీంతో ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. తమిళనాడు మెరైన్ పోలీసులు రంగంలోకి దిగి.. బాధితుల సెల్‌ఫోన్ చివరి సిగ్నల్ ఆధారంగా కొత్తపట్నం సమీపంలో పడవ ప్రమాదానికి గురైనట్లు గుర్తించారు. మత్స్యశాఖ అధికారులతో కలిసి గాలింపు చర్యలు చేపట్టారు.

ఒడ్డుకు చేరిన ఐదు మృతదేహాలు : ఈ క్రమంలో గురువారం కొత్తపట్నం తీరానికి ఐదు మృతదేహాలు కొట్టుకొచ్చాయి. అవి తమిళనాడులోని కాశీమేడుకు చెందిన మత్స్యకారులవిగా స్థానిక పోలీసులు ప్రాథమికంగా గుర్తించారు. మృతదేహాలను ఒంగోలులోని రిమ్స్‌కు తరలించారు. ఈ ఘటనపై ప్రకాశం జిల్లా కలెక్టర్ రాజబాబు తమిళనాడు ప్రభుత్వానికి సమాచారం అందించారు. గల్లంతైన మిగిలిన నలుగురి కోసం సముద్రంలో గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి.

పార్లమెంటుకు రండి.. చర్చిద్దాం



(మొదటి పేజీ తరువాయి)

ప్రధాని మోదీతో చర్చించాలనుకుంటే ఆయనకు లేఖ రాయాలని రాహుల్‌కు సూచించారు.

చర్చకు సిద్ధమైతే సభకు రండి : దేశ వ్యతిరేకులు ఎవరు? విదేశీ శక్తులతో సంబంధాలు ఎవరికి ఉన్నాయి? ఆ సంబంధాల వెనుక ఉన్న అంశాలేమిటి? అనే విషయాలపై ప్రధాని మోదీతో ఎక్కడైనా, ఏ వేదికపైనైనా బహిరంగ చర్చకు సిద్ధమని రాహుల్ గాంధీ నవంబరు 3న ఎక్స్ వేదికగా సవాల్ విసిరారు. మీడియా, దేశ యువత సమక్షంలో చర్చ జరగాలని పేర్కొన్నారు. దీనిపై అమిత్ షా స్పందిస్తూ.. చర్చకు నిజంగా సిద్ధంగా ఉంటే పార్లమెంటుకు రావాలని సూచించారు. ఎస్ఐఆర్‌పై ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసి చర్చించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు.

ఓటమికి ఎస్ఐఆర్ కారణమా? : ఎస్ఐఆర్‌ను కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకించడాన్ని అమిత్ షా తప్పుబట్టారు. 2014, 2019, 2024 లోక్‌సభ ఎన్నికల సమయంలో ఎస్ఐఆర్ జరగలేదని, అయినా కాంగ్రెస్ ఓటమి పాలైందని వ్యాఖ్యానించారు. హర్యానా, మహారాష్ట్ర ఎన్నికల్లోనూ ఎస్ఐఆర్ లేకుండానే కాంగ్రెస్ పరాజయం ఎదుర్కొందని పేర్కొన్నారు. ఎన్నికల్లో ఓటమికి ఎస్ఐఆర్‌ను కారణంగా చూపడం సరికాదని విమర్శించారు.

ఆందోళనలతో గందరగోళం : పార్లమెంటు సమావేశాలను సజావుగా సాగనివ్వకుండా బయట సభలు, ఆందోళనలతో గందరగోళం సృష్టిస్తున్నారని అమిత్ షా ఆరోపించారు. వీధుల్లో జనాన్ని సమీకరించి నిరసనలు కొనసాగిస్తే బీజేపీ కార్యకర్తలు తగిన సమాధానం చెబుతారని హెచ్చరించారు. దేశ ప్రజలు రాహుల్ గాంధీని, కాంగ్రెస్ పార్టీని పదేపదే తిరస్కరిస్తున్నారని వ్యాఖ్యానించారు. ఢిల్లీలో నిర్వహించిన సభకు దేశవ్యాప్తంగా పది లక్షల మందిని ఆహ్వానించినట్లు కాంగ్రెస్ చెప్పిందని, అయితే సభా ప్రాంగణం సామర్థ్యం 70 వేల మందేనని, అందులోనూ సగం ఖాళీగా ఉందని ఎద్దేవా చేశారు.

విదేశీ పర్యటనల వివరాలివ్వాలి : ప్రతిపక్ష నేతగా ఉన్న రాహుల్ గాంధీ తన విదేశీ పర్యటనల వివరాలను ప్రజలకు వెల్లడించాలని అమిత్ షా డిమాండ్ చేశారు. ఆయన విదేశీ పర్యటనల వెనుక ఉద్దేశాలు, వివరాలు తెలుసుకునే హక్కు దేశ ప్రజలకు ఉందని వ్యాఖ్యానించారు.

దక్షిణ భారతంలో విస్తరిస్తున్న 'ఇన్విజిబుల్ రాడికలైజేషన్'

తిరువనంతపురం (జర్నలిస్ట్ ఫైల్) : దేశ భద్రతా ఏజెన్సీలకు, ముఖ్యంగా దక్షిణ భారతదేశంలో, 'అదృశ్య రాడికలైజేషన్' పెను సవాలుగా మారింది. ఐసిస్, అల్-ఖైదా వంటి ఉగ్రవాద సంస్థలు తమ కార్యకలాపాల స్వరూపాన్ని పూర్తిగా మార్చేశాయి. క్షేత్రస్థాయి దాడుల కన్నా రాడికలైజేషన్ పైనే ఎక్కువగా ఆధారపడుతూ, ఇప్పుడు 'హోం రాడికలైజేషన్' అనే కొత్త, అత్యంత ప్రమాదకరమైన పంథాను ఎంచుకున్నాయి. ఈ పరిణామం ఇంటెలిజెన్స్ బ్యూరో , జాతీయ దర్యాప్తు సంస్థ సహా స్థానిక పోలీసు బలగాలను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది.

గతంలో ఆన్‌లైన్ ద్వారా యువతను ఆకర్షించిన ఉగ్రసంస్థలు, ఇప్పుడు భద్రతా ఏజెన్సీల నిఘాను తప్పించుకోవడానికి కొత్త వ్యూహాన్ని అమలు చేస్తున్నాయి. కళాశాల విద్యార్థులు, నిరుద్యోగ యువత, ప్రభుత్వంపై అసంతృప్తితో ఉన్నవారిని లక్ష్యంగా చేసుకుంటున్నాయి. విదేశాల్లో ఉన్న ఉగ్రవాద హ్యాండ్లర్లు నేరుగా యువతను కాకుండా వారి తల్లిదండ్రులను లేదా దగ్గరి బంధువులను సంప్రదిస్తున్నారు. తమ హింసాత్మక సిద్ధాంతాలను వారి పిల్లల నరనరాల్లోకి ఎక్కించేలా వారిని ప్రేరేపిస్తున్నారు. ఈ పద్ధతినే అధికారులు 'హోం రాడికలైజేషన్'గా పేర్కొంటున్నారు.

ఈ వ్యూహం చాలా ప్రభావవంతంగా, తక్కువ నష్టంతో కూడుకున్నదని అధికారులు చెబుతున్నారు. సాధారణంగా తల్లిదండ్రులు, బంధువులపై భద్రతా ఏజెన్సీలకు అనుమానం వచ్చే అవకాశాలు చాలా తక్కువ. ఇదే ఉగ్రసంస్థలకు కలిసొస్తోంది. మరోవైపు, బయటి వ్యక్తి చెప్పేకంటే తల్లిదండ్రులు లేదా దగ్గరి బంధువులు చెప్పేదాన్ని పిల్లలు గుడ్డిగా నమ్ముతారు. దీంతో రాడికలైజేషన్ విజయవంతం అయ్యే అవకాశాలు వంద శాతం ఉంటున్నాయి. పిల్లలు తమ తల్లిదండ్రులు చెప్పేదాన్ని గుడ్డిగా నమ్ముతారని, అదే నిజమని భావిస్తారని, ఇది వారిని అత్యంత ప్రమాదకారులుగా మారుస్తోందని ఒక ఉన్నతాధికారి వివరించారు.

తమిళనాడు, కేరళ, కర్ణాటక వంటి రాష్ట్రాలు ఈ రకమైన రాడికలైజేషన్‌కు కేంద్రాలుగా మారుతున్నాయి. దాడులు చేయడం కన్నా హింసాత్మక సిద్ధాంతాన్ని రహస్యంగా ప్రచారం చేయడం, రాజకీయ వ్యవస్థలో భాగమవడం, సమాజంలో చట్టబద్ధతను పెంచుకోవడం వంటి దీర్ఘకాలిక లక్ష్యాలతో ఉగ్రసంస్థలు పనిచేస్తున్నాయి. ఇటీవల కేరళలోని తిరువనంతపురంలో జరిగిన ఒక సంఘటన ఈ ప్రమాదాన్ని కళ్లకు కట్టింది. 16 ఏళ్ల బాలుడిని ఐసిస్‌లో చేరమని ప్రోత్సహిస్తున్న అతని తల్లి, సవతి తండ్రిపై పోలీసులు చట్టవ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం కింద కేసు నమోదు చేశారు. ఈ కేసు నవంబర్ 2025లో నమోదైంది.

బయటి వ్యక్తుల ద్వారా రాడికలైజ్ అయిన వారిని గుర్తించి, కౌన్సిలింగ్ ఇచ్చి మార్చడం ఏజెన్సీలకు సులభం. కానీ, సొంత తల్లిదండ్రుల ద్వారానే ఉగ్రవాద భావజాలం వైపు మళ్లిన యువతను తిరిగి సాధారణ జీవితంలోకి తీసుకురావడం 'హెర్క్యులియన్ టాస్క్' (శక్తికి మించిన పని) అని, ఇది భద్రతా వ్యవస్థకు పెను సవాల్ అని అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఎబోలా ముప్పు.. రాష్ట్రం అప్రమత్తం

(మొదటి పేజీ తరువాయి)

తిరుపతి, భోగాపురం, విజయవాడ విమానాశ్రయాల్లో ఎబోలా అనుమానిత లక్షణాలున్న వారికి స్క్రీనింగ్ చేసేందుకు వైద్య సిబ్బందిని సిద్ధం చేశామని తెలిపారు. విశాఖపట్నం, కాకినాడ, నెల్లూరు ఓడరేవుల్లోనూ పరీక్షలకు అవసరమైన ఏర్పాట్లు ప్రారంభించామన్నారు. ఎంపిక చేసిన ఆసుపత్రుల్లో ఐసోలేషన్ వార్డులను సిద్ధం చేశామని చెప్పారు. రాష్ట్ర, జిల్లా స్థాయిలో సన్నద్ధతను పరీక్షించేందుకు నవంబర్ 12న మాక్ డ్రిల్ నిర్వహించనున్నట్లు తెలిపారు. అనుమానిత కేసుల గుర్తింపు, ఐసోలేషన్, వైద్య నిర్వహణ, రిఫరల్ విధానాల అమలుకు అన్ని విభాగాలను అప్రమత్తం చేస్తామన్నారు.

21 రోజుల ప్రయాణ వివరాల పరిశీలన : ఎబోలా నియంత్రణకు కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ జారీ చేసిన మార్గదర్శకాల అమలుపై నేషనల్ సెంటర్ ఫర్ డిసీజ్ కంట్రోల్ అదనపు సంచాలకుడు డాక్టర్ హిమాన్షు చౌహా, జాయింట్ డైరెక్టర్ డాక్టర్ శుభా గార్గ్ (మైక్రో), ఇతర అధికారులు గురువారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు.

2026 అక్టోబర్ 31 నాటికి ప్రపంచవ్యాప్తంగా నమోదైన కేసులు, మరణాల వివరాలను వెల్లడించారు. కాంగో ప్రజాస్వామ్య గణతంత్ర దేశంలో 10,467 కేసులు, 5,103 మరణాలు; కెన్యాలో 9 కేసులు, 2 మరణాలు; ఉగాండాలో 20 కేసులు, 2 మరణాలు; నైజీరియాలో ఒక కేసు; ఫ్రాన్స్‌లో ఒక కేసు నమోదయ్యాయి. మొత్తంగా ఐదు దేశాల్లో 10,498 నిర్ధారిత కేసులు, 5,107 మరణాలు నమోదైనట్లు తెలిపారు. ప్రస్తుత వ్యాప్తికి బుండిబుగ్యో వైరస్ రకం కారణమని, ప్రపంచ ఆరోగ్య సంస్థ, ఆఫ్రికా వ్యాధి నియంత్రణ సంస్థ సూచించిన జాగ్రత్తలు పాటించాలని పేర్కొన్నారు.

ఎబోలా ప్రభావిత దేశాల నుంచి వచ్చే ప్రయాణికుల ఆరోగ్య పరీక్షలు, గత 21 రోజుల ప్రయాణ చరిత్రను తనిఖీ చేయాలని సూచించారు. లక్షణాలు లేని ప్రయాణికులను ఇంటి వద్ద స్వీయ పర్యవేక్షణలో ఉంచాలని, వైరస్ సోకిన వ్యక్తులతో ప్రత్యక్ష సంబంధం ఉన్నవారిని 21 రోజుల పాటు వైద్య పర్యవేక్షణలో ఉంచాలని తెలిపారు. అనుమానిత లక్షణాలున్న వారిని ప్రత్యేక అంబులెన్స్ ద్వారా ఐసోలేషన్ ఆసుపత్రికి తరలించాలన్నారు. విమాన ప్రయాణ సమయంలో లక్షణాలు కనిపిస్తే ప్రయాణికుడిని ఇతరుల నుంచి వేరు చేసి విమానాశ్రయ అధికారులకు సమాచారం అందించాలని సూచించారు.

అనుమానిత నమూనాల పరీక్షలకు పుణెలోని ఐసీఎంఆర్-నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వైరాలజీ (ఎన్ఐవీ)లో సదుపాయాలు ఉన్నట్లు అధికారులు తెలిపారు. రాష్ట్రంలో విశాఖపట్నంలోని ఆంధ్ర వైద్య కళాశాల వైరల్ రీసెర్చ్ అండ్ డయాగ్నస్టిక్ ల్యాబ్, తిరుపతిలోని శ్రీ వెంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ (ఎస్‌వీఐఎంఎస్) వైరల్ రీసెర్చ్ అండ్ డయాగ్నస్టిక్ ల్యాబ్, విజయవాడలోని ప్రభుత్వ సిద్ధార్థ వైద్య కళాశాల వైరల్ రీసెర్చ్ అండ్ డయాగ్నస్టిక్ ల్యాబ్‌లలోనూ నమూనాల పరీక్షలు నిర్వహించనున్నట్లు వివరించారు.

ఆసుపత్రులు, పడకలు, కిట్లు, మాస్కులు సిద్ధం : ఎబోలా అనుమానిత కేసుల వైద్య నిర్వహణకు రాష్ట్రంలోని ఐదు ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రత్యేక ఐసోలేషన్ కేంద్రాలు సిద్ధం చేసినట్లు కార్యదర్శి వీరపాండియన్, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ చక్రధర్‌బాబు వివరించారు. మొత్తం 46 పడకలు, 3,288 పీపీఈ కిట్లు, 104 నమూనా సేకరణ కిట్లు, ఐదు అంబులెన్స్‌లను అందుబాటులో ఉంచినట్లు కేంద్ర అధికారులకు తెలిపారు.

సమీక్షలో వైద్య విద్యా సంచాలకులు డాక్టర్ అట్టలూరి విష్ణువర్ధన్, ప్రజారోగ్య శాఖ సంచాలకులు డాక్టర్ ఆర్.



వెంకట రమణ, జాయింట్ డైరెక్టర్ డాక్టర్ కె. అర్జునరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఢిల్లీలో కుప్పకూలిన భవనం..



న్యూఢిల్లీ (జర్నలిస్ట్‌ఫైల్) : ఓల్డ్ ఢిల్లీలోని చావ్రి బజార్ మెట్రో స్టేషన్ సమీపంలోని గలీ సత్తారా, పీష్ మహల్‌లో నిర్మాణంలో ఉన్న మూడు అంతస్తుల భవనం కుప్పకూలడంతో ఇద్దరు ప్రాణాలు కోల్పోయారు. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. పలువురు శిథిలాల కింద చిక్కుకున్నట్లు అనుమానిస్తున్నారు. అగ్నిమాపక సిబ్బంది వచ్చేలోపే నలుగురిని స్థానికులు రక్షించి ఆసుపత్రికి తరలించారు. డిసిపి (సెంట్రల్) రోహిత్ రాజ్‌బీర్ సింగ్ ప్రకారం, భవనం కూలిపోయినప్పుడు సుమారు 15 మంది నిర్మాణ కార్మికులు ఆ ప్రదేశంలో ఉన్నారు. ఇప్పటివరకు ఆరుగురు నుంచి ఏడుగురు కార్మికుల ఆచూకీ లభించగా, వారిలో నలుగురు సురక్షితంగా బయటపడ్డారు. ముగ్గురు కార్మికులను శిథిలాల నుంచి బయటకు తీశారు; వారిలో ఇద్దరు మరణించినట్లు ప్రకటించగా, మూడవ వ్యక్తి ప్రమాదం నుంచి బయటపడ్డాడు. మృతులను మండవాలి ప్రాంతంలోని రైల్వే కాలనీకి చెందిన కిషోరి (40), సంజీత్ (45)గా గుర్తించారు గత ఒకటిన్నర నెలలుగా నిర్మాణం జరుగుతున్నట్లు ప్రాథమిక విచారణలో తెలుస్తోంది. 50 చదరపు గజాల స్థలంలో మూడు అంతస్తుల భవనాన్ని నిర్మిస్తున్నారు. స్తంభాల నిర్మాణం భారాన్ని తట్టుకోలేకపోవడంతో భవనం కూలిపోయిందని సంబంధిత అధికారి తెలిపారు.

అరగంట వ్యవధిలోనే... : స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం గురువారం ఉదయం మూడో అంతస్తు తొలుత కూలిపోగా, ఆ తర్వాత అరగంట వ్యవధిలో మిగిలిన అంతస్తులు కూడా కూలిపోయాయి. తొలుత మూడో అంతస్తు కూలిపోగానే మిగిలిన వారంతా ప్రాణభయంతో పరుగులు తీశారు.

అందువల్లే ఇద్దరు మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. భవనం కూలినప్పుడు భూకంపం వచ్చినట్లు అనిపించిందని స్థానికులు తెలిపారు. జాతీయ విపత్తు ప్రతిస్పందన దళం బృందాలు, ఢిల్లీ అగ్నిమాపక సేవల అధికారులు వచ్చేటప్పటికే స్థానికులు సహాయక చర్యలు చేపట్టారు. కాంక్రీటు స్లాబ్ వేస్తుండగా భవనం కూలిపోయిందని డిసిపి (సెంట్రల్ డిస్ట్రిక్ట్) రోహిత్ రాజ్‌బీర్ సింగ్ విలేకరులకు తెలిపారు. సంఘటన జరిగిన వెంటనే, స్థానికులు ఆ ప్రదేశానికి చేరుకుని, చేతులతో శిథిలాలను తొలగించడం ప్రారంభించినట్లు స్థానికుడు అబ్దుల్ తెలిపారు. కాంక్రీట్ స్లాబులు, బరువైన రాళ్లు పడటంతో క్ష?తగాత్రులను బయటకు లాగడం కష్టమైందని చెప్పారు.

మూడు అడుగుల వెడల్పులో సందు ఉండటంతో అగ్నిమాపక వాహనాలు, అంబులెన్సులు, ఎక్స్‌కవేటర్లతో సహా భారీ యంత్రాలు అక్కడికి వెళ్లలేకపోయాయి.

ఇద్దరు ఇంజనీర్ల సస్పెన్షన్, కాంట్రాక్టర్‌పై ఎఫ్ఐఆర్‌కు సిఎం ఆదేశం : ఈ ఘటన నేపథ్యంలో సంబంధిత జూనియర్ ఇంజనీర్, అసిస్టెంట్ ఇంజనీర్‌లను సస్పెండ్ చేయాలని ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తా ఆదేశించారు. దీంతో, ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ వారిద్దరినీ సస్పెండ్ చేసింది. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరపాలని, కాంట్రాక్టర్‌పై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని సిఎం ఆదేశించారు. గత ఐదేళ్లలో ఢిల్లీలో భవనాలు కూలి 169 మంది మృతి చెందగా, దేశవ్యాప్తంగా దాదాపు ఎనిమిదివేల మంది ప్రాణాలు కోల్పోయారు.

మురసుతో 1,988 కోట్ల నష్టం



అమరావతి (జర్నలిస్ట్‌ఫైల్) : మురసు తుపాన్ కారణంగా రాష్ట్రంలో 1,988 కోట్ల రూపాయల నష్టం జరిగినట్లు ప్రభుత్వం ప్రాథమికంగా అంచనా వేసింది. గురువారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఈ మేరకు రూపొందించిన నష్టం వివరాలను అధికారులు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి అందచేశారు. ఈ నివేదిక ప్రకారం 1,43,122 హెక్టార్లలో వ్యవసాయ పంటలు దెబ్బతిన్నాయి. 1,86,063 మంది రైతులు నష్టపోయారు. వర్షాల కారణంగా 983 ఇళ్లు, 346 బోట్లు, 220 వలలు కూడా దెబ్బతిన్నాయి. నీట మునిగిన పంట నష్టాన్ని అంచనా వేసేందుకు మరో 48 నుండి 72 గంటల పంటల సమయం పడుతుందని అధికారులు తెలిపారు. తుపాను కారణంగా ఎనిమిది మంది మరణించినట్లు చెప్పారు. బాపట్ల జిల్లాలో ఐదుగురు, గుంటూరు జిల్లాలో ఇద్దరు, పల్నాడు జిల్లాలో ఒకరు మృతులలో ఉన్నారని నివేదికలో పేర్కొన్నారు. అనంతరం సిఎం మాట్లాడుతూ వరుసగా రెండు తుపాన్లు రాష్ట్రాన్ని ప్రభావితం చేసిన నేపథ్యంలో రైతులకు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని ఆదేశించారు. విద్యుత్ సరఫరా పునరుద్ధరణ, రహదారుల మరమ్మతులు, తాగునీటి సరఫరాకు ఆటంకం లేకుండా చర్యలు తీసుకోవడంపై ప్రధానంగా దృష్టి పెట్టాలని స్పష్టం చేశారు. నేడు (శుక్రవారం) స్వయంగా తాను తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించి పరిస్థితులను పరిశీలిస్తానని తెలిపారు. మురసు తుఫాన్ నష్టంపై సమగ్ర నివేదిక త్వరితగతిన రూపొందించి కేంద్రానికి సమర్పించాలని ఆదేశించారు.

ఆసియా ఛాంపియన్స్ ట్రోఫీ హాకీ విజేత భారత్



జంషెడ్‌పూర్: ఆసియా ఛాంపియన్స్ ట్రోఫీ హాకీ టైటిల్‌ను హర్మన్ ప్రీత్ సింగ్ సారథ్యంలోని భారతజట్టు కైవసం చేసుకుంది. గురువారం జరిగిన ఫైనల్లో భారత్ 4-1గోల్స్ తేడాతో జపాన్‌ను చిత్తుచేసింది. దీంతో రికార్డుస్థాయిలో 6వ సారి ఈ టైటిల్ కైవసం చేసుకుంది. మ్యాచ్ ప్రారంభమైన మూడో నిమిషంలోనే జపాన్‌కు ఒక గోల్ సమర్పించుకొని 0-1తో వెనుకబడిన భారత జట్టుపై ఒత్తిడి పెరిగింది. జపాన్ నిరంతర దాడులు, అద్భుతమైన రక్షణ ఆతిథ్య జట్టును మరింత కష్టాల్లో నెట్టాయి. దీంతో రెండు క్వార్టర్లు ముగిసేసరికి జపాన్ 1-0 ఆధిక్యతలో నిలిచింది. ఈ క్రమంలో మూడో క్వార్టర్‌లో శిలానంద్ లక్రా గోల్ చేయడంతో భారత్ ఊపిరి పీల్చుకుంది. చివరి క్వార్టర్‌లో దిల్‌ప్రీత్ సింగ్, జుగ్రాజ్ సింగ్, వివేక్ సాగర్ ప్రసాద్ తలా గోల్ చేసి విజయాన్ని ఖాయం చేయడంతో భారత జట్టు అద్భుత విజయాన్ని నమోదు చేసుకుంది. సెమీఫైనల్లో భారతజట్టు 8-0గోల్స్ తేడాతో కొరియా, జపాన్ 2-1తో మలేషియాను ఓడించి ఫైనల్‌కు చేరాయి. ఇక హర్మన్‌ప్రీత్ సింగ్ సారథ్యంలో భారత హాకీ జట్టు టోర్నీ ఆరంభం నుంచి అన్ని మ్యాచుల్లో గెలిచిం 6వ సారి టైటిల్‌ను కైవసం చేసుకుంది. గ్రూప్ దశ తొలి లీగ్ మ్యాచ్ 13-0బంగ్లాదేశ్‌ను ఓడించిన భారత్.. 5-2తో చైనాపై, జపాన్‌పై 4-1తో, మలేషియాపై 4-2తో విజయాలను నమోదుచేసుకొని గ్రూప్ టాపర్‌గా నిలిచింది.

అదుపులోకి తీసుకున్నప్పటి నుండే 24 గంటల డెడ్‌లైన్..!



న్యూఢిల్లీ (జర్నలిస్ట్‌ఫైల్) : మేజిస్ట్రేట్ ముందు ఒక వ్యక్తిని హాజరుపరిచేందుకు లాంఛనంగా అరెస్టు చేసిన ప్పటి నుండి కాకుండా అదుపులోకి తీసుకున్న ప్పటి నుండే 24 గంటల డెడ్‌లైన్ ప్రారంభమవుతుందని సుప్రీం కోర్టు రూలింగ్ ఇచ్చింది. నిర్బంధం, అరెస్టు మధ్య వ్యత్యాసంపై జస్టిస్ ఉజ్జల్ భుయాన్, అతుల్ ఎస్ చందుర్కా బెంచ్ గురువారం ఒక కేసు విచారణ సందర్భంగా కీలక వ్యాఖ్యలు చేసింది. ఈ రెండూ వ్యక్తి యొక్క ప్రాథమిక హక్కైన స్వేచ్ఛను పరిమితం చేయడానికే దారి తీస్తాయని పేర్కొంది. అక్రమ నిర్బంధాలకు చెల్లుచీటీ ఇస్తూ తీర్పునివ్వడం గమనార్హం. బెయిల్ పొందడానికి భారీగా ఆంక్షలు వుండే యుఎపిఎ, పిఎంఎల్ఎ వంటి ప్రత్యేక చట్టాల్లో కంటే ప్రాథమిక హక్కులకే ప్రాధాన్యత వుంటుందని కోర్టు స్పష్టం చేసింది. మేజిస్ట్రేట్ ముందు హాజరుపరచకుండా వ్యక్తి నిర్బంధ కాలం 24 గంటలు దాటినట్లైతే సంబంధిత వ్యక్తిని తప్పనిసరిగా వెంటనే విడుదల చేయాలి. 24 గంటల డెడ్‌లైన్‌కు అను గుణంగా వ్యవహరించారా లేదా అని చూసేలా తన ముందు హాజరుపరిచినపుడు మేజిస్ట్రేట్ ఆ వ్యక్తి నిర్బంధానికి సంబంధించి కచ్చితమైన తేదీ, సమయాన్ని నమోదు చేయాల్సి వుంటుంది. "విచారణ లేదా దర్యాప్తు కోసం ఒక వ్యక్తిని అరెస్టు చేయడానికి ముందు పట్టిన సమయానికి రాజ్యాంగంలోని 22(2) అధికరణ ఎలాంటి మినహాయింపును ఇవ్వడం లేదు. ఇది 22వ అధికరణలోని క్లాజు (2) పరిధికి వెలుపల వుంది. అరెస్టు చేసిన ప్రదేశం నుండి మేజిస్ట్రేట్ కోర్టుకు ఆ వ్యక్తిని తీసుకురావడానికి పట్టే సమయానికి మాత్రమే రాజ్యాంగం మినహా యింపు కల్పిస్తోంది."అని జస్టిస్ భుయాన్ తన తీర్పులో పేర్కొన్నారు. నిర్బంధించడానికే శాంతి భద్రతలకు భంగం కలుగుతుందంటూ కుట్ర పూరితంగా పోలీసులు, ప్రభుత్వాలు వ్యవహరిస్తున్నారని సీనియర్ అడ్వకేట్ రౌఫ్ రహీమ్ వేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు ఈ ఆదేశాలను జారీ చేసింది.

అంతర్జాతీయ కెరీర్‌కు క్రిస్టియానో రొనాల్డో గుడ్‌బై



పోర్చుగల్: పోర్చుగల్ దిగ్గజ ఫుట్‌బాల్ ఆటగాడు క్రిస్టియానో రొనాల్డో అంతర్జాతీయ కెరీర్‌కు గుడ్‌బై చెప్పాడు. ఈ మేరకు గురువారం సామాజిక మాధ్యమాల్లో తన రిటైర్మెంట్ నిర్ణయాన్ని ప్రకటించాడు. 41 ఏళ్ల రొనాల్డో పోర్చుగల్ తరఫున 234 మ్యాచుల్లో 146 గోల్స్ చేశాడు. గత నెలలో నేషన్స్ లీగ్ లో కోచ్ జార్జ్ జీసస్ రొనాల్డోను ఆడించకపోవడంతో వీరిద్దరి మధ్య విభేదాలు తీవ్రమయ్యాయి. దాంతో ఈ స్టార్ ఆటగాడు జాతీయ జట్టు నుంచి వైదొలిగేందుకు నిర్ణయించుకున్నట్లు సమాచారం. అంతర్జాతీయ కెరీర్‌కు వీడ్కోలు పలికినా క్లబ్ ఆటగాడిగా కొనసాగనున్నట్లు ఆ ప్రకటనలో తెలిపాడు. జాతీయ జట్టుకు 7వ నంబర్ జెర్సీని తిరిగి ఇచ్చే సమయం వచ్చేసిందని, ఆ జెర్సీని ధరించి ప్రపంచవ్యాప్తంగా ఉన్న స్టేడియాలకు తనతోపాటు తీసుకువెళ్లే అదృష్టం, బాధ్యత తనకు దక్కిందని అన్నారు. కెరీర్ ఎదుగుదలకు సహకరించిన కుటుంబానికి, పోర్చుగీస్ ప్రజలకు, అలాగే జాతీయ జట్టులో తన 23 ఏళ్ల కెరీర్‌లో కలిసి పనిచేసిన సహచర ఆటగాళ్లకు, కోచ్‌లకు మరియు సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపాడు. అంతర్జాతీయ ఫుట్‌బాల్‌లో అత్యధిక గోల్స్, అత్యధిక మ్యాచ్‌లు ఆడిన ఘన రొనాల్డోదే. రొనాల్డోను మూడు యూఈఎఫ్ఏ ప్లేయర్ ఆఫ్ ది ఇయర్ అవార్డులు, 4 యూరోపియన్ గోల్డెన్ షూ పురస్కారాలు వరించాయి. రొనాల్డో ఐదుసార్లు ఫిఫా అత్యుత్తమ ఆటగాడిగా ఎంపికయ్యాడు. రొనాల్డో జట్టులోకి వచ్చిన తర్వాత ప్రపంచకప్‌లో పోర్చుగల్ అత్యుత్తమ ప్రదర్శన సెమీఫైనల్‌కు వెళ్లడం. అది క్రిస్టియానో అరంగేట్రం చేసిన 2006 టోర్నీనే కావడం విశేషం.

పోర్చుగల్‌కు తొలి యూరో టైటిల్ : పోర్చుగల్‌కు మొట్టమొదటి యూరోపియన్ ఛాంపియన్‌షిప్ టైటిల్‌ను అందించిన ఘనత కూడా రొనాల్డోదే. 2016 యూరో కప్‌ను అతడి సారథ్యంలో పోర్చుగల్ సొంతం చేసుకుంది. ఆ టోర్నీలో కెప్టెన్‌గా జట్టును నడిపించడమే కాకుండా ఫైనల్లో 3 కీలక గోల్స్ కూడా చేశాడు. ఆ తర్వాత 2019లో స్విట్జర్లాండ్‌తో జరిగిన సెమీఫైనల్లో హ్యాట్రిక్ గోల్స్ సాధించి.. తొలి ఎడిషన్ నేషన్స్ లీగ్ కప్‌ను పోర్చుగల్ గెలవడంలో రొనాల్డో కీలక పాత్ర పోషించాడు. 2025లో స్పెయిన్‌తో జరిగిన ఫైనల్లో గోల్ కొట్టి, పోర్చుగల్‌కు రెండోసారి నేషన్స్ లీగ్ టైటిల్‌ను అందించాడు.

క్రిస్టియానో రొనాల్డో తన కెరీర్‌లో ఎన్నో అద్భుత విజయాలు సాధించినప్పటికి.. ఫిఫా ప్రపంచకప్ టైటిల్ మాత్రం అందని ద్రాక్షగానే మిగిలిపోయింది. రొనాల్డో తన కెరీర్‌లో ఇప్పటి వరకు ఫిఫా ప్రపంచకప్‌ను గెలవలేదు. పోర్చుగల్ తరఫున 6 ప్రపంచకప్‌లు ఆడిన రొనాల్డో.. ఈ ప్రతిష్టాత్మక ట్రోఫీని మాత్రం ముద్దాడలేకపోయాడు. ఫిఫా ప్రపంచకప్ 2026 టోర్నీలో క్వార్టర్ ఫైనల్లో స్పెయిన్ చేతిలో 1-0 తేడాతో పోర్చుగల్ ఓడిపోవడంతో రొనాల్డో ఆఖరి వరల్డ్ కప్ ప్రయాణం ముగిసినట్లు అప్పుడే ప్రకటించాడు.

భారత్-శ్రీలంక తొలి వన్డేకు విశాఖ ఆతిథ్యం



విశాఖ (జర్నలిస్ట్‌ఫైల్) : ఆంధ్రప్రదేశ్ క్రికెట్ అభిమానులకు శుభవార్త. భారత్-శ్రీలంక జట్ల మధ్య జరగనున్న తొలి వన్డే మ్యాచ్‌కు విశాఖపట్నం ఆతిథ్యం ఇవ్వనుంది. తొలుత ఢిల్లీలో నిర్వహించేందుకు నిర్ణయించిన ఈ మ్యాచ్‌ను విశాఖకు మారుస్తున్నట్లు భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) ప్రకటించింది. షెడ్యూల్ ప్రకారం డిసెంబర్ 13న జరగాల్సిన మ్యాచ్ తేదీలో ఎలాంటి మార్పు లేదని, కేవలం వేదికను మాత్రమే మార్చినట్లు స్పష్టం చేసింది. ఢిల్లీలో డిసెంబర్ నెలలో నెలకొనే ప్రతికూల వాతావరణ పరిస్థితులతో పాటు స్టేడియంలో చేపట్టాల్సిన పునరుద్ధరణ పనుల నేపథ్యంలో మ్యాచ్ వేదికను మార్చాలని ఢిల్లీ అండ్ డిస్ట్రిక్ట్ క్రికెట్ అసోసియేషన్ (డీడీసీఏ) బీసీసీఐని కోరింది.

ఈ విజ్ఞప్తిని పరిశీలించిన బీసీసీఐ తొలి వన్డేను విశాఖపట్నంలోని ఏసీఏ-వీడీసీఏ క్రికెట్ స్టేడియంలో నిర్వహించాలని నిర్ణయించింది. దీంతో డిసెంబర్ 13న జరగనున్న మ్యాచ్‌ను ప్రత్యక్షంగా వీక్షించే అవకాశం విశాఖ క్రికెట్ అభిమానులకు దక్కనుంది.

శ్రీలంక జట్టు భారత పర్యటనలో భాగంగా మూడు వన్డేలు, మూడు టీ20 మ్యాచ్‌ల సిరీస్‌లో పాల్గొననుంది. ఈ మేరకు బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా పూర్తి షెడ్యూల్‌ను విడుదల చేశారు.

వన్డే సిరీస్ షెడ్యూల్ : తొలి వన్డే: డిసెంబర్ 13, ఆదివారం - విశాఖపట్నం (మధ్యాహ్నం 2 గంటలకు) రెండో వన్డే: డిసెంబర్ 16, బుధవారం - బెంగళూరు (మధ్యాహ్నం 2 గంటలకు), మూడో వన్డే: డిసెంబర్ 19, శనివారం - అహ్మదాబాద్ (మధ్యాహ్నం 2 గంటలకు),

టీ20 సిరీస్ షెడ్యూల్ : తొలి టీ20: డిసెంబర్ 22, మంగళవారం - రాజ్‌కోట్ (రాత్రి 7 గంటలకు), రెండో టీ20: డిసెంబర్ 24, గురువారం - కటక్ (రాత్రి 7 గంటలకు), మూడో టీ20: డిసెంబర్ 27, ఆదివారం - వేదిక వివరాలు అందుబాటులో లేవు (రాత్రి 7 గంటలకు)

ట్రంప్ అవినీతిపై దర్యాప్తు..



వాషింగ్టన్: అధ్యక్షుడు ట్రంప్ విధానాలపై ఆగ్రహించిన అమెరికన్లు మధ్యంతర ఎన్నికల్లో రిపబ్లికన్లను పక్కన పెట్టి, డెమోక్రాట్లకు పట్టంకట్టారు. ఉభయ సభల్లోనూ అధికారం చేపట్టబోతున్న డెమోక్రాట్లు, ట్రంప్ అవినీతి వ్యవహారాలపై దర్యాప్తు చేస్తామని ప్రకటించారు. ఈ ఎన్నికల్లో ట్రంప్ ప్రభుత్వ అవినీతిపై విస్తృతంగా ప్రచారం జరిగింది. అవినీతిపరులకు ఆయన మద్దతు తెలపడాన్ని ప్రజలు తిరస్కరించారు. తమకు లభించబోయే మెజారిటీతో వచ్చే సబ్‌పీనా (సమన్లు జారీ) అధికారాలను, భారీ సంఖ్యలో దర్యాప్తు సిబ్బందిని ఉపయోగిస్తామని వారు తెలిపారు. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఆయన సన్నిహితులు ప్రజల సొమ్ముతో స్వప్రయోజనాలు పొందారని, దానిపై లోతుగా విచారణ జరుపుతామని వారు స్పష్టం చేశారు. రిపబ్లికన్ పార్టీ, వైట్‌హౌస్ ఎప్పటినుంచో ఈ ఆరోపణలను ఖండిస్తూ వచ్చింది. ట్రంప్ రెండోసారి అధికారంలోకి వచ్చాక ఆయన కుటుంబ సంపద ఎలా పెరిగిందో పరిశీలించేందుకు హౌస్ డెమోక్రాట్లు విస్తృత ప్రణాళికను సిద్ధం చేస్తున్నారు. హౌస్ స్పీకర్ పదవి చేపట్టే అవకాశమున్న డెమోక్రాటిక్ నేత హకీమ్ జెఫ్రీస్ (న్యూయార్క్), ట్రంప్‌పై మూడోసారి అభిశంసన ప్రక్రియ చేపట్టేందుకు సిద్ధపడుతున్నారని ఆ దేశ మీడియా నివేదించింది. ఈ ప్రయత్నానికి నాయకత్వం వహించే బాధ్యతను జెఫ్రీస్ నెలల క్రితమే ఓవర్‌సైట్, జ్యుడీషియరీ కమిటీల్లో డెమోక్రాట్ల ప్రధాన సభ్యులైన కాలిఫోర్నియా ప్రతినిధి రాబర్ట్ గార్సియా, మేరీల్యాండ్ ప్రతినిధి జేమీ రాస్కిన్‌లకు అప్పగించారు. అవినీతి వల్ల కలిగిన నష్టాన్ని, అమెరికన్లపై ఆర్థిక భారాలు, నిత్యావసరాల ధరలపై ట్రంప్ ప్రభుత్వాన్ని నిలదీయడం డెమోక్రాట్ల వ్యూహంగా కనిపిస్తుందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. మంగళవారం రాత్రి డెమోక్రాట్లకు అనుకూల ఫలితాలు వెలువడగానే గార్సియా "లాయర్‌ను నియమించుకోండి" అంటూ ట్రంప్ అనుచరులను పరోక్షంగా హెచ్చరిస్తూ సోషల్ మీడియా ఎక్స్‌లో పోస్టు చేశారు. సెనేట్‌లోనూ ఇదే తరహా దర్యాప్తులు జరిగే అవకాశం ఉంది. మెజారిటీ నేతగా సెనేట్‌లో తిరిగి బాధ్యతలు చేపట్టనున్న న్యూయార్క్ డెమోక్రాట్ చక్ షుమర్ మాట్లాడుతూ, "ప్రభుత్వంలో అవినీతిని ప్రక్షాళన చేయాలని అమెరికన్లు కోరుకుంటున్నారు" అని అన్నారు.

ముద్దనూరులో దంపతుల ఆత్మహత్య..

ముద్దనూరు (జర్నలిస్ట్‌ఫైల్) : అనారోగ్య సమస్యలు, ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతూ జీవితంపై విరక్తి చెంది వృద్ధ దంపతులు బలవన్మరణానికి పాల్పడిన ఘటన గురువారం కడప జిల్లా ముద్దనూరు మండలంలోని ఉప్పలూరు గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం... ఉప్పలూరు గ్రామానికి చెందిన వృద్ధ దంపతులు పల్లా సావిత్రమ్మ (66), పల్లా ప్రభాకర్ (70) కొన్నేళ్లుగా అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారు. వైద్యం కోసం రెండేళ్ల క్రితం గ్రామం నుంచి వెళ్లిపోయి కడపలో బాడుగ ఇంట్లో ఉంటూ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. రెండు రోజుల క్రితం కడప నుంచి స్వగ్రామానికి వచ్చిన వారు... గురువారం తమ ఇంట్లో పురుగుల మందు తాగి బలవన్మరణానికి పాల్పడ్డారు. వీరికి వివాహమైన ఇద్దరు కుమార్తెలున్నారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను పరిశీలించి కేసు నమోదు చేశారు.

ఎన్నికల ప్రక్రియను హైజాక్ చేశారు

- **నామినేషన్ల నుంచి ఫలితాల దాకా రిగ్గింగ్.. అధికార దుర్వినియోగం**
- **పోలీసుల అండతో వైసీపీ అభ్యర్థులను అడ్డుకున్నారు**
- **రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారు.. మాజీ సీఎం జగన్ విమర్శలు**



అమరావతి (జర్నలిస్ట్‌ఫైల్) : రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియను అధికార పార్టీ హైజాక్ చేసిందని వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆరోపించారు. నామినేషన్ల దశ నుంచి ఫలితాల ప్రకటన వరకు అడుగడుగునా అక్రమాలు, రిగ్గింగ్ జరిగాయని విమర్శించారు. గురువారం తాడేపల్లిలోని వైసీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో ఎన్నికల సందర్భంగా జరిగినట్లు ఆరోపిస్తున్న అక్రమాలకు సంబంధించిన వీడియోలను ప్రదర్శించారు. ముఖ్యమంత్రి నుంచి డీజీపీ, ఈఐజీ, ఎస్పీ, డీఎస్పీ మొదలుకొని రిటర్నింగ్ అధికారుల వరకు వ్యవస్థ మొత్తం అధికార పార్టీకి అనుకూలంగా పనిచేసిందని ఆరోపించారు. రాష్ట్రంలో జరిగిన దాడులను దేశమంతా చూసిందని, ఆంధ్రప్రదేశ్ దక్షిణ బిహార్‌లా మారిపోయిందని వ్యాఖ్యానించారు. ప్రస్తుతం జరిగినవి ఎన్నికలు కావని, సెలక్షన్లని విమర్శించారు.

ఎన్నికల ప్రక్రియ అంతా కబ్జా : స్వేచ్ఛాయుత, నిష్పాక్షిక ఎన్నికలే ప్రజాస్వామ్యానికి మూలస్తంభాలని జగన్ పేర్కొన్నారు. ఈ ఎన్నికల్లో ఆ సూత్రాలనే పూర్తిగా పక్కనపెట్టారని ఆరోపించారు. అధికార దుర్వినియోగం, రౌడీయిజంతో ఎన్నికల ప్రక్రియను రిగ్గింగ్ చేశారని అన్నారు. సూపర్ సిక్స్, సూపర్ సెవెన్, 143 హామీల పేరుతో ఇంటింటికీ వెళ్లి బాండ్లు ఇచ్చిన ముఖ్యమంత్రి.. వాటిని అమలు చేయకపోవడంతో ప్రజలను ఎదుర్కొనే ధైర్యం లేక ఎన్నికలనే హైజాక్ చేశారని విమర్శించారు. తెదేపా కార్యకర్తలతో పోలీసులు కుమ్మక్కై వైసీపీ అభ్యర్థులను నామినేషన్లు వేయకుండా అడ్డుకున్నారని ఆరోపించారు. రాష్ట్రవ్యాప్తంగా 17 మున్సిపాలిటీల్లో వైసీపీ ఛైర్‌పర్సన్ అభ్యర్థులకు నామినేషన్లు వేసే అవకాశం ఇవ్వలేదని, మరో 22 మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో నామినేషన్ దశలోనే పోటీ లేకుండా చేశారని తెలిపారు.

నామినేషన్లు, పరిశీలన, పోలింగ్ కేంద్రాలు, పోలింగ్ శాతం మొదలుకొని రాత్రివేళ బ్యాలెట్ బాక్సుల రిగ్గింగ్ వరకు ఎన్నికల ప్రక్రియ మొత్తాన్ని ప్రభావితం చేశారని ఆరోపించారు. విశాఖలో ఆందోళన చేసిన తర్వాతే స్ట్రాంగ్ రూములకు సీల్ వేశారని పేర్కొన్నారు. పలుచోట్ల దొంగ ఓట్లు వేశారని, ఓటర్ల నుంచి స్లిప్పులు తీసుకుని వారిని బయటకు పంపించేశారని విమర్శించారు. అక్రమాలను చిత్రీకరిస్తున్న మీడియా ప్రతినిధులపైనా దాడులు చేశారని అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో చోటుచేసుకుంటున్న పరిణామాలు దేశవ్యాప్తంగా ఎన్నికల సంస్కరణల అవసరాన్ని చాటే కేస్ స్టడీగా నిలుస్తాయని వ్యాఖ్యానించారు.

ప్రజల ఆస్తులను అమ్మకానికి పెడుతున్నారు : మహిళలకు, ఉద్యోగులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేయలేదని జగన్ విమర్శించారు. ప్రజల ఆస్తులను కాపాడాల్సిన ప్రభుత్వం వాటిని అమ్మకానికి పెడుతోందని ఆరోపించారు. పోర్టులు, హార్బర్లను సైతం అక్రమాలకు పాల్పడుతూ విక్రయించేందుకు సిద్ధమవుతోందన్నారు. ప్రభుత్వ భూములను తమకు అనుకూలమైన వారికి అతి తక్కువ ధరలకు కట్టబెడుతున్నారని విమర్శించారు. రాష్ట్రంలో 'ఆంధ్రప్రదేశ్ ఫర్ సేల్' అనే పరిస్థితి నెలకొందని అన్నారు. చంద్రబాబు తన స్వార్థ ప్రయోజనాల కోసం రాష్ట్ర ప్రతిష్టను దిగజారుస్తున్నారని ఆరోపించారు. జెన్‌జీ యువత ప్రజాస్వామ్య హక్కుల కోసం గొంతెత్తుతున్న సమయంలో రాష్ట్రంలో రిగ్గింగ్, సైక్లింగ్, ప్రజాస్వామ్యాన్ని దెబ్బతీయడం వంటి వాటిపై శిక్షణ ఇచ్చే పరిస్థితి ఏర్పడిందని వ్యాఖ్యానించారు.

తుపాను బాధితులకు సాయం ఏదీ? : రాష్ట్రంలో తుపాను ప్రభావంతో పది మంది ప్రాణాలు కోల్పోయారని జగన్ తెలిపారు. పది రోజులు గడిచినా 150 గ్రామాలకు విద్యుత్తు సరఫరా పునరుద్ధరించలేదని ఆరోపించారు. మురసు తుపానుతో ఇద్దరు మృతి చెందారని, తుపాను కారణంగా నష్టపోయిన రైతులు, ప్రజలకు ఇప్పటివరకు ఎలాంటి ఆర్థిక సాయం అందలేదని విమర్శించారు. గత ఏడాది మోంథా తుపాను వల్ల జరిగిన పంట నష్టానికి సంబంధించి ఇప్పటికీ ఇన్‌పుట్ సబ్సిడీ చెల్లించలేదని పేర్కొన్నారు.

జర్నలిస్ట్ ఫైల్ JOURNALIST FILE
సంపాదక స్వరం EDITORIAL
ప్రజా ప్రయోజనం | వాస్తవ విశ్లేషణ | బాధ్యతాయుత అభిప్రాయం


- ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్న ప్రలోభాల రాజకీయాలు
- ఓటరు స్వేచ్ఛను కొనుగోలు చేయాలనుకునే ధోరణికి పలమనేరు ఘటన ఒక హెచ్చరిక

ట్రంప్‌కు డెమోక్రాట్ల షాక్‌తో

మారనున్న అంతర్జాతీయ సమీకరణాలు !

- అమెరికా మధ్యంతర ఎన్నికల ప్రకంపనలు..
- ప్రపంచంపై ప్రభావం ప్రపంచ మార్కెట్లలో ఉత్సాహం
- భారత్‌పై వాణిజ్య, దౌత్య ప్రభావాలపై ఆసక్తికర చర్చ

ప్రపంచ రాజకీయాలు, ఆర్థిక వ్యవస్థపై అమెరికా ప్రభావం ఎంతటిదో మరోసారి రుజువైంది. అమెరికా మధ్యంతర ఎన్నికల్లో అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నాయకత్వంలోని రిపబ్లికన్ పార్టీకి ఎదురైన ఘోర పరాజయం కేవలం ఆ దేశ అంతర్గత రాజకీయ పరిణామంగా మిగిలిపోయే పరిస్థితి లేదు. ప్రతినిధుల సభ, సెనేట్ రెండింటినీ డెమోక్రాట్లు కైవసం చేసుకోవడంతో అమెరికా రాజకీయాల్లో అధికార సమతుల్యత మారింది. ఈ పరిణామం అంతర్జాతీయ వాణిజ్యం, యుద్ధాలు, దౌత్య సంబంధాలు, ఇంధన ధరలు, ప్రపంచ ఆర్థిక మార్కెట్లపై ప్రభావం చూపే అవకాశం ఉంది. అగ్రరాజ్యంలో చోటుచేసుకున్న ఈ రాజకీయ మార్పును ప్రపంచ దేశాలు ఆసక్తిగా గమనిస్తున్నాయి.



ట్రంప్ దూకుడుకు అడ్డుకట్ట పడేనా? : అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్ రెండోసారి బాధ్యతలు చేపట్టిన తర్వాత అనేక అంశాల్లో దూకుడైన నిర్ణయాలు తీసుకున్నారు. దిగుమతి సుంకాల పెంపు, వలస విధానాల్లో కఠినత్వం, అంతర్జాతీయ వాణిజ్యంపై ఒత్తిళ్లు, విదేశాంగ వ్యవహారాల్లో ఏకపక్ష ధోరణి వంటి అంశాలు అనేక దేశాలను ఇబ్బందులకు గురిచేశాయి. అయితే తాజా ఎన్నికల ఫలితాలతో కాంగ్రెస్‌పై రిపబ్లికన్ల ఆధిపత్యం ముగిసింది. ఇకపై ట్రంప్ ప్రభుత్వం ప్రతిపాదించే బిల్లులు, బడ్జెట్ కేటాయింపులు, విధానపరమైన నిర్ణయాలకు డెమోక్రాట్ల నుంచి గట్టి ప్రతిఘటన ఎదురయ్యే అవకాశం ఉంది. ప్రభుత్వ వ్యవహారాలపై కాంగ్రెస్ పర్యవేక్షణ కూడా పెరగవచ్చు. అయితే అధ్యక్షుడి కార్యనిర్వాహక అధికారాలు యథాతథంగా కొనసాగుతాయి. అందువల్ల ట్రంప్ నిర్ణయాలన్నింటికీ తక్షణమే అడ్డుకట్ట పడుతుందని భావించడం తొందరపాటే.

యుద్ధాలపై మారనున్న వైఖరి? : ప్రస్తుతం ప్రపంచాన్ని ఆందోళనకు గురిచేస్తున్న అంశాల్లో ఇరాన్-అమెరికా ఉద్రిక్తతలు, రష్యా-ఉక్రెయిన్ యుద్ధం ప్రధానమైనవి. ఇరాన్‌తో సైనిక ఘర్షణలు అమెరికా ఆర్థిక వ్యవస్థపైనా, అంతర్జాతీయ చమురు సరఫరాపైనా ప్రభావం చూపుతున్నాయి. యుద్ధ వ్యయాలు, సైనిక చర్యలపై కాంగ్రెస్‌లో డెమోక్రాట్లు ప్రశ్నలు లేవనెత్తే అవకాశం ఉంది. దీంతో ట్రంప్ ప్రభుత్వం సైనిక చర్యలకు సంబంధించిన నిధులు, వ్యూహాల విషయంలో మరింత రాజకీయ, చట్టపరమైన పరిశీలనను ఎదుర్కోవాల్సి రావచ్చు.

మరోవైపు ఉక్రెయిన్‌కు అమెరికా సైనిక, ఆర్థిక సహాయంపై కూడా కొత్త చర్చలు ప్రారంభమయ్యే అవకాశముంది. డెమోక్రాట్లు ఉక్రెయిన్‌కు మద్దతు కొనసాగించాలని కోరుకుంటుండగా, రష్యాపై ఆంక్షలు, అమెరికా విదేశాంగ విధానంలో మార్పులు వంటి అంశాలు అంతర్జాతీయ సమీకరణాలను ప్రభావితం చేయవచ్చు. అయితే ఎన్నికల ఫలితాల కారణంగా యుద్ధాలు వెంటనే ముగుస్తాయని చెప్పలేం. శాంతి చర్చలు, దౌత్య ప్రయత్నాలు, ఆయా దేశాల వ్యూహాత్మక ప్రయోజనాలే తుది పరిణామాలను నిర్ణయిస్తాయి.

చమురు ధరలపై ఆశలు.. గల్ఫ్ దేశాల్లో కొత్త సమీకరణాలు : అమెరికా-ఇరాన్ ఉద్రిక్తతలు తగ్గితే అంతర్జాతీయ చమురు సరఫరాకు మార్గం సుగమం కావచ్చు. ముఖ్యంగా హోర్మూజ్ జలసంధి ద్వారా జరిగే చమురు రవాణాకు అంతరాయాలు తగ్గితే ప్రపంచ మార్కెట్లో ధరలు దిగివచ్చే అవకాశం ఉంటుంది. ఇరాన్ చమురు ఎగుమతులపై ఆంక్షలు, గల్ఫ్ ప్రాంతంలో భద్రతా పరిస్థితులు కూడా ఇందులో కీలక పాత్ర పోషిస్తాయి. చమురు ధరలు తగ్గితే భారత్ వంటి దిగుమతులపై ఆధారపడే దేశాలకు ఊరట లభిస్తుంది. రవాణా ఖర్చులు, ద్రవ్యోల్బణ ఒత్తిళ్లు తగ్గే అవకాశముంటుంది. అయితే రాజకీయ మార్పుల ఆధారంగానే చమురు ధరలు నిర్ణయించబడవు. అంతర్జాతీయ డిమాండ్, సరఫరా, ఉత్పత్తిదారుల నిర్ణయాలు కూడా కీలకం.

ప్రపంచ స్టాక్ మార్కెట్లలో ఉత్సాహం : అమెరికా ఎన్నికల ఫలితాల అనంతరం ప్రపంచ ఆర్థిక మార్కెట్లలో సానుకూల స్పందన కనిపించింది. డెమోక్రాట్లు రెండు సభల్లోనూ ఆధిపత్యం సాధించడంతో ట్రంప్ ప్రభుత్వం ఏకపక్షంగా విధాన మార్పులు చేసే అవకాశాలు తగ్గుతాయని పెట్టుబడిదారులు భావిస్తున్నారు. వాషింగ్టన్‌లో రాజకీయ ప్రతిష్ఠంభన ఏర్పడితే కొత్త విధానపరమైన అనిశ్చితులు తగ్గవచ్చనే అంచనాలు మార్కెట్లకు ఊతమిచ్చాయి. నవంబర్ 4న అమెరికా స్టాక్ మార్కెట్లలో ప్రధాన సూచీలు గణనీయంగా పెరిగాయి. డౌ జోన్స్ సుమారు మూడు శాతం లాభపడగా, ఎస్ అండ్ పీ 500, నాస్‌డాక్ సూచీలు కూడా పెరుగుదల నమోదు చేశాయి. ప్రపంచ మార్కెట్లలోనూ కొనుగోళ్ల ఉత్సాహం కనిపించింది. అయితే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగంపై నియంత్రణలు పెరగవచ్చనే ఆందోళనతో కొన్ని టెక్నాలజీ షేర్లలో ఒడిదుడుకులు నమోదయ్యాయి.

భారత్‌కు అవకాశాలా.. కొత్త సవాళ్లా? : అమెరికా ఎన్నికల ఫలితాలు భారత్‌కు కూడా ప్రాధాన్యత కలిగినవే. ఇరు దేశాల మధ్య వాణిజ్యం, రక్షణ, సాంకేతిక పరిజ్ఞానం, ఇంధనం, విద్య, వ్యూహాత్మక భాగస్వామ్యం వంటి అనేక రంగాల్లో సంబంధాలు కొనసాగుతున్నాయి. ట్రంప్ ప్రభుత్వం విధించిన దిగుమతి సుంకాలు భారత ఎగుమతులపై ప్రభావం చూపాయి. ఇప్పుడు కాంగ్రెస్‌లో డెమోక్రాట్ల ఆధిపత్యం పెరగడంతో వాణిజ్య విధానాలపై మరింత చర్చ జరిగే అవకాశం ఉంది. రష్యా నుంచి చమురు దిగుమతులు, హెచ్-1బీ వీసాలు, భారతీయ నిపుణుల వలస విధానాలు కూడా చర్చకు రావచ్చు. అయితే ఈ అంశాల్లో తక్షణ మార్పులు వస్తాయని ఆశించడం సరికాదు. అధ్యక్షుడి కార్యనిర్వాహక అధికారాలు, అమెరికా ఆర్థిక ప్రయోజనాలు, అంతర్జాతీయ వ్యూహాలు నిర్ణయాత్మకంగా ఉంటాయి. భారత్ తన దౌత్య సంబంధాలను సమతుల్యంగా కొనసాగిస్తూ ఈ పరిణామాలను అవకాశాలుగా మలుచుకోవాలి.

ప్రజల తీర్పు.. పాలకులకు గుణపాఠం : అమెరికా మధ్యంతర ఎన్నికల ఫలితాలు మరో కీలక రాజకీయ సందేశాన్ని ఇస్తున్నాయి. అధికారంలో ఉన్న పార్టీకి ప్రజల మద్దతు శాశ్వతం కాదు. ధరల పెరుగుదల, జీవన వ్యయం, యుద్ధాల ప్రభావం, వలస విధానాలు, ప్రభుత్వ నిర్ణయాలపై ప్రజల్లో అసంతృప్తి పెరిగితే ఎన్నికల్లో దాని ప్రభావం తప్పనిసరిగా కనిపిస్తుంది. అధ్యక్షుడే స్వయంగా ప్రచారంలో పాల్గొన్నప్పటికీ రిపబ్లికన్లకు ఎదురైన పరాజయం దీనికి నిదర్శనం. ప్రజల సమస్యలను పక్కనపెట్టి రాజకీయ ప్రచారానికే ప్రాధాన్యత ఇస్తే ప్రజాస్వామ్యంలో తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందనే హెచ్చరిక ఈ ఫలితాల్లో ఉంది. అయితే డెమోక్రాట్ల విజయం అమెరికా సమస్యలన్నింటికీ పరిష్కారం చూపుతుందని భావించలేం. కాంగ్రెస్‌లో మెజారిటీ సాధించినంత మాత్రాన అధ్యక్షుడి అధికారాలు రద్దు కావు. రానున్న రెండేళ్లు ట్రంప్ ప్రభుత్వం, డెమోక్రాట్ల మధ్య విధానపరమైన పోరాటం మరింత తీవ్రం కావచ్చు. ఈ అంతర్గత రాజకీయ పోరు ప్రపంచ దేశాలపై ఎలాంటి ప్రభావం చూపుతుందన్నది కీలకం.

అమెరికా ఎన్నికలు ఆ దేశ ప్రజల రాజకీయ తీర్పు మాత్రమే కాదు.. ప్రపంచ ఆర్థిక, దౌత్య సమీకరణాలను ప్రభావితం చేసే పరిణామం. యుద్ధాలకు బదులు శాంతి, ఆంక్షలకు బదులు సహకారం, వాణిజ్య ఘర్షణలకు బదులు పరస్పర ప్రయోజనాలు ప్రాధాన్యత పొందాలి. అగ్రరాజ్య రాజకీయ మార్పులు ప్రపంచానికి అనిశ్చితిని కాకుండా స్థిరత్వాన్ని అందించాలి. ప్రజాస్వామ్య తీర్పు ప్రజల జీవితాల్లో సానుకూల మార్పులకు దారితీసినప్పుడే దాని నిజమైన ప్రయోజనం నెరవేరుతుంది.

ఓటుకు వెల కడితే..

ఓటమికి బాధ్యత ఎవరిది?

ఎన్నికల్లో గెలవాలనే ఆశ ఉండవచ్చు. ప్రజల మద్దతు పొందాలనే ఆకాంక్ష ఉండవచ్చు. రాజకీయాల్లో పోటీ, ప్రచారం, వ్యూహాలు సహజం. కానీ ప్రజాస్వామ్యానికి పునాది అయిన ఓటును డబ్బుతో కొనుగోలు చేయాలనుకోవడం మాత్రం అత్యంత ప్రమాదకరమైన ధోరణి. ఓటరుకు డబ్బులు పంచి, తాను ఓడిపోయినందుకు ఆ మొత్తాన్ని తిరిగి ఇవ్వాలని డిమాండ్ చేయడం ప్రజాస్వామ్య విలువలనే ప్రశ్నార్థకం చేస్తోంది. చిత్తూరు జిల్లా పలమనేరు మున్సిపాలిటీలో వెలుగుచూసిన ఒక అభ్యర్థి వ్యవహారం ఎన్నికల రాజకీయాల్లో పెరిగిపోతున్న ధనప్రభావానికి అద్దం పడుతోంది.



పలమనేరు మున్సిపాలిటీలోని 32వ వార్డు నుంచి పోటీ చేసిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ప్రసాద్ రెడ్డి ఎన్నికల్లో ఓటమి పాలయ్యారు. జనసేన అభ్యర్థి చేతిలో పరాజయం ఎదురైన అనంతరం ఆయన విడుదల చేసిన వీడియో సామాజిక మాధ్యమాల్లో చర్చనీయాంశమైంది. ఎన్నికల ప్రచారంలో రూ. 10 లక్షలు అప్పు చేసి, ఒక్కొక్కరికి రూ. 1,000 చొప్పున ఓటర్లకు పంపిణీ చేసినట్లు ఆయన స్వయంగా పేర్కొన్నట్లు వార్తా కథనాలు వెల్లడించాయి. తన వద్ద డబ్బులు తీసుకున్న వారిలో సుమారు 400 మంది తనకు ఓటు వేయలేదని ఆరోపిస్తూ, ఆ మొత్తాన్ని తిరిగి ఇవ్వాలని కోరారు. డబ్బులు ఇవ్వకపోతే వారి ఇళ్ల వద్దకు వచ్చి ఆందోళన చేస్తానని హెచ్చరించినట్లు ప్రచారంలో ఉన్న వీడియోలో పేర్కొన్నారు. తాను ఓడిపోయినా వార్డులో తాగునీటి సమస్య పరిష్కారానికి వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయాలనే హామీని నెరవేర్చాలనుకుంటున్నట్లు కూడా వెల్లడించారు. ఈ పరిణామాల నేపథ్యంలో పార్టీ ఆయనను సస్పెండ్ చేసినట్లు వార్తలు వచ్చాయి.

ఈ ఘటనలో అత్యంత ఆందోళన కలిగించే అంశం అభ్యర్థి ఓటమి కాదు. ఓటరుకు డబ్బులు ఇచ్చి, దానికి ప్రతిఫలంగా ఓటును ఆశించడం, ఆశించిన ఫలితం రాకపోతే డబ్బులు తిరిగి అడగడం. అంటే ఓటు అనేది ప్రజాస్వామ్యంలో పౌరుడికి రాజ్యాంగం కల్పించిన హక్కు కాకుండా, డబ్బులు చెల్లించి కొనుగోలు చేసిన వస్తువుగా భావిస్తున్నారా? అనే ప్రశ్న తలెత్తుతోంది. ఓటరు ఎవరికి ఓటు వేయాలి, ఎవరిని తిరస్కరించాలి అనేది పూర్తిగా అతని వ్యక్తిగత నిర్ణయం. ఎన్నికల సమయంలో ఎవరి నుంచి అయినా డబ్బులు తీసుకున్నప్పటికీ తన ఓటును ఎవరికి వేయాలనే విషయంలో ఓటరుకు సంపూర్ణ స్వేచ్ఛ ఉంటుంది. ఆ స్వేచ్ఛను కొనుగోలు చేయడం ఎవరి వల్లా సాధ్యం కాదు.

నిజానికి ఎన్నికల సమయంలో నగదు, మద్యం, ఇతర ప్రలోభాల పంపిణీ ప్రజాస్వామ్య వ్యవస్థను లోపలినుంచి బలహీనపరుస్తున్నాయి. ప్రజాసేవ చేయాలనే లక్ష్యంతో రాజకీయాల్లోకి రావాల్సిన కొందరు, ఎన్నికలను పెట్టుబడిగా భావిస్తున్నారు. లక్షల రూపాయలు ఖర్చు చేస్తే పదవి వస్తుందని, పదవి వస్తే పెట్టిన పెట్టుబడిని తిరిగి సంపాదించుకోవచ్చనే ఆలోచన రాజకీయాల్లోకి ప్రవేశించడం ప్రజాస్వామ్యానికి శుభసూచకం కాదు. ఈ ధోరణి కొనసాగితే ప్రజాప్రతినిధులుగా ఎన్నికయ్యే వ్యక్తుల ప్రాధాన్యం ప్రజాసేవ నుంచి ఆర్థిక ప్రయోజనాల వైపు మళ్లే ప్రమాదం ఉంది.

ఇక్కడ మరో ముఖ్యమైన విషయాన్ని కూడా విస్మరించకూడదు. ఓటర్లకు డబ్బులు పంచినట్లు అభ్యర్థి స్వయంగా చేసిన ప్రకటనలు నిజమైతే, అది కేవలం రాజకీయ పరాజయానికి సంబంధించిన వ్యవహారం కాదు. ఎన్నికల్లో ఓటర్లను ప్రలోభపెట్టడం, ఓటు హక్కుపై ప్రభావం చూపేందుకు ప్రయత్నించడం ఎన్నికల చట్టాల పరిధిలో పరిశీలించాల్సిన అంశం. డబ్బులు తిరిగి ఇవ్వాలని ఓటర్లపై ఒత్తిడి చేయడం, ఇళ్ల వద్దకు వస్తానని హెచ్చరించడం వంటి చర్యలపైనా సంబంధిత అధికారులు దృష్టి సారించాలి. అయితే వీడియోలో చేసిన ఆరోపణలు, వాటి వాస్తవికత, చట్టపరమైన పరిణామాలపై అధికారిక విచారణ ద్వారా స్పష్టత రావాల్సి ఉంది.

అలాగే డబ్బులు తీసుకున్నారని ఆరోపణలు ఎదుర్కొంటున్న ఓటర్లందరినీ ఒకే గాటన కట్టడం కూడా సమంజసం కాదు. ఎన్నికల్లో డబ్బుల పంపిణీకి పాల్పడే అభ్యర్థులపై చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత ఎంత ఉందో, ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాల్సిన బాధ్యత పౌరులపైనా అంతే ఉంది. ఓటు విలువను గుర్తించి, ప్రలోభాలకు లొంగకుండా అభ్యర్థుల వ్యక్తిత్వం, ప్రజాసేవా దృక్పథం, అభివృద్ధి ప్రణాళికలు, ప్రజలకు అందుబాటులో ఉండే తీరును పరిశీలించి నిర్ణయం తీసుకోవాలి.

ప్రజాస్వామ్యంలో ఎన్నికల ఫలితాలు ప్రజల తీర్పు. ఆ తీర్పును గౌరవించడం ప్రతి అభ్యర్థి కనీస బాధ్యత. గెలిచినవారు అహంకారానికి పోకుండా ప్రజాసేవకు అంకితమవ్వాలి. ఓడిపోయినవారు ఆత్మపరిశీలన చేసుకోవాలి. ప్రజల విశ్వాసాన్ని పొందలేకపోయినప్పుడు అందుకు కారణాలను విశ్లేషించుకోవాలి తప్ప, ఓటర్లపై డబ్బుల వసూళ్లకు దిగడం ఎంతమాత్రం సమర్థనీయం కాదు.


పలమనేరు ఘటన ఒక్క అభ్యర్థి వ్యవహారంగా ముగిసిపోకూడదు. ఎన్నికల సంఘం, రాజకీయ పార్టీలు, ప్రభుత్వ యంత్రాంగం ఈ పరిణామాన్ని తీవ్రంగా పరిగణించాలి. ఎన్నికల్లో అక్రమ నగదు పంపిణీని అరికట్టేందుకు మరింత కఠినమైన నిఘా, పారదర్శకమైన చర్యలు అవసరం. రాజకీయ పార్టీలు కూడా డబ్బు ప్రభావంతో గెలుపును ఆశించే అభ్యర్థులను ప్రోత్సహించకుండా నైతిక ప్రమాణాలను పాటించాలి.

ఓటు అమ్మకానికి కాదు.. ప్రజాస్వామ్యానికి పునాది. ఓటరును కొనుగోలు చేయాలనుకునే రాజకీయాలకు ప్రజలే చరమగీతం పాడాలి. ఓటమికి కారణం ఓటరు కాదు.. ప్రజల విశ్వాసాన్ని గెలుచుకోలేకపోవడమేనన్న సత్యాన్ని ప్రతి రాజకీయ నాయకుడు గుర్తించాలి. ఎన్నికల్లో డబ్బు పంచి గెలవాలనుకునే వారికి పలమనేరు ఘటన ఒక గుణపాఠంగా మిగలాలి.

ప్రాంతీయ అస్తిత్వమా..

జాతీయ సమైక్యతకు సవాలా?

- తమిళనాడుకు ప్రత్యేక జెండా కావాలన్న డిమాండ్‌పై రాజకీయ దుమారం
- ప్రాంతీయ సంస్కృతిని గౌరవిస్తూనే జాతీయ పతాక ఔన్నత్యాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిదీ



భారతదేశం భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీక. భాషలు వేరు.. సంస్కృతులు వేరు.. సంప్రదాయాలు వేరు.. ఆచార వ్యవహారాలు వేరు. అయినప్పటికీ దేశ ప్రజలందరినీ ఒకే జాతీయ భావనతో అనుసంధానిస్తున్నది భారత రాజ్యాంగం, జాతీయ సమైక్యత, ముప్పన్నెల జాతీయ పతాకం. ప్రాంతీయ అస్తిత్వాలను గౌరవించడం భారత ప్రజాస్వామ్య ప్రత్యేకత. అయితే ప్రాంతీయ గౌరవం, జాతీయ సమైక్యత పరస్పర విరుద్ధమైన అంశాలుగా మారకూడదు. ఈ నేపథ్యంలో తమిళనాడుకు ప్రత్యేక రాష్ట్ర జెండా ఏర్పాటు చేయాలన్న తాజా డిమాండ్ దేశవ్యాప్తంగా రాజకీయ చర్చకు తెరతీసింది.

తమిళనాడు ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్ నేతృత్వంలోని టీవీకే ప్రభుత్వంలో కీలక మంత్రిగా ఉన్న ఆధవ్ అర్జున ఈ ప్రతిపాదనను తెరపైకి తీసుకొచ్చారు. నవంబర్ 1న నిర్వహించిన తమిళనాడు ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమంలో మాట్లాడుతూ రాష్ట్రానికి ప్రత్యేక జెండా రూపొందించాలని కోరారు. ముఖ్యమంత్రి విజయ్ తొలుత ఆ జెండాను ఎగురవేయాలని, నవంబర్ 1తో పాటు జూలై 18న కూడా రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక జెండాను ఎగురవేసేలా చర్యలు తీసుకోవాలని అభిప్రాయపడ్డారు. తమిళ భాష, సంస్కృతి, చారిత్రక వారసత్వానికి ప్రత్యేక గుర్తింపుగా రాష్ట్ర జెండా ఉపయోగపడుతుందని ఆయన వాదన. అయితే ఈ ప్రతిపాదనపై బీజేపీ నేతలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేయడంతో రాజకీయ వివాదం మొదలైంది. ఈ డిమాండ్‌ను పూర్తిగా కొత్త అంశంగా చూడలేం. తమిళనాడులో ప్రత్యేక రాష్ట్ర జెండా ప్రతిపాదనకు ఐదు దశాబ్దాలకు పైగా చరిత్ర ఉంది. 1970లో అప్పటి ముఖ్యమంత్రి ఎం. కరుణానిధి ప్రభుత్వం ప్రత్యేక జెండా రూపకల్పన చేసి కేంద్ర ప్రభుత్వ ఆమోదం కోసం ప్రయత్నించింది. ఆ ప్రతిపాదిత జెండాలో రాష్ట్ర చిహ్నమైన ఆలయ గోపురంతో పాటు ఎగువ ఎడమవైపు భారత త్రివర్ణ పతాకాన్ని పొందుపరిచారు. అయితే అప్పట్లో ఈ ప్రతిపాదనకు రాజకీయ, పరిపాలనా స్థాయిలో ఏకాభిప్రాయం కుదరకపోవడంతో అది కార్యరూపం దాల్చలేదు. ఇన్నేళ్ల తర్వాత మళ్లీ అదే అంశం తెరపైకి రావడం గమనార్హం.

ప్రత్యేక జెండా ప్రతిపాదనను వ్యతిరేకిస్తున్న బీజేపీ నేతలు దీనిని ప్రాంతీయవాదాన్ని పెంచే, వేర్పాటువాద భావనలకు అవకాశం కల్పించే చర్యగా అభివర్ణిస్తున్నారు. తమిళ భాషకు, సంస్కృతికి ప్రత్యేక జెండా అవసరం లేదని, భారత జాతీయ పతాకం కిందనే తమిళుల ప్రాంతీయ గుర్తింపునకు తగిన గౌరవం ఉందని వారి వాదన. మరోవైపు, రాష్ట్రానికి ప్రత్యేక చరిత్ర, భాష, సంస్కృతి ఉన్నప్పుడు వాటిని ప్రతిబింబించే గుర్తింపు ఉండటంలో తప్పేమిటని ప్రత్యేక జెండా ప్రతిపాదకులు ప్రశ్నిస్తున్నారు. ఈ రెండు వాదనల మధ్య అసలు చర్చ ప్రాంతీయ అస్తిత్వం, జాతీయ సమైక్యత మధ్య సమతుల్యతను ఎలా సాధించాలన్నదే.

ఇక్కడ రాజ్యాంగపరమైన అంశాలను కూడా స్పష్టంగా అర్థం చేసుకోవాలి. భారత రాజ్యాంగంలో రాష్ట్రాలకు ప్రత్యేక జెండా ఉండాలని కానీ, ఉండకూడదని కానీ స్పష్టమైన నిబంధన లేదు. 2018 జనవరిలో లోక్‌సభలో అడిగిన ప్రశ్నకు కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఇచ్చిన సమాధానంలోనూ ఇదే విషయాన్ని వెల్లడించింది. అయితే రాజ్యాంగంలోని ఆర్టికల్ 51A(ఎ) ప్రకారం జాతీయ పతాకాన్ని, జాతీయ గీతాన్ని గౌరవించడం ప్రతి పౌరుడి ప్రాథమిక విధి. భారత జెండా నియమావళి ప్రకారం జాతీయ పతాక గౌరవం, ప్రాధాన్యతకు భంగం కలగకుండా ఇతర జెండాల ప్రదర్శన ఉండాలి. కాబట్టి రాష్ట్ర జెండా అంశాన్ని కేవలం రాజకీయ నినాదాల ఆధారంగా కాకుండా రాజ్యాంగ, చట్టపరమైన అంశాలను పరిశీలించి నిర్ణయించాల్సి ఉంటుంది.

కర్ణాటకలోనూ ప్రత్యేక రాష్ట్ర జెండాకు సంబంధించి గతంలో ప్రయత్నాలు జరిగాయి. 2018లో అప్పటి ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ప్రభుత్వం పసుపు, తెలుపు, ఎరుపు రంగులతో రాష్ట్ర చిహ్నాన్ని కలిపిన జెండా నమూనాను ప్రతిపాదించింది. ఆ తర్వాత ఈ అంశంపై అధికారిక గుర్తింపు, చట్టపరమైన అంశాలపై చర్చ కొనసాగుతూనే ఉంది. ఇప్పుడు తమిళనాడులో మరోసారి ఈ డిమాండ్ బలంగా వినిపించడం రాష్ట్రాల హక్కులు, సమాఖ్య వ్యవస్థ, జాతీయ చిహ్నాల ప్రాధాన్యతపై విస్తృత చర్చకు దారితీస్తోంది.

భారతదేశం అనుసరిస్తున్నది బలమైన సమాఖ్య వ్యవస్థ. రాష్ట్రాలకు తమ భాష, సంస్కృతి, చరిత్ర, సంప్రదాయాలను పరిరక్షించుకునే హక్కు ఉంది. రాష్ట్రాల ప్రత్యేకతలను గౌరవించడం వల్ల దేశ సమైక్యతకు ముప్పు వాటిల్లుతుందని భావించడం సరైంది కాదు. అదే సమయంలో ప్రాంతీయ భావోద్వేగాలను రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించుకోవడం కూడా ఆమోదయోగ్యం కాదు. ప్రాంతీయ గర్వం జాతీయ గర్వానికి ప్రత్యామ్నాయం కాకూడదు. రెండూ పరస్పరం బలపరిచేలా ఉండాలి.

ప్రత్యేక జెండా ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదన వెనుక నిజమైన సాంస్కృతిక ఆకాంక్ష ఉందా? లేక రాజకీయంగా ప్రత్యేక గుర్తింపు సాధించాలనే వ్యూహమా? అన్నది కూడా పరిశీలించాల్సిన అంశం. ప్రజలకు మెరుగైన విద్య, వైద్యం, ఉపాధి, మౌలిక సదుపాయాలు కల్పించడం, రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి బాటలు వేయడం ప్రభుత్వాల ప్రథమ కర్తవ్యం. ఇలాంటి ప్రాథమిక అంశాలపై దృష్టి సారించాల్సిన సమయంలో జెండా అంశం రాజకీయ వివాదంగా మారడం వల్ల ప్రజలకు ఒనగూరే ప్రయోజనం ఏమిటన్న ప్రశ్న సహజంగానే తలెత్తుతుంది. దేశంలో భిన్నత్వం బలహీనత కాదు.. అదే మన బలం. తమిళ భాష గొప్పదనాన్ని చాటుకోవడానికి, తెలుగు సంస్కృతిని పరిరక్షించుకోవడానికి, కన్నడ సంప్రదాయాలను గౌరవించడానికి, ఇతర ప్రాంతీయ అస్తిత్వాలను కాపాడుకోవడానికి ఎవరి అనుమతి అవసరం లేదు. అయితే ఈ ప్రాంతీయ గుర్తింపులన్నీ భారతీయత అనే విస్తృత భావనలో భాగమనే విషయాన్ని మరచిపోకూడదు. ప్రత్యేక జెండా అంశంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాజకీయ విమర్శలకు పరిమితం కాకుండా రాజ్యాంగ నిపుణులు, చట్ట నిపుణులు, వివిధ రాష్ట్రాల ప్రతినిధులతో చర్చించి స్పష్టమైన విధానాన్ని రూపొందించాలి. రాష్ట్రాల సాంస్కృతిక గుర్తింపులకు గౌరవం కల్పిస్తూనే జాతీయ పతాక ఔన్నత్యం, జాతీయ సమైక్యతకు ఎలాంటి విఘాతం కలగకుండా చూడాలి. ఈ విషయంలో రాజకీయ పార్టీలు బాధ్యతాయుతమైన వైఖరిని ప్రదర్శించాలి.

భారతదేశం అంటే కేవలం భౌగోళిక సరిహద్దుల సమాహారం కాదు.. అనేక భాషలు, సంస్కృతులు, సంప్రదాయాల సమ్మేళనం. ప్రాంతీయ అస్తిత్వాన్ని కాపాడుకోవడం ఎంత ముఖ్యమో, జాతీయ సమైక్యతను పరిరక్షించుకోవడం అంతకంటే ముఖ్యం. ప్రాంతీయ జెండాలపై చర్చ కంటే ప్రజల అభివృద్ధి, రాష్ట్రాల ప్రగతి, సమాఖ్య స్ఫూర్తి బలోపేతంపై పాలకులు ఎక్కువ శ్రద్ధ చూపాలి. రాష్ట్రాల ప్రత్యేకతలు వికసించాలి.. భారతీయత మరింత బలపడాలి. అదే నిజమైన భిన్నత్వంలో ఏకత్వం.

కొత్తపేట యాదవ సంఘం ఆధ్వర్యంలో సదర్ సమ్మేళనానికి ఆహ్వానం



కొత్తపేట,నవంబరు5(జర్నలిస్ట్ ఫైల్) : దీపావళి పండుగ సందర్భంగా నిర్వహించనున్న సదర్ సమ్మేళన కార్యక్రమానికి హాజరుకావాలని కోరుతూ, కొత్తపేట యాదవ సంఘం యాదవ సోదరులు కొత్తపేటలోని బీజేపీ కార్యాలయానికి విచ్చేసి, కొత్తపేట డివిజన్ మాజీ కార్పొరేటర్ శ్రీ నాయకోటి పవన్ కుమార్ గారిని మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వానించడం జరిగింది.

ఏం ఏం పహాడీలో ఘనంగా హజ్రత్ మీర్ మహమూద్ బాబా ఉర్సు ఉత్సవలో పట్లోళ్ల కార్తీక్ రెడ్డి

రాజేంద్రనగర్, నవంబరు 05 (జర్నలిస్ట్ ఫైల్) :





సులేమాన్ నగర్ డివిజన్ పరిధిలోని ఎం ఎం పహాడీలో హజ్రత్ మీర్ మహమూద్ బాబా వారి ఉర్సు ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవాల కు ముఖ్య అతిథిగా బీఆర్ఎస్ పార్టీ రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇంచార్జ్ పట్లోళ్ల కార్తీక్ రెడ్డి హాజరై, ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రజలందరికీ శాంతి,సౌభాగ్యం కలగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ అత్తాపూర్– రాజేంద్రనగర్ సర్కిల్ ఇంచార్జ్ సుభాష్ రెడ్డి,సులేమాన్ నగర్ డివిజన్ అధ్యక్షులు మొహమ్మద్ జహీరుద్దీన్,హైదర్‌గూడ డివిజన్ అధ్యక్షులు చిట్టి గారి నరేందర్ రావు (చిన్న)తో పాటు బీఆర్ఎస్ నాయకులు నయీమ్, అబ్దుల్ రెహమాన్,షకీల్,అఖిల్,షేక్ బాబా,ఇబ్రహీం, నవాజ్, మహబూబ్, షానాజ్, సాబిక్, జంపన్న తదితరులు పాల్గొన్నారు.అలాగే రాజేంద్రనగర్ నియోజకవర్గానికి చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు,కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉర్సు ఉత్సవాల్లో భాగస్వాములయ్యారు.మతసామరస్యం, సోదరభావం, ఐక్యతను చాటిచెప్పే ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు సమాజంలో శాంతి,సామరస్యాలను మరింత బలోపేతం చేస్తాయని ఆయన పేర్కొన్నారు.

జాతీయవాదుల సంగమం – 2026 కార్యక్రమానికి హాజరైన కొత్తపేట డివిజన్ మాజీ కార్పొరేటర్ శ్రీ నాయకోటి పవన్ కుమార్

నాగోల్,నవంబరు 05 (జర్నలిస్ట్ ఫైల్) :





నాగోల్‌లోని శుభం కన్వెన్షన్ హాల్ వేదికగా ఉస్మానియా, కాకతీయ విశ్వవిద్యాలయాల పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయవాదుల సంగమం – 2026 కార్యక్రమం ఘనంగా జరిగింది.ఈ కార్యక్రమానికి *కొత్తపేట డివిజన్ మాజీ కార్పొరేటర్ శ్రీ నాయకోటి పవన్ కుమార్ హాజరై పాల్గొన్నారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఏబీవీపీ పూర్వ అఖిల భారత సహ సంఘటన కార్యదర్శి, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి మరియు తెలంగాణ బీజేపీ ఇన్‌చార్జి శ్రీ సునీల్ బన్సాల్ విచ్చేశారు.ఈ సందర్భంగా బీజేపీ కర్ణాటక రాష్ట్ర సహ ఇన్‌చార్జిగా బాధ్యతలు నిర్వహిస్తున్న డా. కాసం వెంకటేశ్వర్లు గారిని ఘనంగా సన్మానించారు.జాతీయవాద భావజాలం, దేశభక్తి స్ఫూర్తి, జాతీయ సమైక్యత మరియు సమాజం పట్ల బాధ్యతను చాటిచెప్పేలా ఈ సమ్మేళనం ఎంతో వైభవంగా నిర్వహించబడింది. విద్యార్థి దశ నుంచే దేశం పట్ల నిబద్ధత, సమాజ సేవ పట్ల అంకితభావం, జాతీయ సమైక్యత వంటి విలువలను పెంపొందించుకుంటూ దేశ అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలనే గొప్ప సందేశాన్ని ఈ కార్యక్రమం అందించింది.ఉస్మానియా, కాకతీయ విశ్వవిద్యాలయాల్లో విద్యనభ్యసించి వివిధ రంగాల్లో ఉన్నత స్థాయికి ఎదిగిన పూర్వ విద్యార్థులు, ప్రముఖులు, విద్యావేత్తలు, జాతీయవాద భావజాలం కలిగిన నాయకులు ఒకే వేదికపై కలుసుకోవడం ఈ కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు, నాయకులు, పూర్వ విద్యార్థులు, రంగారెడ్డి జిల్లా అర్బన్ నాయకులు, కొత్తపేట డివిజన్ నాయకులు , ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తోట మహేందర్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

మరిపెడలో గంజాయి అక్రమ దందాపై పోలీసుల ఉక్కుపాదం!

- రూ.లక్ష విలువైన 2 కిలోల గంజాయి స్వాధీనం.. ముగ్గురు యువకులు అరెస్ట్!
- మరిపెడ నుంచి మహబూబాబాద్, సూర్యాపేట, ఖమ్మం వరకు గంజాయి విక్రయాల నెట్‌వర్క్?
- చిన్న ప్యాకెట్లుగా తయారుచేసి విక్రయించేందుకు సిద్ధం.. డిజిటల్ వెయింగ్ మెషీన్, మూడు సెల్‌ఫోన్లు సీజ్!
- గంజాయి సమాచారం ఇస్తే రూ.5 వేల నగదు బహుమతి.. వివరాలు గోప్యంగా ఉంచుతాం: సీఐ పవన్ కుమార్.



మరిపెడ, నవంబరు 5 (జర్నలిస్ట్ ఫైల్) : మహబూబాబాద్ జిల్లా మరిపెడ ప్రాంతంలో గంజాయి అక్రమ రవాణా, విక్రయాలపై పోలీసులు ఉక్కుపాదం మోపారు. యువతను మత్తు పదార్థాలకు బానిసలుగా మారుస్తూ అక్రమ దందాకు పాల్పడుతున్న వారిపై మరిపెడ పోలీసులు కఠిన చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో తొర్రూరు రోడ్డులోని మరిపెడ శివారు డబుల్ బెడ్‌రూం సమీపంలో అనుమానాస్పదంగా కనిపించిన ముగ్గురు యువకులను పోలీసులు అదుపులోకి తీసుకొని తనిఖీలు నిర్వహించారు.ఈ తనిఖీల్లో సుమారు రూ.లక్ష విలువ చేసే 2 కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అదేవిధంగా గంజాయి విక్రయాలకు ఉపయోగిస్తున్నట్లు భావిస్తున్న మూడు సెల్‌ఫోన్లు, ఒక డిజిటల్ వెయింగ్ మెషీన్‌ను కూడా స్వాధీనం చేసుకున్నారు. గంజాయిని చిన్నచిన్న ప్యాకెట్లుగా తయారుచేసి వివిధ ప్రాంతాల్లో విక్రయించేందుకు నిందితులు సిద్ధమైనట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది.పోలీసుల వివరాల ప్రకారం.. ఈ అక్రమ గంజాయి విక్రయాలకు సంబంధించి పవార్ విజయ్, కంది అభిరామ్, బానోత్ మణిదీపక్‌లను అరెస్ట్ చేశారు. నిందితులు మరిపెడతో పాటు మహబూబాబాద్, సూర్యాపేట, ఖమ్మం ప్రాంతాల్లో గంజాయిని విక్రయించేందుకు ప్రయత్నిస్తున్నట్లు విచారణలో గుర్తించారు. ఈ మేరకు గంజాయి, సెల్‌ఫోన్లు, డిజిటల్ వెయింగ్ మెషీన్‌ను స్వాధీనం చేసుకొని నిందితులను రిమాండ్‌కు తరలించారు.ఈ సందర్భంగా మరిపెడ సీఐ ఎల్. పవన్ కుమార్ మాట్లాడుతూ.. గంజాయి అక్రమ రవాణా, నిల్వ, విక్రయాలకు పాల్పడే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని హెచ్చరించారు. యువత భవిష్యత్తును నాశనం చేసే మత్తు పదార్థాల అక్రమ దందాపై నిరంతరం నిఘా కొనసాగిస్తామని స్పష్టం చేశారు. గంజాయి విక్రయాలు, రవాణాకు సంబంధించిన సమాచారం ప్రజలకు తెలిస్తే వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు.గంజాయి అక్రమ కార్యకలాపాలకు సంబంధించిన విశ్వసనీయ సమాచారం అందించిన వారికి రూ.5,000 నగదు బహుమతి అందజేస్తామని, సమాచారం ఇచ్చిన వారి పేర్లు, వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని సీఐ తెలిపారు.ఈ ఆపరేషన్‌లో మరిపెడ ఎస్ఐ గండ్రాతి సతీష్‌తో పాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. గంజాయి రహిత సమాజ నిర్మాణానికి ప్రజలు పోలీసులకు సహకరించాలని పోలీసులు కోరారు.

విప్లవోద్యమంలో ప్రాణాలర్పించిన అమరవీరులకు విప్లవ జోహార్లు.

- జేసీఎస్ ప్రసాద్ ఆశయాలు కొనసాగిస్తాం.



నిజామాబాద్, నవంబరు 05 (జర్నలిస్ట్ ఫైల్) : భారత కమ్యూనిస్టు విప్లవోద్యమంలో మరణించిన అమరులను స్మరిస్తూ సీపీఐ(ఎం.ఎల్),మాస్ లైన్ (ప్రజాపంథా)పార్టీ అర్బన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో అమరవీరుల వర్ధంతి సభ నిర్వహించడం జరిగింది.ముందుగా జేసీఎస్ ప్రసాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి,పార్టీ జిల్లా కార్యదర్శి వనమాల కృష్ణ మాట్లాడుతూ..జీవితం ఎంతో విలువైనదని,తమ జీవితాన్ని తమ కోసం కాకుండా సమాజం కోసం,సోషలిస్టు సమాజం కోసం,నూతన ప్రజాస్వామిక విప్లవం కోసం పోరాడి ఈ దేశంలో గత 58 సంవత్సరాల కాలంలో వేలాదిమంది కమ్యూనిస్టు విప్లవకారులు అమరులయ్యారన్నారు.కామ్రేడ్ దేవుల పల్లి వెంకటేశ్వరరావు,చంద్ర పుల్లారెడ్డి,తరిమెల నాగిరెడ్డి,కొల్లా వెంకయ్య,కానూ సన్యాల్,సత్యనారాయణ సింగ్,చారుమజుందార్,రాయల సుభాష్ చంద్రబోస్,పోట్ల రామనర్సయ్య,నీలం రామచంద్రయ్య,డివి కృష్ణ,చంద్రశేఖర్,నిజామాబాద్ జిల్లా నుండి కామ్రేడ్ జేసిఎస్ ప్రసాద్,యాదగిరి,కిరణ్ కుమార్,ఎల్లన్న,సాయిలు తదితరులు పీడిత ప్రజల కోసం తమ జీవితాలను త్యాగం చేశారన్నారు. వీరందరికీ విప్లవ జోహార్లు అర్పిస్తున్నామన్నారు. మోడీ ప్రభుత్వం దేశ సంపదను,ప్రజల వనరులను కార్పొరేట్ కంపెనీలకు కట్టబెడుతు మతోన్మాదం,విద్వేష రాజకీయాలతో ప్రజల ఐక్యతను విచ్ఛిన్నం చేసిందన్నారు.మోడీ పాలనకు విసుగు చెందిదేశంలో యువత, ప్రజలు, ప్రజాస్వామ్యవాదులు ప్రశ్నించడం, వీధిల్లోకి వచ్చి మోడీ ప్రభుత్వాన్ని నిలదీసే ప్రస్థానం ఆరంభమైందన్నారు. ఇది దేశ ప్రజాస్వామ్య హక్కుల కోసం జరిగే పోరాటం అని ఈ పోరాటాన్ని మరింత విస్తృతం చేయాలన్నారు.ఈ పోరాటంలో ప్రగతిశీల యువత, ప్రజాస్వామ్యవాదులు,ముఖ్యంగా కమ్యూనిస్టుల పాత్ర పెరగాలన్నారు.భారతదేశ ప్రజానీ కం ఫాసిజానికి తలవంచి ఉండదని,తలెత్తి,గొంతెత్తి,ప్రశ్నించి నిగ్గదీసి పాతర వేస్తుందని తెలియజేయాలన్నారు.అమరవీరుల స్వప్నాలైన సమసమాజం,నూతన ప్రజాస్వామిక విప్లవం కోసం పోరాడడమే నిజమైన నివాళి అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర నాయకులు ఎం.నరేందర్ నిజామాబాద్, బోధన్ డివిజన్ కార్యదర్శులు ఎం. వెంకన్న,డి.రాజేశ్వర్,నగర కార్యదర్శి ఎం.సుధాకర్, పార్టీ జిల్లా నాయకులు కే.గంగాధర్,బి.మల్లేష్, డి.కిషన్, పిఓడబ్ల్యు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వి.గోదావరి, కే.సంధ్యారాణి,పిడిఎస్యు జిల్లా ప్రధాన కార్యదర్శి అనిల్ సీ.ఎల్.సీ జిల్లా సహాయ కార్యదర్శి భాస్కరస్వామి వివిధ ప్రజా సంఘాల నాయకులు ఒడ్డెన్న,లింగం,మోహన్,గంగాధర్, నాగమణి, అమూల్య, గీత , సృజన్, రమేష్, గురు, రామనర్సయ్య,మానస,సుజాత తదితరులు పాల్గొన్నారు.

పోలీసు ఉద్యోగాలకు ట్రాన్స్‌జెండర్లకు ప్రత్యేక శిక్షణ

- 20 మందికి నాలుగు నెలల పాటు ఉచిత శిక్షణ.. వసతి సౌకర్యం కూడా





నేరెడ్‌మెట్, నవంబరు5 జర్నలిస్ట్ ఫైల్) : తెలంగాణ పోలీసు నియామక ప్రక్రియ– 2026లో భాగంగా పోలీసు కానిస్టేబుళ్లు, ఎస్ఐ ఉద్యోగాలకు పోటీపడుతున్న ట్రాన్స్‌జెండర్లకు మల్కాజిగిరి పోలీసు కమిషనరేట్ ప్రత్యేక శిక్షణ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. సమాన అవకాశాలు కల్పించడంతోపాటు సమాజంలో గౌరవప్రదమైన ఉపాధి అవకాశాలను పెంపొందించాలనే లక్ష్యంతో ఈ వినూత్న కార్యక్రమాన్ని ప్రారంభించింది.మల్కాజిగిరి పోలీసు కమిషనరేట్, దివ్యాంగులు, వయోవృద్ధులు, ట్రాన్స్‌జెండర్ల సాధికారత శాఖ సంయుక్త ఆధ్వర్యంలో, తెలంగాణ మహిళా భద్రతా విభాగంలోని మానవ అక్రమ రవాణా నిరోధక విభాగం సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఎంపికైన 20 మంది అభ్యర్థులకు నాలుగు నెలల పాటు రాత పరీక్షకు ప్రత్యేక శిక్షణతోపాటు వసతి సౌకర్యం కల్పించనున్నారు. శిక్షణ, వసతి ఖర్చుల నిమిత్తం సంబంధిత శాఖ రూ.3.50 లక్షల ఆర్థిక సహాయాన్ని మంజూరు చేసింది.కార్యక్రమ ప్రారంభోత్సవంలో మల్కాజిగిరి పోలీసు కమిషనర్ బి. సుమతి ఐపీఎస్ అభ్యర్థులకు భారత, తెలంగాణ చరిత్ర, అంకగణితం, తార్కిక విశ్లేషణ, భూగోళ శాస్త్రం, వర్తమాన అంశాలు, ఆర్థికశాస్త్రానికి సంబంధించిన అధ్యయన సామగ్రిని అందజేశారు. అభ్యర్థులకు అవసరమైన వసతి, నిరంతర శిక్షణ అందిస్తామని, వారి పురోగతిని మానవ అక్రమ రవాణా నిరోధక విభాగం ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుందని తెలిపారు. క్రమశిక్షణ, పట్టుదల, ఏకాగ్రతతో చదివి ప్రభుత్వ పోలీసు ఉద్యోగాలు సాధించి పోలీసు కుటుంబంలో భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు. దిల్‌సుఖ్‌నగర్‌లోని యూనిక్ కోచింగ్ సెంటర్, కల్పన హాస్టల్ సహకారంతో శిక్షణ, వసతి ఏర్పాట్లు చేశారు. అభ్యర్థులు, పోలీసు అధికారులు, సంబంధిత శాఖ ప్రతినిధులు, శిక్షణ సిబ్బంది, హాస్టల్ నిర్వాహకులతో ప్రత్యేక వాట్సాప్ బృందాన్ని ఏర్పాటు చేసి నిరంతర పర్యవేక్షణ చేపట్టనున్నారు. ఇప్పటికే హైదరాబాద్‌లో పలువురు ట్రాన్స్‌జెండర్లు ట్రాఫిక్ అసిస్టెంట్లుగా సేవలందిస్తుండగా, వారిలో ఇద్దరు మల్కాజిగిరి కమిషనరేట్ పరిధిలో పనిచేస్తున్నారు. వీరితోపాటు మరింతమందికి కానిస్టేబుల్, ఎస్ఐ స్థాయి ఉద్యోగాలు సాధించేలా అవకాశాలు కల్పించడం ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశం.ప్రభుత్వం, పోలీసు శాఖ అందిస్తున్న సహకారంపై అభ్యర్థులు కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణలో తొలిసారిగా చేపట్టిన ఈ కార్యక్రమం ట్రాన్స్‌జెండర్లకు ప్రభుత్వ ఉద్యోగాల్లో సమాన అవకాశాలు, ఆత్మగౌరవం, సామాజిక సమ్మిళిత త్వానికి బాటలు వేయనుంది. కార్యక్రమంలో తెలంగాణ దివ్యాంగులు, వయోవృద్ధులు, ట్రాన్స్‌జెండర్ల సాధికారత శాఖ సమన్వయకర్త ప్రీతి సునంద, మహిళా భద్రత డీసీపీ ఉషారాణి, ఏసీపీ, మహిళా భద్రత విభాగం ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

అవార్డు గ్రహీత సిద్దెల హుస్సేన్ కు సన్మానం

పీనపాక, నవంబరు 05 (జర్నలిస్ట్ ఫైల్) :

కళా రత్న మూవీస్ సంస్థ నుంచి ఇటీవల హైదరాబాద్ లో "ఇండియన్ గ్లోరీ" అవార్డు తీసుకున్న ప్రజా కళాకారుడు, బిటిపిఎస్ ఉద్యోగి సిద్దేల హుస్సేన్ ను ఆ కర్మాగార చీఫ్ ఇంజనీర్ బిచ్చన్న సన్మానించారు. మణుగూరులోని బీటీపీఎస్ లో బుధవారం ఈ సన్మాన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా చీఫ్ ఇంజనీర్ బిచ్చన్న మాట్లాడుతూ సిద్దుల హుస్సేన్ పలు కళా ప్రదర్శనలు ద్వారా ప్రజలను చైతన్య పరుస్తున్నారని కొనియాడారు. తెలంగాణ ఉద్యమంలో కూడా ధూమ్ దాం కార్యక్రమాలను నిర్వహిస్తూ చురుకైన పాత్ర పోషించాలని గుర్తు చేశారు. ఆయనకు మరిన్ని అవార్డులు రివార్డులు రావాలని ఆకాంక్షించారు. సిద్ధులు హుస్సేన్ లాంటి కళాకారుడు బీటీపీఎస్ లో పనిచేస్తున్నందుకు గర్వకారణంగా ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డివైసిఎ (డిప్యూటీ కంట్రోలర్ ఆఫ్ అకౌంట్స్) శ్రీనివాస్, డివిజనల్ ఇంజనీర్లు మహేందర్, చక్రధర్, ఏడిఈ సత్యనారాయణమూర్తి, అసిస్టెంట్ ఇంజనీర్ శ్రీకాంత్, కార్మిక సంఘం- 1535 రీజినల్ అధ్యక్షులు వి.ప్రసాద్, ప్రధాన కార్యదర్శి ఆర్. రామచందర్, నాయకులు రమణ తదితరులు పాల్గొన్నారు



భూ వివాదాలకు శాశ్వత పరిష్కారమే లక్ష్యం!

- రైతుల సమక్షంలోనే సమగ్ర భూ సర్వే.. వచ్చే ఏడాదిలోగా రాష్ట్రంలోని ప్రతి అంగుళం భూమికి కొలతలు
- క్షేత్రస్థాయిలోనే సమస్యల పరిష్కారం.. నిర్లక్ష్యం వహించే అధికారులపై చర్యలు తప్పవు: మంత్రి పొంగులేటి







మేడ్చల్, నవంబరు 05 (జర్నలిస్ట్ ఫైల్) :

రాష్ట్రంలో భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపడమే లక్ష్యంగా ప్రభుత్వం సమగ్ర భూ సర్వేకు శ్రీకారం చుట్టిందని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. రైతుల సమక్షంలోనే భూముల రీసర్వే నిర్వహించి, ప్రతి భూ యజమానికి వివాదరహిత భూమి హక్కులు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని వెల్లడించారు. వచ్చే ఏడాదిలోగా రాష్ట్రంలోని ప్రతి అంగుళం భూమిని సర్వే చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.బుధవారం మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్‌లో ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు సంబంధించిన భూ సర్వే, రెవెన్యూ, స్టాంపులు–రిజిస్ట్రేషన్లు, గృహనిర్మాణ శాఖలపై జిల్లా ఇన్‌చార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుతో కలిసి పొంగులేటి సుదీర్ఘ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. భూమి ఉన్న ప్రతి రైతుకు ఆధార్ కార్డు తరహాలో భద్రతతో కూడిన భూ రికార్డులు, పట్టాదారు పాస్‌పుస్తకాలు అందించాలన్నది ప్రభుత్వ సంకల్పమని తెలిపారు.రీసర్వే జరిగే గ్రామాల్లో తహసీల్దార్లు ప్రతిరోజూ పర్యటించాలని మంత్రి ఆదేశించారు. ఆర్డీవోలు, అదనపు కలెక్టర్లు, కలెక్టర్లు నిరంతరం పర్యవేక్షించడంతో పాటు కనీసం వారానికి ఒకరోజైనా సర్వే జరిగే గ్రామాలను సందర్శించాలని స్పష్టం చేశారు. రైతుల సమక్షంలోనే భూముల కొలతలు చేపట్టి, వారి అభ్యంతరాలు, సమస్యలను క్షేత్రస్థాయిలోనే పరిష్కరించాలని సూచించారు.125 ఏళ్ల తర్వాత సమగ్ర సర్వే దాదాపు 125 ఏళ్ల క్రితం జరిగిన సర్వే అనంతరం రాష్ట్రంలో మరోసారి ఇంత విస్తృత స్థాయిలో భూ సర్వే చేపడుతున్నట్లు మంత్రి పేర్కొన్నారు. తొలి విడతలో ప్రతి జిల్లాలో ఎంపిక చేసిన రెవెన్యూ గ్రామాల్లో చట్టబద్ధంగా సర్వే ప్రారంభిస్తామని తెలిపారు. సర్వే నంబర్లు ఒకచోట, వాస్తవ భూమి స్వాధీన స్థితి మరోచోట ఉండటం వంటి సమస్యలకు ఈ సర్వే ద్వారా పరిష్కారం లభిస్తుందన్నారు. రెవెన్యూ, అటవీ శాఖల మధ్య సరిహద్దు వివాదాలు, పట్టా భూముల సమస్యలు, భూముల హద్దులపై వివాదాలను గుర్తించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవుక్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలు, పెండింగ్ దరఖాస్తులు, ప్రజల అభ్యంతరాలను అధికారులు దాచకుండా స్పష్టంగా వివరించాలని మంత్రి సూచించారు. మండల స్థాయి అధికారులను యాదృచ్ఛికంగా ఎంపిక చేసి వారి వద్ద ఉన్న సమస్యలపై నేరుగా సమీక్షిస్తున్నట్లు తెలిపారు. పరిష్కారానికి ప్రభుత్వ స్థాయి అనుమతులు, మార్గదర్శకాలు అవసరమైతే అక్కడికక్కడే ఆదేశాలు జారీ చేస్తామని భరోసా ఇచ్చారు. ప్రజా సమస్యలను నిజాయితీగా పరిష్కరించే అధికారులను ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని, ఉద్దేశపూర్వకంగా ప్రజలను ఇబ్బందులకు గురిచేసే వారిపై తక్షణ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.22ఎ సమస్యలపైనా దృష్టి22ఎ నిషేధిత భూముల జాబితాకు సంబంధించి ఇప్పటివరకు జారీ చేసిన జీవోలు, మెమోల పరిధిలోకి రాని సమస్యలు ఏమైనా ఉంటే వాటిని ప్రత్యేకంగా పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను మంత్రి పొంగులేటి ఆదేశించారు. సమగ్ర భూ సర్వే విజయవంతానికి ప్రజాప్రతినిధులు, రెవెన్యూ అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.ఈ కార్యక్రమం లో ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యేలు కాలె యాదయ్య, మనోహర్‌రెడ్డి, అరికెపూడి గాంధీ, బండారు లక్ష్మారెడ్డి, ఊర్లపల్లి శంకర్, మర్రి రాజశేఖర్‌రెడ్డి తదితర ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు

తండాల అభివృద్ధికి బీఆర్ఎస్ హయాంలోనే ప్రాధాన్యం

- గిరిజనులకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయాలి
- గుగులోతు రాజు నాయక్ అక్కన్నపేట మండల టిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు





అక్కన్నపేట, నవంబరు 05 (జర్నలిస్ట్ ఫైల్) :

బీఆర్ఎస్ పార్టీ బలోపేతమే లక్ష్యంగా అక్కన్నపేట మండల పార్టీ అధ్యక్షుడు గుగులోతు రాజు నాయక్ మండలంలోని పలు తండాల్లో బుధవారం పర్యటించారు. నూతనంగా మండల అధ్యక్షుడిగా ఎన్నికైన సందర్భంగా హాథిరాం అంబానాయక్ తండా, శ్రీరామ్ తండా, సేవాలాల్ మహారాజ్ తండా, చౌటకుంట తండాలను సందర్శించి పార్టీ నాయకులు, కార్యకర్తలను కలిశారు.ఈ సందర్భంగా రాజు నాయక్ మాట్లాడుతూ గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అప్పటి గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ గిరిజన ఉప ప్రణాళిక నిధుల ద్వారా అక్కన్నపేట మండలంలోని తండాలకు అనుసంధాన రహదారులు మంజూరు చేయించారని పేర్కొన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం గిరిజనుల సమస్యలను పట్టించుకోవడం లేదని విమర్శించారు. గిరిజన కార్పొరేషన్ ఏర్పాటు, గిరిజన బంధు కింద రూ.12 లక్షల ఆర్థిక సాయం, తండాలను రెవెన్యూ గ్రామాలుగా గుర్తించడం వంటి హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఇరుగు రమేష్, భూక్య వీరన్న నాయక్, భూక్య రాజు నాయక్, సేవాలాల్ మహారాజ్ తండా నాయకులు బానోతు భాస్కర్ నాయక్, బానోతు తిరుపతి నాయక్, హాథిరాం అంబానాయక్ తండా నాయకులు లునావత్ జుమ్లా, బీమా, శ్రీరామ్ తండా నాయకులు బానోతు విజయ్ తదితరులు పాల్గొన్నారు. మహిళలు, పార్టీ కార్యకర్తలు హాజరయ్యారు.

హుస్నాబాద్ నియోజకవర్గంలోని ఆలయాలకు మహర్దశ..!

- ప్రధాన ఆలయాల అభివృద్ధిపై మంత్రి పొన్నం సమీక్ష.
- కార్తీక మాసంలో ఆలయాల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు.



హుస్నాబాద్, నవంబరు 05 (జర్నలిస్ట్ ఫైల్) : హుస్నాబాద్ నియోజకవర్గంలోని ప్రధాన ఆలయాల అభివృద్ధిపై రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ దేవాదాయ శాఖ రాష్ట్ర స్థాయి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో భీమదేవరపల్లి మండలంలోని కొత్తకొండ శ్రీ వీరభద్రస్వామి ఆలయం, హుస్నాబాద్ పట్టణంలోని శ్రీ రేణుకా ఎల్లమ్మ ఆలయం, పాట్లపల్లిలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయాల అభివృద్ధికి సంబంధించి చేపట్టాల్సిన నిర్మాణ పనులు, తీసుకోవాల్సిన చర్యలపై అధికారులతో చర్చించారు.తెలంగాణ ప్రభుత్వం ఇటీవల కొత్తకొండ శ్రీ వీరభద్రస్వామి ఆలయ అభివృద్ధికి రూ.3.80 కోట్లు, హుస్నాబాద్ శ్రీ రేణుకా ఎల్లమ్మ ఆలయ అభివృద్ధికి రూ.80 లక్షలు, పాట్లపల్లి శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి రూ.1.50 కోట్లు కేటాయించిన నేపథ్యంలో, మంజూరైన నిధులతో చేపట్టాల్సిన పనులపై సమీక్షించారు.ఆలయాల నిర్మాణాలు భక్తుల ఆధ్యాత్మిక విశ్వాసాలకు అనుగుణంగా, సంప్రదాయాలకు ప్రాధాన్యత నిస్తూ చేపట్టాలని మంత్రి సూచించారు. ఈ సందర్భంగా దేవాదాయ శాఖ స్థపతి, ఇతర అధికారులు, పండితులు, నిపుణులతో ఆలయాల నిర్మాణ ప్రణాళికలు, అభివృద్ధి పనులపై చర్చించారు.

మిడ్జిల్ లో 152 దూడలకు ఉచిత నట్టల నివారణ మందుల పంపిణీ



మిడ్జిల్, నవంబరు 05 (జర్నలిస్ట్ ఫైల్) : పాడి రైతులు ఆరు నెలల లోపు దూడలకు ప్రతినెలా నట్టల నివారణ మందులు తాగించాలి: పశువైద్యాధికారి డాక్టర్ అనుప శివరాజ్మిడ్జిల్: మండలంలోని బైరంపల్లి, బోయిన్పల్లి, వాద్యాల గ్రామాల్లో మంగళవారం పశువైద్య, పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఉచిత నట్టల నివారణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మొత్తం 152 దూడలకు నట్టల నివారణ మందులు తాగించారు.ఈ సందర్భంగా మండల పశువైద్యాధికారి డాక్టర్ అనుప శివరాజ్ మాట్లాడుతూ.. దూడల్లో నట్టల నివారణ ద్వారా రక్తహీనతను అరికట్టడంతో పాటు శరీర బరువు త్వరగా పెరగడానికి, సంతానోత్పత్తి సామర్థ్యం మెరుగుపడటానికి, రోగనిరోధక శక్తి పెంపొందడానికి దోహదపడుతుందని తెలిపారు. ఆరు నెలల లోపు వయసున్న దూడలకు ప్రతి నెలా తప్పనిసరిగా నట్టల నివారణ మందులు తాగించాలని పాడి రైతులకు సూచించారు.

ఫ్లాగ్ డే విజేతలకు ఎస్పీ జానకి అవార్డుల ప్రదానం



మహబూబ్‌నగర్,నవంబరు 05 (జర్నలిస్ట్ ఫైల్) : జిల్లా పోలీస్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో పోలీస్ ఫ్లాగ్ డే–2026 సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచిన పోలీస్ సిబ్బందికి ఎస్పీ జానకి ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలను అందజేశారు.రాష్ట్రస్థాయి పోలీస్ ఫ్లాగ్ డే పోటీల్లో జిల్లా పోలీస్ సిబ్బంది ప్రతిభ కనబరిచి విజయం సాధించడం అభినందనీయమని ఎస్పీ పేర్కొన్నారు. విధి నిర్వహణతో పాటు వివిధ పోటీల్లో పాల్గొని ప్రతిభను చాటుకోవడం పోలీస్ సిబ్బందిలోని నైపుణ్యానికి నిదర్శనమన్నారు. సిబ్బంది మరింత ఉత్సాహంతో విధులు నిర్వర్తిస్తూ జిల్లా పోలీస్ శాఖకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ఇన్స్పెక్టర్ రవిబాబు, పీఆర్ఓ శ్రీనివాసులు, విజేత వెంకట్ రెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మేయర్ ను సత్కరించిన కార్పొరేటర్లు



గుంటూరు, నవంబర్ 5 (జర్నలిస్ట్ ఫైల్) : గుంటూరు నగరపాలక సంస్థ నూతన మేయర్ గా గెలుపొందిన కోవెలమూడి లక్ష్మీ అపర్ణను గురువారం 35వ డివిజన్ కార్పొరేటర్ తాడిశెట్టి అమల, 42 డివిజన్ కార్పొరేటర్ తాడిశెట్టి ఉత్తేజ్ అభినందించారు. ఈ సందర్భంగా అపర్ణను ఘనంగా సత్కరించి జ్ఞాపిక ను అందజేశారు. మేయర్ గా గుంటూరు నగరాన్ని నెంబర్ వన్ నగరంగా తీర్చి దిద్దుతారని ఆకాంక్ష వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నగరంలో అత్యధిక మెజారిటీతో గెలుపొందిన తాడిశెట్టి అమలను నూతన మేయర్ అపర్ణ అభినందించారు. 35వ డివిజన్ ను కూడా నెంబర్ వన్ డివిజన్ గా తీర్చిదిద్దడానికి తన వంతు కృషి చేస్తానని ఆ డివిజన్ కార్పొరేటర్ ఉత్తేజ్ తెలిపారు. ఉన్నత విద్యను అభ్యసించి.. విదేశాలలో ఉద్యోగం చేసిన తాడిశెట్టి ఉత్తేజ్ మాతృభూమికి సేవ చేయాలనే తలంపుతో తన కుమారుడు రాజకీయాల్లోకి రావడం సంతోషమని అమల పేర్కొన్నారు. పెదనాన్న తాడిశెట్టి వెంకట్రావు, తండ్రి తాడిశెట్టి మురళీ మోహన్ బాటలోనే ఉత్తేజ్ కూడా రాజకీయంగా అత్యున్నత స్థానాలను అధిరోహించాలని మేయర్ లక్ష్మి అపర్ణ ఆకాంక్షించారు. యువత చేతిలోనే దేశభవిష్యత్ ఉందన్నారు. మేయర్ ను కలిసిన వారిలో ఇ.వి.వి యువ కళావాహిని అధ్యక్షుడు వెచ్చ కృష్ణమూర్తి, కొండేబోయిన శీను తదితరులు ఉన్నారు.

గుంటూరు జిల్లాలో ప్రశాంతంగా ముగిసిన జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల పోలింగ్



- ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు, ఘర్షణలు చోటుచేసుకోలేదు: జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్

గుంటూరు, నవంబర్ 5 (జర్నలిస్ట్ ఫైల్) : గుంటూరు జిల్లాలో 13 జడ్పీటీసీ స్థానాలు, ఎంపీటీసీ స్థానాలకు నిర్వహించిన ఎన్నికల పోలింగ్ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు, ఘర్షణలు చోటుచేసుకోకుండా ప్రశాంతంగా ముగిసిందని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. ఎన్నికల నిర్వహణ కోసం జిల్లా స్పెషల్ బ్రాంచ్ ఆధ్వర్యంలో పక్కా ప్రణాళికతో పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

రూట్ మొబైల్స్, స్ట్రైకింగ్ ఫోర్స్, స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్, పోలింగ్ స్టేషన్ ఇన్‌చార్జిలు, ఇతర పోలీసు సిబ్బంది సమన్వయంతో సమర్థవంతంగా విధులు నిర్వహించారని తెలిపారు. ముర‌సు తుఫాన్ ప్రభావంతో వాతావరణ పరిస్థితులు, రవాణా పరంగా కొన్ని అవాంతరాలు ఎదురైనప్పటికీ పోలీసు అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించి సురక్షితంగా విధులకు చేరుకున్నారని వివరించారు. ఎన్నికలు ప్రశాంతంగా ముగిసేందుకు సమన్వయంతో కృషి చేసిన పోలీసు అధికారులతో పాటు రూట్ మొబైల్స్, స్ట్రైకింగ్ ఫోర్స్, స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్ సిబ్బంది, పోలింగ్ స్టేషన్ ఇన్‌చార్జిలను జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ అభినందించారు.

కల్యాణదుర్గం ఎమ్మెల్యేపై దాడికి వైసీపీ యత్నం

- గన్‌మన్‌కు గాయాలు
- అనంతపురం జిల్లా పరిషత్ ఎన్నికల్లో తీవ్ర ఉద్రిక్తత
- ఎమ్మెల్యే రాకను గమనించి దాడికి యత్నించిన వైసీపీ శ్రేణులు



అమరావతి (జర్నలిస్ట్ ఫైల్): పరిషత్ ఎన్నికల పోలింగ్ సందర్భంగా అనంతపురం జిల్లా కల్యాణదుర్గంలో తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. కళ్యాణదుర్గం టీడీపీ ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రపై వైసీపీ శ్రేణులు దాడికి యత్నించాయి. ఈ క్రమంలో అడ్డుకున్న ఆయన గన్‌మన్‌కు గాయాలయ్యాయి. ఈ ఘటనతో కుందుర్పి మండలం బెస్తరపల్లి పోలింగ్ కేంద్రం వద్ద ఉద్రిక్త వాతావరణం నెలకొంది. వివరాల్లోకి వెళితే... బెస్తరపల్లి పోలింగ్‌కేంద్రం వద్ద వైసీపీ నేతలు తమను ఓటు వేయనీయకుండా బెదిరిస్తున్నారని 'పొదుపు లక్ష్మి' బృందానికి చెందిన మహిళలు ఎమ్మెల్యే సురేంద్రకు ఫోన్ చేశారు. దీంతో వారికి ధైర్యం చెప్పేందుకు ఎమ్మెల్యే స్వయంగా పోలింగ్ కేంద్రానికి చేరుకున్నారు.

ఎమ్మెల్యే రాకను గమనించిన వైసీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకుని ఆయనపై దాడికి ప్రయత్నించారు. వెంటనే అప్రమత్తమైన ఎమ్మెల్యే గన్‌మన్ వారిని అడ్డుకున్నారు. ఈ క్రమంలో జరిగిన తోపులాటలో గన్‌మన్ తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటనతో పోలింగ్ కేంద్రం వద్ద ఒక్కసారిగా గందరగోళం ఏర్పడింది. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే రంగంలోకి దిగి, పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు.

తుఫాన్ బాధితులకు అండగా కూటమి మంత్రి దుర్గేష్

- బాధ్యతలు స్వీకరించకముందే ప్రజాసేవలో నూతన కౌన్సిలర్లు
- 100 మంది బాధితులకు నిత్యావసరాల పంపిణీ



నిడదవోలు, నవంబర్ 5 (జర్నలిస్ట్ ఫైల్) : వరుసగా సంభవించిన అర్నబ్, మురసు తుఫాన్ల కారణంగా నిడదవోలు నియోజకవర్గం తీవ్రంగా నష్టపోయిందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. గురువారం నిడదవోలు పట్టణంలోని డొక్కాసీతమ్మ, ఎన్టీఆర్ పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలను ఆయన సందర్శించి బాధితులను పరామర్శించారు. ఇటీవల మున్సిపల్ ఎన్నికల్లో విజయం సాధించిన 28 మంది కూటమి కౌన్సిలర్లతో కలిసి సుమారు 100 మంది బాధితులకు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అర్నబ్ తుఫాన్ కారణంగా పంటలు దెబ్బతిని రైతులు ఇబ్బందులు పడుతుండగా, మురసు తుఫాన్ భారీ వర్షాలు, ఈదురుగాలులతో నిడదవోలు పట్టణాన్ని అతలాకుతలం చేసిందన్నారు. లోతట్టు ప్రాంతాలు జలమయమై జనజీవనం స్తంభించిందని పేర్కొన్నారు. బాధితుల కోసం రెండు పాఠశాలల్లో పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసి మున్సిపల్ సిబ్బంది ద్వారా అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజన సదుపాయాలు కల్పిస్తున్నట్లు వివరించారు. వర్షాలు తగ్గిన అనంతరం బాధితులు ఇళ్లకు వెళ్లే సమయానికి నిత్యావసర వస్తువులు అందుబాటులో ఉండేలా ఐదు కిలోల బియ్యం, కిలో నూనె, కిలో పంచదారతో పాటు కూరగాయలను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ముఖ్యంగా కరోనా సమయంలో ప్రాణాలకు తెగించి ప్రజలకు సేవలందించిన పారిశుద్ధ్య కార్మికులు ప్రస్తుతం వరదల కారణంగా బాధితులుగా మారడం విచారకరమన్నారు. వారికి పార్టీలకతీతంగా అండగా నిలవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని చెప్పారు. ఎన్నికల కోడ్ ముగిసిన అనంతరం ఇళ్లు, ఇళ్ల స్థలాలకు సంబంధించి బాధితులు అందించిన విజ్ఞప్తులను పరిశీలించి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

మున్సిపల్ ఎన్నికల్లో విజయం సాధించిన 28 మంది కూటమి కౌన్సిలర్లు ప్రమాణ స్వీకారం చేయకముందే సహాయక కార్యక్రమాల్లో పాల్గొనడం అభినందనీయమని మంత్రి పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులుగా బాధ్యతలు చేపట్టకముందే ప్రజాసేవకు శ్రీకారం చుట్టడం అభినందించదగిన పరిణామమన్నారు. పునరావాస కేంద్రాల్లో అందుతున్న వసతులు, సహాయంపై బాధితులు సంతృప్తి వ్యక్తం చేశారు.

తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో 354 వైద్య శిబిరాలు నిర్వహణ



గుంటూరు, నవంబర్ 5 (జర్నలిస్ట్ ఫైల్): తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో 354 వైద్య శిబిరాలను గురువారం నిర్వహించామని జిల్లా కలెక్టర్ సి.యం.సాయికాంత్ వర్మ తెలిపారు. గుంటూరు రూరల్ మండలం లాలు పురం గ్రామంలో పోలింగ్ ను పరిశీలించిన కలెక్టర్, అచ్చట ఏర్పాట్లు పట్ల, వైద్య శిబిరం పట్ల ఆరా తీశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో 229, పట్టణ ప్రాంతాల్లో 125 వైద్య శిబిరాలు నిర్వహించి 2,508 మందికి వైద్య సేవలు అందించడం జరిగిందన్నారు. బుధవారం గ్రామీణ ప్రాంతాల్లో 221, పట్టణ ప్రాంతాల్లో 82 వైద్య శిబిరాలు వెరసి 303 శిబిరాలు నిర్వహించి 3,028 మందికి వైద్య సేవలు అందించడం జరిగిందన్నారు. 8 పునరావాస కేంద్రాల్లోను ఏర్పాటు చేసి సేవలు అందించడం జరిగిందన్నారు. గురువారం అప్పాపురం పునరావాస కేంద్రంలో వైద్య శిబిరాన్ని కొనసాగించామని చెప్పారు. తుఫాను అనంతరం వ్యాధులు ప్రభలుటకు అవకాశాలు ఎక్కువగా ఉంటాయని, ముందస్తు చర్యగా వైద్య శిబిరాలను నిర్వహించామని చెప్పారు. ఇప్పటికే తాగునీటి పథకాలను క్లోరినేషన్ చేయడం జరిగిందని పేర్కొన్నారు. పారిశుద్ధ్య నిర్వహణకు ప్రత్యేక చర్యలు చేపట్టడం జరిగిందని చెప్పారు. ప్రజలు కొద్ది రోజులపాటు పారిశుద్ధ్య నిర్వహణ తాగునీటిపై జాగ్రత్తలు వహించాలని కోరారు. నీటిని బాగా మరగకాచి చల్లార్చి తాగాలని కోరారు. వైద్యులు వైద్య సిబ్బంది మంచి సేవలను అందించారని కొనియాడారు.

అన్ని పోలింగ్ కేంద్రాల్లో వైద్య శిబిరాలు

జిల్లాలో జడ్పిటిసి ఎంపీటీసీ ఎన్నికలు పోలింగ్ జరిగిన 724 కేంద్రాల్లోనూ గురువారం వైద్య శిబిరాలను నిర్వహించి సేవలు అందించామని చెప్పారు. బుధవారం అన్ని ఎన్నికల పంపిణీ కేంద్రాల్లో వైద్య శిబిరాలు నిర్వహించామని, ఏడవ తేదీన తెనాలి, ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయంలో జరిగే ఓట్ల లెక్కింపు కేంద్రాల్లోనూ వైద్య శిబిరాలు కొనసాగిస్తామని తెలిపారు. పునరావాస కేంద్రాలలోనూ, గ్రామాల్లోను వైద్య శిబిరాలను నిర్వహించడం పట్ల ప్రజలు సంతోషం వ్యక్తం చేశారని చెప్పారు. వైద్య సేవలను ప్రజలకు చేరువు చేయడం జరిగిందని పేర్కొన్నారు.

ఉద్యోగులకు స్వచ్ఛంద నిష్క్రమణ ఆఫర్.. మైక్రోసాఫ్ట్, గూగుల్ బాటలో మెటా!



అమరావతి (జర్నలిస్ట్ ఫైల్): ప్రపంచవ్యాప్తంగా టెక్ కంపెనీల్లో ఉద్యోగుల తొలగింపులు కొనసాగుతున్న వేళ.. మరో కొత్త పరిణామం చోటుచేసుకుంటోంది. ఉద్యోగులను నేరుగా తొలగించకుండా స్వచ్ఛందంగా సంస్థ నుంచి వైదొలిగే అవకాశాన్ని కల్పిస్తున్నాయి దిగ్గజ కంపెనీలు. ఇప్పటికే మైక్రోసాఫ్ట్, గూగుల్ ఈ విధానాన్ని అనుసరిస్తుండగా.. తాజాగా ఫేస్‌బుక్ మాతృసంస్థ మెటా కూడా ఆ జాబితాలో చేరినట్లు సమాచారం.

ఫ్రాన్స్‌లోని తమ ఉద్యోగులకు స్వచ్ఛంద నిష్క్రమణ పథకాన్ని మెటా ప్రతిపాదించినట్లు ఫ్రెంచ్ మీడియా సంస్థ 'లా లెటర్' వెల్లడించింది. ఫ్రాన్స్‌లో మెటాకు ప్రస్తుతం సుమారు 300 మంది ఉద్యోగులు ఉన్నారు. ఈ పథకం అమలైతే దాదాపు 100 మంది వరకు సంస్థను వీడే అవకాశం ఉందని కథనం పేర్కొంది. అయితే ఏ విభాగాల్లోని ఉద్యోగులపై ప్రభావం పడుతుందన్నది ఇంకా స్పష్టత రాలేదు.

మైక్రోసాఫ్ట్, గూగుల్ పథకాలకు భిన్నంగా మెటా ప్రతిపాదన ఉందని సమాచారం. ఫ్రాన్స్‌లోని కార్మిక చట్టాల ప్రకారం 'కలెక్టివ్ కాంట్రాక్చువల్ టెర్మినేషన్' (ఆర్‌సీసీ) విధానంలో ఈ ప్రక్రియ చేపట్టనుంది. ఇందులో భాగంగా కంపెనీ, కార్మిక సంఘాల మధ్య చర్చలు జరిపి పరస్పర అంగీకారంతో ఉద్యోగుల సంఖ్యను తగ్గించుకుంటారు. ఈ పథకంలో చేరాలనుకునే ఉద్యోగులు నవంబర్ 5లోగా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని నివేదిక తెలిపింది.

ఈ పథకం కింద ఉద్యోగులకు ఆకర్షణీయమైన పరిహారం అందించే ప్రతిపాదనను మెటా ముందుకు తెచ్చినట్లు సమాచారం. ఉద్యోగి సంస్థలో పనిచేసిన ప్రతి ఏడాదికి 2.15 నెలల వేతనానికి సమానమైన మొత్తాన్ని చెల్లించనుంది. దీంతోపాటు పది నెలల పాటు మొబిలిటీ లీవ్ కల్పించి.. ఆ సమయంలో స్థూల వేతనంలో 80 శాతం చెల్లించేలా ప్రతిపాదించినట్లు కథనం పేర్కొంది. ఉద్యోగులకు వృత్తిపరమైన నైపుణ్యాల శిక్షణ, సొంతంగా వ్యాపారం ప్రారంభించేందుకు కూడా సహకారం అందించే అంశాన్ని మెటా పరిశీలిస్తున్నట్లు తెలిపింది.

ఈ ప్రతిపాదనపై జులై నుంచి చర్చలు జరుగుతున్నట్లు సమాచారం. ఫ్రాన్స్‌లో మెటా గతంలోనూ ఇదే తరహా విధానాన్ని అనుసరించింది. 2023లో కుదిరిన ఒప్పందం ప్రకారం అప్పట్లో సుమారు 350 మంది ఉద్యోగులున్న సంస్థలో 88 మంది వైదొలిగే అవకాశం ఏర్పడింది.

ప్రపంచవ్యాప్తంగా మెటాలో సుమారు 66 వేల మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. ఫ్రాన్స్‌లో ప్రతిపాదించిన పథకాన్ని ఇతర దేశాల్లోనూ అమలు చేస్తుందా? అన్నది ఇంకా తెలియరాలేదు. మరోవైపు గూగుల్ ఐదు దేశాల్లో ఉద్యోగులకు స్వచ్ఛంద నిష్క్రమణ అవకాశాలు కల్పించగా.. మైక్రోసాఫ్ట్ అమెరికా, కెనడా, భారత్, బ్రిటన్‌లోని 60 వేల మంది అర్హులైన ఉద్యోగుల కోసం బైఅవుట్ పథకాన్ని ప్రకటించింది.

మెటా కూడా ఈ ఏడాది ఏప్రిల్‌లో ప్రపంచవ్యాప్తంగా 8 వేల ఉద్యోగాలను తగ్గించే ప్రణాళికను ప్రకటించింది. ఇది అప్పటి మొత్తం ఉద్యోగుల్లో 10 శాతానికి సమానం. మే నెలలో మరో 7 వేల మంది ఉద్యోగులను ఏఐకి సంబంధించిన విభాగాలకు బదిలీ చేయాలని నిర్ణయించింది. ఏఐ సాయంతో గతంలో పెద్ద బృందాలు చేయాల్సిన పనులను ఇప్పుడు ఒక్క ఉద్యోగే పూర్తి చేయగలుగుతున్నారని సంస్థ సీఈఓ మార్క్ జుకర్‌బర్గ్ గతంలో పేర్కొన్నారు.

2026లో డిజిటల్ మౌలిక సదుపాయాలు, డేటా కేంద్రాల కోసం మెటా 135 నుంచి 145 బిలియన్ డాలర్ల వరకు మూలధన వ్యయం చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఏఐపై భారీగా పెట్టుబడులు పెడుతున్న టెక్ దిగ్గజాలు.. అదే సమయంలో ఉద్యోగుల సంఖ్యను, పని విధానాలను పునర్వ్యవస్థీకరిస్తుండటం గమనార్హం.

స్వగ్రామంలో ఓటు హక్కు వినియోగించుకున్న ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్



బ్రహ్మంగారిమఠం(జర్నలిస్ట్ ఫైల్) : బ్రహ్మంగారిమఠం మండల జడ్పీటీసీ ఎన్నికల నేపథ్యంలో నేడు తన స్వగ్రామ పంచాయతీ పలుగురాళ్లపల్లె పరిధిలోని జోకుపల్లె పోలింగ్ కేంద్రానికి వెళ్లి తన ఓటు హక్కును వినియోగించుకున్న మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు ప్రతి పౌరుడి బాధ్యత అనే సందేశాన్ని చాటిచెప్పిన ఎమ్మెల్యే.

కృష్ణా-గుంటూరు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటరు నమోదుకు నేడే చివరి తేదీ



- ఒక్కరోజు మాత్రమే గడువు ఉంది

గుంటూరు, నవంబర్ 5 (జర్నలిస్ట్ ఫైల్) : కృష్ణా-గుంటూరు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు ఓటరుగా నమోదుకు కావడానికి నవంబరు ఆరవ తేదీ వరకు మాత్రమే గడువు ఉందని కృష్ణా-గుంటూరు ఉపాధ్యాయ నియోజకవర్గం ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ అధికారి మరియు జిల్లా రెవిన్యూ అధికారి ఎన్.ఎస్.కె.ఖాజావలి తెలిపారు. ఒక్కరోజు మాత్రమే గడువు ఉందని, అర్హులైన ఉపాధ్యాయులు వెంటనే ఫారం-19 ద్వారా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ప్రతి ఎమ్మెల్సీ ఎన్నికకు సంబంధించి ఓటర్ల జాబితాను కొత్తగా రూపొందించడం జరుగుతుందని, గతంలో ఓటర్లుగా నమోదైన ఉపాధ్యాయులు సైతం ప్రస్తుత ఎన్నికల కోసం కొత్తగా ఫారం-19 ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. అర్హత కలిగిన ఉపాధ్యాయులు అందరూ గడువు ముగిసేలోగా దరఖాస్తులను సమర్పించాలని సూచించారు.గత ఎన్నికల సమయంలో 13,505 మంది ఉపాధ్యాయులు ఓటర్లుగా నమోదు కాగా, ప్రస్తుత నమోదు ప్రక్రియలో ఇప్పటి వరకు 10,909 దరఖాస్తులు మాత్రమే అందాయని తెలిపారు. గత ఎన్నికల గణాంకాలతో పోలిస్తే ఇంకా సుమారు 2,600 మందికి పైగా అర్హులైన ఉపాధ్యాయులు ఓటర్లుగా నమోదు కావాల్సి ఉందని పేర్కొన్నారు. అర్హులైన ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు అందరూ గడువు తేదీ, నవంబరు 6వ తేదీ లోగా ఫారం-19 ద్వారా ఓటర్లుగా నమోదు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

గంటల వ్యవధిలో రెండు ప్రమాదాలు.. తృటిలో బయటపడ్డ ఎమ్మెల్యే వీరేశం

- ప్రభుత్వ విప్ వేముల వీరేశంకు ఒకే రోజు రెండు రోడ్డు ప్రమాదాలు
- నల్గొండ జిల్లాలో తొలుత ఫార్చ్యూనర్, ఆపై ఇన్నోవా వాహనాలకు ప్రమాదం
- మొదటి ప్రమాదంలో ఎయిర్‌బ్యాగ్‌లు తెరుచుకోవడంతో తప్పిన ముప్పు
- రెండు ఘటనల్లోనూ సురక్షితంగా బయటపడ్డ ఎమ్మెల్యే వీరేశం

నల్గొండ (జర్నలిస్ట్ ఫైల్) : తెలంగాణ ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం ఒకే రోజు గంటల వ్యవధిలో రెండు వేర్వేరు రోడ్డు ప్రమాదాల నుంచి తృటిలో సురక్షితంగా బయటపడ్డారు. నల్గొండ జిల్లాలో గురువారం ఈ సంఘటనలు చోటుచేసుకున్నాయి. ఈ ప్రమాదాల్లో ఆయన ప్రయాణిస్తున్న రెండు కార్లు పాక్షికంగా దెబ్బతిన్నప్పటికీ, ఆయనకు ఎలాంటి గాయాలు కాకపోవడంతో కాంగ్రెస్ శ్రేణులు, ఆయన అనుచరులు ఊపిరి పీల్చుకున్నారు.

వివరాల్లోకి వెళితే.. ఎమ్మెల్యే వీరేశం గురువారం నకిరేకల్ నుంచి చిట్యాల మండలం చినకాపర్తికి తన ఫార్చ్యూనర్ వాహనంలో బయలుదేరారు. కట్టంగూరు మండలం చెర్వు అన్నారం స్టేజీ వద్ద జాతీయ రహదారిపై వెళుతుండగా, వెనుక నుంచి వేగంగా వచ్చిన ఒక కార్నివాల్ కారు ఆయన వాహనాన్ని బలంగా ఢీకొట్టింది. ఈ తాకిడికి ఎమ్మెల్యే కారు ముందు వెళుతున్న ఎస్కార్ట్ వాహనాన్ని ఢీకొంది. ప్రమాద తీవ్రతకు కారు పాక్షికంగా దెబ్బతిన్నప్పటికీ, ఎయిర్‌బ్యాగ్‌లు వెంటనే తెరుచుకోవడంతో వీరేశం సురక్షితంగా బయటపడ్డారు.

ఈ ఘటన జరిగిన వెంటనే భద్రతా సిబ్బంది అప్రమత్తమై, ఎమ్మెల్యేను మరో ఇన్నోవా క్రిస్టా కారులోకి మార్చి గమ్యస్థానానికి పంపించారు. అయితే, కొద్దిసేపటికే ఆ ప్రత్యామ్నాయ వాహనం కూడా ప్రమాదానికి గురైంది. చిట్యాల నుంచి తుంగతుర్తి వైపు వెళుతుండగా, ఒక లారీ వీరి కారును ఢీకొట్టింది. అదృష్టవశాత్తూ, ఈ రెండో ప్రమాదం నుంచి కూడా వీరేశం ఎలాంటి అపాయం లేకుండా బయటపడ్డారు.

వరుస ప్రమాదాల తర్వాత కూడా ఎమ్మెల్యే వీరేశం తన పర్యటనను కొనసాగిస్తూ జనగామకు వెళ్లారు. ఒకే రోజు రెండుసార్లు ప్రమాద గండం నుంచి తమ నేత క్షేమంగా బయటపడటంతో కాంగ్రెస్ కార్యకర్తలు, అభిమానులు ఊపిరి పీల్చుకున్నారు.

ప్రజా తీర్పును గౌరవించడంలో జగన్ డీఎన్ఏలోనే లేదు: ధూళిపాళ్ల నరేంద్ర

- ఓటు వేయని జగన్‌కు ఎన్నికలపై మాట్లాడే నైతిక హక్కు లేదు: ధూళిపాళ్ల నరేంద్ర
- అధికారంలో ఉన్నప్పుడు ఏకగ్రీవాలు గొప్ప.. ఇప్పుడు దౌర్జన్యమా అని ప్రశ్న
- అసెంబ్లీ, స్థానిక ఎన్నికల ఓటమిని జీర్ణించుకోలేకే వైసీపీ ఆరోపణలు
- కూటమి ప్రభుత్వంపై బురద చల్లడం మానుకోవాలని హితవు



మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్) : ఓటు హక్కు వినియోగించుకోని జగన్ కు ఎన్నికల గురించి మాట్లాడే నైతిక హక్కు లేదని పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ తీవ్రంగా విమర్శించారు. ప్రజా తీర్పును గౌరవించడం జగన్ డీఎన్ఏలోనే లేదని, ఆయన మాటల్లో ఆత్మస్తుతి, పరనింద తప్ప మరేమీ కనిపించడం లేదని ఎద్దేవా చేశారు. గురువారం మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. నేడు జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల పోలింగ్ నేపథ్యంలో జగన్ చేసిన వ్యాఖ్యలపై ఘాటుగా బదులిచ్చారు.

"ప్రజాస్వామ్యంలో ఓటు అనేది అత్యంత పవిత్రమైనది. పేదవాడి నుంచి రాష్ట్రపతి వరకు అందరికీ ఓటు ఉంటుంది. కానీ, బెంగళూరు నుంచి హెలికాప్టర్‌లో వచ్చి, పోలింగ్ బూత్ దగ్గరకు వెళ్లి ఓటు వేయకుండా వెనక్కి వచ్చిన ఏకైక రాజకీయ నాయకుడు జగన్. ఇది ప్రజాస్వామ్యం పట్ల, ప్రజల ఓటు పట్ల ఆయనకు ఉన్న చిన్నచూపును స్పష్టం చేస్తోంది. ఓటు వేయని నాయకుడిగా జగన్ చరిత్రలో నిలిచిపోతారు" అని ధూళిపాళ్ల అన్నారు.

2024 అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలిచ్చిన తీర్పును గౌరవించకుండా, ఈవీఎంల వల్లే కూటమి గెలిచిందని జగన్ ప్రచారం చేశారని, ఇప్పుడు బ్యాలెట్ పద్ధతిలో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ ఓటమి తర్వాత అదే పంథాను అనుసరిస్తున్నారని విమర్శించారు. "అధికారంలో ఉన్నప్పుడు ఏకగ్రీవాలు జరిగితే అద్భుతం అన్నారు. ఇప్పుడు అదే జరిగితే దౌర్జన్యం అంటున్నారు. ఇది ద్వంద్వ నీతి కాదా?" అని ఆయన ప్రశ్నించారు. వారి హయాంలో స్టేట్ ఎలక్షన్ కమిషన్‌ను నిర్వీర్యం చేశారని, నాటి కమిషనర్ ప్రాణభయంతో కేంద్రానికి లేఖ రాసిన విషయాన్ని జగన్ గుర్తుంచుకోవాలని హితవు పలికారు.

ప్రస్తుత స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసీపీ భారీ సంఖ్యలో నామినేషన్లు వేసిందని, వాస్తవాలను కప్పిపుచ్చి ప్రభుత్వంపై ఆరోపణలు చేస్తోందని నరేంద్ర కుమార్ అన్నారు. "ఎంపీటీసీ స్థానాల్లో 17,726, జెడ్పీటీసీల్లో 1,445, కార్పొరేషన్లలో 367 చోట్ల మీ అభ్యర్థులు నామినేషన్లు వేశారు. పోలీసులే మీకు రక్షణగా ఉండి నామినేషన్లు వేయించారు. నిజంగా ప్రభుత్వం రిగ్గింగ్ చేసి ఉంటే, మీ పార్టీకి చెందిన ఒక మేయర్ సహా నలుగురు అభ్యర్థులు ఎలా గెలిచారు?" అని నిలదీశారు.

ఎన్నికలను అడ్డుకోవడానికి డీలిమిటేషన్, బీసీ రిజర్వేషన్లపై వైసీపీ 61 కేసులు వేసిందని, అయినా సుప్రీంకోర్టు ప్రజాక్షేత్రంలో తేల్చుకోమని చెప్పడంతో ఎన్నికలు పారదర్శకంగా జరిగాయని వివరించారు. "వైసీపీ నమ్ముకున్నది విధ్వంసాన్ని. మేము నమ్ముకున్నది ప్రజలను, అభివృద్ధిని, సంక్షేమాన్ని. రెండేళ్లలో కూటమి ప్రభుత్వం చేసిన పనులను చూసే ప్రజలు స్థానిక ఎన్నికల్లోనూ వైసీపీని నాలుగు స్థానాలకే పరిమితం చేశారు" అని తెలిపారు. 2024లో ప్రజలిచ్చిన షాక్ ట్రీట్‌మెంట్‌ను మరోసారి స్థానిక ఎన్నికల్లో ఇచ్చారని, ఓటమిని జీర్ణించుకోలేక వైసీపీ నేతలు నిరాశతో మాట్లాడుతున్నారని అన్నారు.

అసెంబ్లీకి రాకుండా, అప్పుడప్పుడు వచ్చి ప్రభుత్వంపై బురద చల్లి వెళ్లే ధోరణిని జగన్ మానుకోవాలని ధూళిపాళ్ల సూచించారు. ప్రజాతీర్పును గౌరవించి, ప్రజా సమస్యలపై పోరాడాలని, అనవసరమైన ఆరోపణలతో ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయవద్దని ఆయన హితవు పలికారు. కూటమి ప్రభుత్వం ప్రజల సంక్షేమం, గ్రామాల అభివృద్ధి కోసం నిరంతరం పనిచేస్తుందని ఆయన స్పష్టం చేశారు.

INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక చందాదారులుగా చేరాలని అనుకుంటున్నారా? అయితే ఈ నెంబర్‌కు ఫోన్ చేయండి
సర్కులేషన్ మేనేజర్
76 61 80 59 68

క్యూలైన్లో నిలబడి ఓటు వేసిన హోం మంత్రి అనిత



అమరావతి (జర్నలిస్ట్ ఫైల్): ఆంధ్రప్రదేశ్ హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత పరిషత్ ఎన్నికల్లో తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. అనకాపల్లి జిల్లా నక్కపల్లిలోని ఒక పోలింగ్ కేంద్రంలో ఆమె ఓటు వేశారు. మంత్రిగా ఎలాంటి ప్రత్యేక ఏర్పాట్లు లేకుండా, ఒక సామాన్య పౌరురాలిగా తన కుటుంబసభ్యులతో కలిసి క్యూలైన్‌లో నిలబడటం అందరి దృష్టిని ఆకర్షించింది. తన వంతు వచ్చేవరకు అందరితో పాటు వేచి ఉండి ఆమె ఓటు వేశారు. పాయకరావుపేట నియోజకవర్గానికి ఆమె ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తుండగా, నక్కపల్లి మండలం ఆ నియోజకవర్గం పరిధిలోకే వస్తుంది.ఓటు వేసిన అనంతరం మంత్రి అనిత మీడియాతో మాట్లాడారు. "ప్రజాస్వామ్యంలో ఓటు చాలా కీలకం. ప్రతిఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలి" అని ఆమె ప్రజలకు పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్య ప్రక్రియలో పాల్గొనడం ప్రతి పౌరుడి బాధ్యత అని గుర్తుచేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఉదయం 7 గంటలకు ప్రారంభమైన ఈ పోలింగ్ సాయంత్రం 5 గంటల వరకు కొనసాగనుంది.

కూలీలను రక్షించిన ఎన్డిఆర్ఎఫ్ రెవిన్యూ, పోలీస్, సిబ్బంది



- జిల్లా యంత్రాంగం, ఎమ్మెల్యే చిర్రీ బాలరాజు చొరవతో పెద్దవాగు వరదలో చిక్కుకున్న 22 మంది కూలీలు సురక్షితం
- కూలీలు సురక్షితంగా వచ్చే వరకు సహాయక చర్యలను పర్యవేక్షించిన జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి
- జిల్లా యంత్రాంగానికి, జిల్లా కలెక్టర్ కు, ఎమ్మెల్యే చిర్రీ బాలరాజు కు కృతజ్ఞతలు తెలియజేసిన కూలీలు

ఏలూరు, నవంబర్ 5 (జర్నలిస్ట్ ఫైల్): బుట్టాయిగూడెం మండలం రెడ్డిగణపవరం, కనకపురం గ్రామాలకు చెందిన 22 మంది కూలీలు పామాయిల్ తోటలలో పనులు ముగించుకుని జీలుగుమిల్లి రౌతుగూడెం వంతెన వద్ద వచ్చేసరికి పెద్దవాగు వరద ఉధృతికి వంతెన రోడ్డు కొట్టుకుపోవడంతో కూలీలు వంతెనపై వరద నీటిలో చిక్కుకుపోయారు. పరిస్థితిని ఎమ్మెల్యే చిర్రీ బాలరాజు జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. పరిస్థితిని తెలుసుకున్న జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి తక్షణమే సహాయక చర్యలతో కూలీలను రక్షించేందుకు చర్యలను తీసుకున్నారు. ఎన్డిఆర్ఎఫ్ సిబ్బందితో తో పాటు స్థానిక పోలీస్, రెవిన్యూ సిబ్బంది సహాయక చర్యలలో పాల్గొన్నారు.

అత్యంత ప్రమాద పరిస్థితిలో ఉన్న కూలీలను జెసిబి సహాయంతో రక్షించి సురక్షితంగా బయటకు తీసుకువచ్చారు. వారిని బుట్టాయిగూడెం లోని తుఫాన్ పునరావాస కేంద్రానికి తరలించి ఆహారం అందించారు. అనంతరం వైద్య సహాయం అందించారు.

కూలీలు వరదలో చిక్కుకున్నారని తెలిసిన తక్షణమే స్పందించి జిల్లా యంత్రాంగాన్ని అప్రమత్తం చేసి తమ ప్రాణాలను రక్షించిన జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి కి, ఎమ్మెల్యే చిర్రీ బాలరాజు కు, జిల్లా యంత్రాంగానికి 22 మంది కూలీలు తమ కృతజ్ఞతలను తెలియజేసారు. జిల్లా యంత్రాంగానికి తాము జీవితాంతం రుణపడి ఉంటామన్నారు.

కనిపించకుండా పోయిన చిలుక ఆచూకీ చెప్పండి.. లక్ష రివార్డ్ పొందండి!

- వడోదరలో అదృశ్యమైన లడ్డూ అనే చిలుక
- ఆరు నెలల వయసున్న ఆఫ్రికన్ గ్రే జాతి పక్షి
- దానిని పట్టిచ్చిన వారికి లక్ష రూపాయల రివార్డ్
- కొడుకులా చూసుకుంటున్నామని కుటుంబం ఆవేదన
- దానంతట అదే ఆహారం తినలేదని ఆందోళన

అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :



వడోదరలో ఓ కుటుంబం తమ ఇంట్లో పెంచుకుంటున్న చిలుక కోసం తీవ్రంగా ఆందోళన చెందుతోంది. బిడ్డలా చూసుకుంటున్న 'లడ్డూ' అనే ఆరు నెలల ఆఫ్రికన్ గ్రే జాతి చిలుక కనిపించకుండా పోవడంతో, దానిని వెతికి పట్టుకొచ్చిన వారికి ఏకంగా రూ. 1 లక్ష బహుమతిగా ఇస్తామని ప్రకటించింది.

పారిఖ్ కుటుంబం తెలిపిన వివరాల ప్రకారం, అక్టోబర్ 31వ తేదీ సాయంత్రం 7 గంటల సమయంలో లడ్డూ, తన పంజరం తలుపును అదే తెరుచుకుని బయటకు ఎగిరిపోయింది. అప్పటి నుంచి దాని కోసం తీవ్రంగా గాలిస్తున్నారు. పుణేలోని ఓ బ్రీడర్ నుంచి తెచ్చుకున్న ఈ చిలుకకు దానంతట అదే ఆహారం తినడం రాదని, అందుకే తాము మరింత ఆందోళన చెందుతున్నామని దానిని పెంచుకుంటున్న జెస్సికా పారిఖ్ తెలిపారు.

లడ్డూ కోసం సేవాసి, గోత్రి, భయ్లా వంటి ప్రాంతాల్లో వెతికారు. తమ వాయిస్‌ను రికార్డ్ చేసి ప్లే చేయడం, ఈలలు వేయడం వంటి ప్రయత్నాలు చేసినా ఫలితం లేకపోయింది. దాని కాలికి లైసెన్స్ నంబర్‌తో కూడిన రింగ్ ఉందని, బహుశా అది ఏదైనా నిర్మానుష్య ప్రదేశంలో లేదా నది సమీపంలో ఉండవచ్చని కుటుంబ సభ్యులు భావిస్తున్నారు. ఆఫ్రికన్ గ్రే జాతి చిలుకలు తమ యజమానులతో చాలా బలమైన బంధాన్ని ఏర్పరుచుకుంటాయని చెబుతారు. ఇప్పుడు తమ లడ్డూ తిరిగి రావాలని ఆ కుటుంబం ఆశగా ఎదురుచూస్తోంది.

హోదా పక్కనపెట్టి.. సామాన్య ఓటరుగా క్యూలో నిలబడిన మంత్రి అచ్చెన్నాయుడు

- ప్రజాస్వామ్య స్ఫూర్తికి నిదర్శనంగా కుటుంబ సభ్యులతో కలిసి ఓటు హక్కు వినియోగం
- ఓటు ముందు అందరూ సమానమే.. ప్రజాస్వామ్యంలో ప్రజలే అంతిమ నిర్ణేతలు
- ప్రజల భవిష్యత్తును నిర్ణయించే శక్తిమంతమైన ఆయుధం ఓటు - మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు
- పలోభాలకు, ఒత్తిళ్లకు తలొగ్గకుండా ప్రతి ఒక్కరూ స్వేచ్ఛగా ఓటు వేయాలని పిలుపు



శ్రీకాకుళం జిల్లా, నిమ్మాడ, నవంబర్ 5:, (జర్నలిస్ట్ ఫైల్):అధికారిక హోదా కంటే ప్రజాస్వామ్య విలువలే గొప్పవని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆచరణలో చాటిచెప్పారు. శ్రీకాకుళం జిల్లా నిమ్మాడ ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో సామాన్య ఓటరుగా క్యూలో నిలబడి తన ఓటు హక్కును వినియోగించు కున్నారు. మంత్రి అచ్చెన్నాయుడుతో పాటు ఆయన సతీమణి కింజరాపు విజయమాధవి, కుమారుడు కింజరాపు కృష్ణమోహన్ నాయుడు కూడా ఓటు వేశారు. మంత్రి హోదాలో ఉన్నప్పటికీ ఎలాంటి ప్రత్యేక ప్రాధాన్యం ఆశించకుండా ఇతర ఓటర్లతో కలిసి క్యూలైన్‌లో నిలబడి తన వంతు వచ్చే వరకు వేచి ఉండటం ద్వారా ప్రజాస్వామ్యంలో ప్రతి పౌరుడూ సమానమేనన్న సందేశాన్ని అచ్చెన్నాయుడు చాటిచెప్పారు. రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును వినియోగించు కోవడంలో సామాన్యుడైనా, ప్రజాప్రతినిధైనా అందరూ సమానమేనని తన చర్యతో నిరూపించారు. ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ప్రజలే యజమానులు. ఓటు అనేది కేవలం గుర్తుపై వేసే ముద్ర కాదు.. ప్రజల భవిష్యత్తును, సమాజ గతిని నిర్ణయించే శక్తిమంతమైన ఆయుధం. ప్రజాస్వామ్య వ్యవస్థకు ఓటే పునాది. ప్రతిఓటుకూ విలువ ఉంది. ఒక్కఓటు కూడా ప్రజాతీర్పును మార్చగలదు అని పేర్కొన్నారు. ఎన్నికలు ప్రజాస్వామ్యానికి పండుగలాంటివని, అర్హులైన ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. ఎలాంటి ప్రలోభాలకు, బెదిరింపులకు, ఒత్తిళ్లకు లోనుకాకుండా స్వేచ్ఛగా, నిర్భయంగా ఓటు వేయాలని సూచించారు.

ఓటు వేయడం కేవలం రాజ్యాంగబద్ధమైన హక్కు మాత్రమే కాదని, సమాజ భవిష్యత్తు పట్ల ప్రతి పౌరుడికీ ఉన్న బాధ్యత అని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్య విలువలను కాపాడటం ప్రతి ఒక్కరి కర్తవ్యమని, చైతన్యవంతమైన ఓటర్లే బలమైన ప్రజాస్వామ్యానికి పునాదులని మంత్రి అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. ప్రతి పౌరుడూ బాధ్యతాయుతంగా ఓటు హక్కును వినియోగించుకుని ప్రజాస్వామ్య పరిరక్షణలో భాగస్వామి కావాలని ఆకాంక్షించారు.

అయ్యప్ప సొసైటీపై సర్వే చేయాలి

- అయ్యప్ప సొసైటీ అక్రమ కట్టడాలపై సర్వేకు కవిత డిమాండ్
- కాంగ్రెస్ వచ్చాక 750 అక్రమ నిర్మాణాలు జరిగాయని ఆరోపణ

హైదరాబాద్(జర్నలిస్ట్ ఫైల్): హైదరాబాద్‌లోని ఖానామెట్ అయ్యప్ప సొసైటీలో జరుగుతున్న అక్రమ నిర్మాణాలపై సమగ్ర సర్వే నిర్వహించాలని టీఆర్ఎస్ అధినేత్రి కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. ఇందుకోసం రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి నెల రోజుల గడువు ఇస్తున్నామని, లేదంటే తమ పార్టీ కార్యకర్తలే అక్రమ కట్టడాలకు 'రెడ్ మార్క్' వేస్తారని హెచ్చరించారు. హైదరాబాద్ లో మీడియాతో మాట్లాడుతూ ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు.

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత అయ్యప్ప సొసైటీలో సుమారు 750 అక్రమ నిర్మాణాలు జరిగాయని కవిత ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోదరులే దగ్గరుండి పర్మిషన్లు ఇప్పించి డబ్బులు దండుకుంటున్నారని సంచలన వ్యాఖ్యలు చేశారు. భూములు, టీడీఆర్ అక్రమ దందాలు తప్ప సీఎం రేవంత్‌కు మరేమీ కనిపించడం లేదని ఆమె విమర్శించారు. ఈ వ్యవహారంలో సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ ఏం చేస్తున్నారని ప్రశ్నించారు.

అయ్యప్ప సొసైటీలో రిజిస్ట్రేషన్లు జరగవని, అక్కడ ఇళ్లు కొనుగోలు చేసి ప్రజలు నష్టపోవద్దని కవిత సూచించారు. గురుకుల ట్రస్ట్ భూములపై గతంలో తాము ఎన్నో ఉద్యమాలు చేశామని గుర్తుచేశారు. ఇదే సొసైటీలో నారాయణ, చైతన్య వంటి విద్యాసంస్థలు కూడా ఉన్నాయని ఆమె తెలిపారు. కేంద్ర మంత్రి అమిత్ షా హైదరాబాద్ పర్యటనపైనా కవిత స్పందిస్తూ, ఆయన కేవలం రాజకీయాలు మాట్లాడి వెళ్లారని, రాష్ట్రంలోని కరవు పరిస్థితులపై స్పందించలేదని విమర్శించారు.

ఉద్యోగులకు ఉచిత క్యాన్సర్ పరీక్షలు

- నవంబర్ 16 నుంచి 20 వరకు ప్రత్యేక వైద్య శిబిరం.. ముందస్తు రిజిస్ట్రేషన్ తప్పనిసరి

గుంటూరు, నవంబర్ 5 (జర్నలిస్ట్ ఫైల్) : ఏపీ ఎన్జీజీఓ అసోసియేషన్ ఆధ్వర్యంలో గుంటూరు జిల్లాలోని ప్రభుత్వ ఉద్యోగులకు ఉచిత క్యాన్సర్ పరీక్షలు నిర్వహించనున్నట్లు జిల్లా అధ్యక్షుడు, జేఏసీ చైర్మన్ ఘంటసాల శ్రీనివాస్ తెలిపారు. నవంబర్ 16 నుంచి 20వ తేదీ వరకు నాలుగు రోజులపాటు నిర్వహించే ఈ పరీక్షల్లో బ్రెస్ట్ క్యాన్సర్, సర్వైకల్ క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు ఉచితంగా అందించనున్నట్లు వెల్లడించారు.

ఈ కార్యక్రమంపై గురువారం గుంటూరులోని ఏపీ ఎన్జీజీఓ హోమ్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గుంటూరు మెడికల్ కాలేజీ అసిస్టెంట్ ప్రొఫెసర్, కమ్యూనిటీ మెడిసిన్ కోఆర్డినేటర్ డాక్టర్ ముస్సిన మాట్లాడుతూ క్యాన్సర్‌ను ప్రాథమిక దశలోనే గుర్తించడం ద్వారా మెరుగైన చికిత్స అందించి ప్రాణాపాయాన్ని తగ్గించవచ్చని తెలిపారు. ప్రతి ఒక్కరూ క్రమం తప్పకుండా అవసరమైన వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఉద్యోగులకు అందుబాటులోకి తీసుకొస్తున్న ఈ ఉచిత పరీక్షల అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఏపీ ఎన్జీజీఓ నాయకులు పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి శ్రీనివాస్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు షేక్ షరీఫ్, అనిల్, గుంటూరు నగర అధ్యక్షుడు చింతల కళ్యాణ్ కుమార్, కార్యదర్శి కోటేశ్వరరావు, జిల్లా మహిళా చైర్మన్ తాజున్నిసా, కన్వీనర్ విజయలక్ష్మి, రాష్ట్ర వైస్ చైర్మన్ పద్మజ, జిల్లా కార్యవర్గ సభ్యులు, నగర శాఖ ప్రతినిధులు పాల్గొన్నారు.రిజిస్ట్రేషన్ వివరాలు: ఉచిత పరీక్షలు చేయించుకోవాలనుకునే ఉద్యోగులు ముందుగా తమ పేర్లను నమోదు చేసుకోవాలి.
ఫోన్ నంబర్లు: 9494152952, 9985295022.

ఎన్నికల విధుల్లో టీచర్ మృతి.. చంద్రబాబు, నారా లోకేశ్ తీవ్ర విచారం

- అనంతపురం జిల్లాలో ఎన్నికల విధుల్లో విషాదం
- అస్వస్థతకు గురై పోలింగ్ అధికారిణి హరిత మృతి
- కదిరదరకుంట పోలింగ్ కేంద్రంలో ఘటన
- కుటుంబానికి అండగా ఉంటామని సీఎం చంద్రబాబు హామీ
- ప్రగాఢ సానుభూతి తెలియజేసిన విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్



అమరావతి (జర్నలిస్ట్ ఫైల్): ఆంధ్రప్రదేశ్‌లో నేడు జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల విధుల్లో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. అనంతపురం జిల్లాలో పోలింగ్ అధికారిణిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న ఓ ఉపాధ్యాయురాలు అకస్మాత్తుగా మరణించారు. ఈ ఘటన గురువారం కూడేరు మండలంలో జరిగింది.

వివరాల్లోకి వెళితే, కూడేరు మండలం కాడదారకుంట గ్రామంలోని పోలింగ్ కేంద్రంలో అసిస్టెంట్ ప్రిసైడింగ్ ఆఫీసర్‌గా (ఏపీఓ) హరిత గౌడ్ (58) విధుల్లో ఉన్నారు. ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ జరుగుతుండగా ఆమె తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది పడుతూ పోలింగ్ కేంద్రంలోనే కుప్పకూలిపోయారు. వెంటనే అప్రమత్తమైన అక్కడి వైద్యసిబ్బంది ఆమెను కూడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. వైద్యులు అత్యవసర చికిత్స అందించినప్పటికీ ఫలితం లేకపోయింది. గుండెపోటు రావడంతో మధ్యాహ్నం సుమారు 12:50 గంటలకు ఆమె తుదిశ్వాస విడిచినట్లు అధికారులు తెలిపారు.

మృతురాలు హరిత, డి.హిరేహాళ్ మండలం పూలకుర్తి గ్రామంలోని ఎంపీయూపీ పాఠశాలలో సెకండరీ గ్రేడ్ టీచర్‌గా (ఎస్జీటీ) పనిచేస్తున్నారు. ఎన్నికల విధుల్లో ఉపాధ్యాయురాలు మరణించడం స్థానికంగా తీవ్ర విషాదాన్ని నింపింది.

ఈ ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. హరిత కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ప్రభుత్వం తరపున బాధిత కుటుంబానికి అన్నివిధాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

అదేవిధంగా, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ కూడా తీవ్ర విచారం వ్యక్తం చేశారు. "అనంతపురం జిల్లా కూడేరు మండలం కాడదారకుంటలో ఏపీవోగా విధులు నిర్వహిస్తున్న టీచర్ హరిత గౌడ్ గారు గుండెపోటుతో కన్నుమూయడం చాలా బాధాకరం.

అస్వస్థతకు గురైన వెంటనే అత్యవసర వైద్యం అందించినా ఫలితం లేక మృతి చెందడం ఈ విషాదం నెలకొంది. వారికి నివాళులు అర్పిస్తున్నాను. కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను" అంటూ సోషల్ మీడియాలో స్పందించారు.

జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు ప్రశాంతం.. ఓటమి భయంతోనే వైసీపీ అరాచకాలు: పల్లా

- జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో వైసీపీ హింసకు పాల్పడిందన్న పల్లా
- ఓటమి భయంతోనే ఓటర్లను భయపెట్టి గెలవాలని చూస్తున్నారని విమర్శలు
- పులివెందుల, కడప గొడవలకు జగన్ కారణమని ఆరోపణ
- అర్బన్ ఎన్నికల ఫలితాలే వైసీపీ భయానికి నిదర్శనమని వ్యాఖ్యలు
- ప్రజాస్వామ్య విలువలను కాపాడతామన్న టీడీపీ ఏపీ చీఫ్



అమరావతి (జర్నలిస్ట్ ఫైల్): రాష్ట్రంలో జరుగుతున్న జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో ఓటమి తప్పదనే భయంతోనే వైసీపీ అరాచకాలకు, హింసకు పాల్పడుతోందని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు తీవ్రస్థాయిలో ఆరోపించారు. గొడ్డలి పార్టీ అబద్ధాలు, దౌర్జన్యాలతో ఓటర్లను భయభ్రాంతులకు గురిచేసి గెలవాలని చూస్తోందని ఆయన విమర్శించారు. గురువారం మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ఎన్నికలు ప్రశాంతంగా జరుగుతున్నప్పటికీ, కొన్ని ప్రాంతాల్లో వైసీపీ నేతలు ఉద్దేశపూర్వకంగా గొడవలు సృష్టిస్తున్నారని అన్నారు.

ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో కూటమికి సుమారు 95 శాతం స్ట్రైక్‌రేట్‌తో ప్రజలు అద్భుతమైన తీర్పు ఇచ్చారని పల్లా శ్రీనివాసరావు గుర్తుచేశారు. అదే ఫలితం ఈ ఎన్నికల్లోనూ పునరావృతం అవుతుందనే భయంతోనే జగన్ హింసాత్మక మార్గాలను ఎంచుకున్నారని ఆయన దుయ్యబట్టారు. "పులివెందులలోని ఎర్రిపల్లిలో బాంబు దాడులతో ఓటర్లను భయపెట్టే ప్రయత్నాలు చేయడమే ఇందుకు నిదర్శనం. రాష్ట్రవ్యాప్తంగా ఓటింగ్ శాతం ప్రశాంతంగా నమోదవుతుంటే, కడపలో తక్కువగా ఉండటానికి వైసీపీ కుట్రలే కారణం" అని ఆయన స్పష్టం చేశారు. కడప ఎంపీ అవినాశ్ రెడ్డి, జగన్ కుటుంబ సభ్యులు నిబంధనలకు విరుద్ధంగా పోలింగ్ బూత్‌లలోకి ప్రవేశిస్తూ ఎన్నికల ప్రక్రియను అపహాస్యం చేస్తున్నారని ఆరోపించారు.

రాష్ట్రంలోని పలుచోట్ల వైసీపీ అరాచకాలకు పాల్పడుతోందని పల్లా ఉదాహరణలతో వివరించారు. కుప్పంలో బయటి ప్రాంతాల నుంచి రౌడీలను తీసుకొచ్చి దొంగ ఓట్లు వేయించే ప్రయత్నం చేస్తున్నారని, తిరుపతిలో గతంలో మాదిరిగానే ఆధార్ కార్డులు మార్చి నకిలీ ఓటర్లతో ఓట్లు వేయిస్తున్నారని ఆరోపించారు. రామచంద్రపురంలో ఓటర్లకు డబ్బు పంచి బలవంతం చేయడం, జమ్మలమడుగులో మాజీ మంత్రి రామసుబ్బారెడ్డి కుమారుడి దౌర్జన్యం, రైల్వే కోడూరు, అనంతపురంలో పెట్రోల్ బాంబుల దాడులు వంటి సంఘటనలు వైసీపీ అరాచక విధానాన్ని తెలియజేస్తున్నాయని అన్నారు.

"రాష్ట్రమంతా ఎన్నికలు స్వేచ్ఛగా జరుగుతుంటే పులివెందుల వంటి ప్రాంతాల్లోనే గొడవలు ఎందుకు జరుగుతున్నాయో ప్రజలు ఆలోచించాలి. ఇది రాజకీయమా లేక రౌడీజమా?" అని పల్లా శ్రీనివాసరావు నిలదీశారు. పులివెందులలో ప్రజలు స్వేచ్ఛగా ఓటు వేయడానికి వస్తుంటే పెట్రోల్ బాంబులు వేయడం, బూత్ క్యాప్చరింగ్ వంటి దుర్మార్గపు చర్యలకు వైసీపీ పాల్పడుతోందని మండిపడ్డారు.

కూటమి ప్రభుత్వంపై నమ్మకంతో ప్రజలు స్వేచ్ఛగా బయటకు వచ్చి ఓటు హక్కు వినియోగించుకుంటున్నారని పల్లా తెలిపారు. జగన్ ఇప్పటికైనా దుష్ప్రచారాలు, హింసా రాజకీయాలు మానుకుని ప్రజా తీర్పును గౌరవించాలని హితవు పలికారు. విద్వేషం, హింస ద్వారా గెలవాలనుకుంటే రాయలసీమ ప్రజలతో సహా రాష్ట్ర ప్రజానీకం ఎవరూ సహించరని హెచ్చరించారు. ప్రజాస్వామ్య విలువలను కాపాడేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన స్పష్టం చేశారు.

ఓటు వేయని జగన్‌కు ప్రజాస్వామ్యం గురించి మాట్లాడే నైతిక హక్కు లేదు



- మంత్రి సత్యకుమార్ యాదవ్

అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):వైఎస్సార్‌సీపీ అధినేత జగన్ ఓటు వేయడానికి కూడా ముందుకు రాకుండా ఓటమి భయంతో పారిపోయారు. అలాంటి వ్యక్తి ఇప్పుడు ప్రజాస్వామ్యం, ఎన్నికల పారదర్శకత గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ విమర్శించారు. ప్రజాస్వామ్యంపై జగన్‌కు నిజంగా గౌరవం ఉంటే ప్రజల తీర్పును శిరసావహించాలి. ఎన్నికల్లో ఓటమిని అంగీకరించలేక వ్యవస్థలపై నిందలు వేయడం ఆయన రాజకీయ దిగజారుడుతనానికి నిదర్శనమని పేర్కొన్నారు.

2019లో మెజార్టీ స్థానాలు సాధించినప్పుడు ప్రజల తీర్పుగా చెప్పుకున్న జగన్.. 2024, ప్రస్తుత ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పును ఎందుకు గౌరవించడం లేదని మంత్రి ప్రశ్నించారు. శాసనసభ సమావేశాలకు రాకుండా నాలుగు గోడల మధ్య మాత్రమే మైకు ముందు మాట్లాడే జగన్‌కు అధికారం ఉన్నప్పుడు ప్రజాస్వామ్యం గొప్పగా కనిపించడం, అధికారం కోల్పోయాక అదే వ్యవస్థపై ఆరోపణలు చేయడం ఆయనలోని నైరాశ్యాన్ని స్పష్టం చేస్తోందన్నారు. ఎన్నికల ప్రక్రియపై జగన్ చేస్తున్న ఆరోపణలు రాజకీయ ప్రయోజనాల కోసమేనని మంత్రి పేర్కొన్నారు. ఎన్నికల నిర్వహణలో ఎక్కడైనా లోపాలు ఉంటే చట్టబద్ధమైన మార్గాల్లో వాటిని నిరూపించుకోవాలి తప్ప, ప్రజలను తప్పుదోవ పట్టించేలా ప్రకటనలు చేయడం బాధ్యతారాహిత్యమని విమర్శించారు. సంక్షేమ పాలన వల్ల కూటమి ప్రభుత్వానికి ప్రజలు పట్టం కట్టారని పేర్కొన్నారు. ప్రజల సంక్షేమం, అభివృద్ధి, పారదర్శక పాలన తమ ప్రభుత్వ ప్రాధాన్యాలని తెలిపారు. ప్రజలు ఇచ్చిన తీర్పే అంతిమమని, ఆ తీర్పును గౌరవించలేని జగన్ ప్రజాస్వామ్య పాఠాలు చెప్పడం హాస్యాస్పదమని సత్యకుమార్ యాదవ్ మండిపడ్డారు.

"సాయన్న పేరులోనే సాయముందిరా!"..



- పార్టీ సన్నాహక గీతం పంచుకున్న విజయసాయిరెడ్డి
- వైసీపీకి రాజీనామా చేసి, సొంత పార్టీ ఏర్పాటు చేస్తున్న విజయసాయిరెడ్డి
- నవంబరు 11న పార్టీ పేరు ప్రకటించనున్న వైనం
- సన్నాహక గీతంతో పార్టీ ఏర్పాటు ప్రక్రియ ముమ్మరం

అమరావతి (జర్నలిస్ట్ ఫైల్): వైసీపీకి రాజీనామా చేసి సొంత రాజకీయ పార్టీ ఏర్పాటుకు సిద్ధమైన రాజ్యసభ మాజీ సభ్యుడు విజయసాయిరెడ్డి, తన పార్టీ విషయంలో కీలక అడుగు ముందుకేశారు. పార్టీ పేరును అధికారికంగా ప్రకటించకముందే, తన భావజాలాన్ని, లక్ష్యాలను ప్రతిబింబించేలా రూపొందించిన ఒక సన్నాహక గీతాన్ని గురువారం సోషల్ మీడియా ద్వారా పంచుకున్నారు. "సాయన్న పేరులోనే సాయముందిరా.. విజయసాయిరెడ్డి అన్న అడుగులోనే విజయముందిరా!" అంటూ సాగే ఈ గీతం ప్రస్తుత రాజకీయ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది.

విజయసాయిరెడ్డి తన కొత్త రాజకీయ పార్టీ పేరును నవంబర్ 11న ప్రకటించనున్నట్లు ఇప్పటికే స్పష్టం చేశారు. ఈ ప్రకటనకు కొద్దిరోజుల ముందే ఈ పాటను విడుదల చేయడం ద్వారా, ప్రజల్లోకి వెళ్లేందుకు ఆయన వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నట్లు స్పష్టమవుతోంది. తన అనుచరుల్లో, కార్యకర్తల్లో ఉత్సాహం నింపేందుకే ఈ గీతాన్ని విడుదల చేసినట్లు తెలుస్తోంది.ఒకప్పుడు వైసీపీలో నంబర్ 2గా, అత్యంత కీలక నేతగా చక్రం తిప్పిన విజయసాయిరెడ్డి ప్రస్థానం అనూహ్య మలుపులు తిరిగింది. 2024 సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ తరఫున లోక్‌సభకు పోటీ చేసి ఓటమి పాలైన నాటి నుంచి ఆయన పార్టీ కార్యక్రమాలకు, నాయకత్వానికి క్రమంగా దూరం జరుగుతూ వచ్చారు. ఈ పరిణామాల మధ్య పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించిన ఆయన, ఆ తర్వాత సజ్జల రామకృష్ణారెడ్డిపై తీవ్రమైన ఆరోపణలు చేసి సంచలనం సృష్టించారు.

వైసీపీతో బంధం తెంచుకున్న తర్వాత ఆయన ఏదైనా జాతీయ పార్టీలో చేరతారని లేదా మరో ప్రాంతీయ పార్టీలో కీలక పాత్ర పోషిస్తారని విస్తృతంగా ప్రచారం జరిగింది. అయితే, ఆ ఊహాగానాలన్నింటికీ తెరదించుతూ, ఆయన సొంతంగానే రాజకీయ శక్తిగా ఎదిగేందుకు నిర్ణయించుకున్నారు. అందులో భాగంగానే ఇప్పుడు కొత్త పార్టీ ఏర్పాటు దిశగా వేగంగా అడుగులు వేస్తున్నారు.

Owned, Edited & Published by D.Ajay. Published from 126-352, 4Th Lane, Kodandarama Nagar, Gorlavaripalem Road, Gorantla, Guntur-522034 (A.P).
Printed by C.Sridhar Reddy at Teja Cards and Stationery, Shop no.1, 22-11-170, T.V Street, Lalapet,Guntur-522003(A.P.). Editor : D.Ajay. Phones: 7661805968, 9966319999. Email: dasariajjay@gmail.com